PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 123 | విజయవాడ, గురువారం 4 డిసెంబర్ 2025 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Thursday 4 December 2025 | Rs

మాఫియాను ఆపేదెవరు?

- యథేచ్ఛగా గంజాయి రవాణా, అమ్మకాలు
- పోలీసులు కేసులు పెడుతున్నా, అరెస్టులు చేస్తున్నా ఆగని దందా
- మత్తుకు బానిసవుతున్న యువత

3

రెండో వన్డేలో టీమిండియాకు నిరాశ

- భారీ లక్ష్యాన్ని ఛేదించిన దక్షిణాఫ్రికా
- మార్క్రమ్ శతకం, బ్రెవీస్, బ్రీజ్కే మెరుపులు
- కోహ్లి, గైక్వాడ్ సెంచరీలు వృధా



6

రైతులతో నిర్వహించిన ముఖాముఖిలో మాట్లాడుతున్న చంద్రబాబు

లాభసాటిగా వ్యవసాయం

- పంచసూత్ర ప్రణాళికతో ముందుకెళ్తున్నాం
- నదులను అనుసంధానం చేస్తాం
- భూగర్భ జలాలను పెంచుకోగలిగితే కరువు ఉండదు
- 'రైతన్నా–మీకోసం' సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తామని, అందులో భాగంగానే పంచసూత్ర ప్రణాళికతో ముందుకెళ్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. పంచసూత్రాలపై అవగాహన కల్పించేందుకే 'రైతన్నా–మీకోసం' కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం నియోజకవర్గం నల్లజర్లలో బుధవారం ఆయన 'రైతన్నా–మీ కోసం' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా రైతులతో చంద్రబాబు ముఖాముఖి నిర్వహించారు. వ్యవసాయ యాక్షన్ ప్లాన్‌పై చర్చించారు. అంతకుముందు రైతులు సాగు చేస్తున్న అంతర పంటలను, వ్యవసాయ, అనుబంధ రంగాల స్టాళ్లను పరిశీలించారు. అనంతరం రైతులను ఉద్దేశించి ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో 62 శాతం మంది వ్యవసాయ, అనుబంధ రంగాలపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. అందుకే సాగును లాభసాటి చేసేందుకు ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు. వ్యవసాయంతోపాటూ అనుబంధ రంగాలపైనా దృష్టి పెట్టాలన్నారు. రాబోయే రోజుల్లో గోదావరితో వంశధార, పెన్నా నదులను అనుసంధానం చేస్తామని తెలిపారు. పోలవరం కుడి కాలువ నుంచి నీరిస్తే ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు పెరుగుతాయని, భూగర్భ జలాలను పెంచుకోగలిగితే కరువు ఉండదని అన్నారు. కృష్ణా, గోదావరి నదుల నుంచి సముద్రంలోకి నీరు వృథాగా సముద్రంలోకి పోతోందని, ఈ నదులను అనుసంధానం చేసి ప్రతి ఎకరాకు సాగు నీరందిస్తామని తెలిపారు. డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయాలని, వినూత్న పద్ధతుల్లో విభిన్న పంటలు పండించాలని రైతులకు సూచించారు. పామాయిల్ సాగులో టెక్నాలజీ ఉపయోగించి తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందొచ్చన్నారు. ప్రపంచీకరణతో వ్యవసాయంలోనూ మార్పులు వచ్చాయని వివరించారు. ఎక్కడో ఉక్రెయిన్‌లో జరిగిన యుద్ధం మిగతా 5లో

బీజాపూర్ అడవుల్లో రక్తపుటేర్లు

- ఎదురుకాల్పుల్లో 12 మంది మావోయిస్టులు మృతి
- ముగ్గురు జవాన్లు కూడా..

ప్రజాశక్తి - చర్ల

పచ్చని బీజాపూర్ అడవుల్లో రక్తపుటేరులు పారాయి. పోలీసులకు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో 12 మంది మావోయిస్టులు, ముగ్గురు జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. బస్తర్ ఐజీ సుందర్‌లాల్ తెలిపిన వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్‌లోని దంతేవాడ – బీజాపూర్ జిల్లా సరిహద్దు దండకారణ్యంలో బుధవారం భద్రతా దళాల కాల్పుల్లో మరణించిన 12 మంది మావోయిస్టుల్లో డివిజనల్ కమిటీ సభ్యుడు (డివిసిఎం) వెల్ల మోడియం కూడా ఉన్నారు. ముగ్గురు డిఆర్‌జి జవాన్లు సైతం మరణించినట్లు ఐజి తెలిపారు. అందరి మృతదేహాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఘటనా స్థలం నుంచి ఒక ఎస్–ఎల్ఆర్ రైఫిల్, 303 రైఫిల్ మందుగుండు సామగ్రిని రికవరీ చేసినట్లు చెప్పారు. దండకారణ్యంలో భద్రతాబలగాలు భారీగా మోహరించాయి.

బీజాపూర్ డిఆర్‌జి సైనికులు, హెడ్ కానిస్టేబుల్ మోను వాడరి, రమేష్ సోడి, కానిస్టేబుల్ దుకారు గొండే ఈ ఎన్‌కౌంటర్‌లో మరణించారని బస్తర్ రేంజ్ ఐజి సుందర్‌రాజ్ పి. పేర్కొన్నారు. ఎన్‌కౌంటర్‌లో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశమున్నట్టు వారు వివరించారు. స్పెషల్ టాస్క్ ఫోర్స్ (డిఆర్‌జి), స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్‌టిఎఫ్), కోబ్రా, సిఆర్‌పిఎఫ్‌ల సంయుక్త బృందం బుధవారం ఉదయం నుంచి బీజాపూర్–దంతేవాడ సరిహద్దులోని పశ్చిమ బస్తర్ డివిజన్ ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ నిర్వహించినట్లు పోలీస్ సూపరింటెండెంట్ జితేంద్ర యాదవ్ తెలిపారు.

రద్దు చేయాల్సిందే

లేబర్ కోడ్లపై ప్రతిపక్షాల ఆందోళన

ప్రజాశక్తి–న్యూఢిల్లీ బ్యూరో

'కార్పొరేట్ జంగిల్ రాజ్ వద్దు - కార్మికులకు న్యాయం కావాలి' అంటూ నినాదిస్తున్న ప్రతిపక్ష పార్టీల నేతలు

కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను కాలరాస్తూ, కార్పొరేట్లకు అనుకూలంగా మోడీ సర్కార్ తీసుకొచ్చిన లేబర్ కోడ్లను రద్దు చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. పార్లమెంట్ ఆవరణలోని మకరద్వారం ఎదుట కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ, డిఎంకె, టిఎంసి, ఎన్‌సిపి, ఆర్‌జెడి, ఎస్‌పి, ఐయుఎంఎల్ తదితర ప్రతిపక్ష నేతలు బుధవారం ఆందోళన చేపట్టారు. 'కార్పొరేట్ జంగిల్ రాజ్ వద్దు – కార్మికులకు న్యాయం కావాలి' అంటూ భారీ బ్యానర్‌ను ప్రదర్శించారు. కార్మికులను బానిసలుగా మార్చే లేబర్ కోడ్లను వెనక్కి తీసుకోవాలని నేతలు ప్లకార్డులు చేబూని పెద్దపెట్టున నినాదాలు చేశారు. రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ.. మోడీ ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకమని, కార్పొరేట్లకు అనుకూలమని విమర్శించారు. 'కొత్త కోడ్‌లు ఉద్యోగ భద్రతకు ముప్పు. లేఆఫ్ పరిమితిని 100 నుండి 300 మందికి పెంచారు. దేశంలోని 80 శాతం కంటే ఎక్కువ పరిశ్రమలు ఇప్పుడు ప్రభుత్వ అనుమతి లేకుండా కార్మికులను తొలగించవచ్చు. ఉద్యోగ భద్రతను కాలరాస్తున్నారు. స్థిర కాల ఉపాధి (ఎఫ్‌టిఇ) విస్తరణ అనేక శాశ్వత ఉద్యోగాలకు ముగింపు పలికింది. కంపెనీలు ఇప్పుడు స్వల్పకాలిక ఒప్పందాలపై కార్మికులను నియమించుకోవచ్చు. దీర్ఘకాలిక ప్రయోజనాలు ఉండవు' అని ఆయన అన్నారు. కోడ్ ఎనిమిది గంటల పని దినాన్ని కాగితంపై ఉంచినప్పటికీ, రాష్ట్రాలు 12 గంటల షిఫ్ట్‌లను అనుమతించవచ్చని చెప్పారు. 'రాష్ట్రాలు నిర్ణయించిన ఓవర్ టైమ్ పరిమితులతో కలిపి, చాలా ఎక్కువ పనిదినాలను అనుమతిస్తుంది. 'ఏకాభిప్రాయం' అని లేబుల్ చేయబడినప్పటికీ అలసట, భద్రతా ప్రమాదాలను పెంచుతుంది' అని అన్నారు. 'కార్మికులు సమ్మె చేయడానికి 60 రోజులపాటు వేచి ఉండాలి. ఇది అన్యాయమైన పరిస్థితులను సృష్టం చేస్తోంది. 51 శాతం సభ్యత్వం కలిగిన ఒక యూనియన్‌ను ఏకైక సంధానకర్తగా ఉంచడం చిన్న యూనియన్లను పక్కన పెడుతుంది. విభిన్న కార్మిక సమూహాలకు ప్రాతినిధ్యం తగ్గిస్తుంది' అని పేర్కొన్నారు. 300 కంటే తక్కువ మంది కార్మికులున్న యూనిట్లకు స్టాండింగ్ ఆర్డర్లు వర్తించవని ఆయన తెలిపారు. ఈ కోడ్‌లు కార్మికుల భద్రత, మిగతా 5లో

సంచార్ సాథీపై వెనక్కితగ్గిన కేంద్రం 5

సిఎం చంద్రబాబుతో అదాని భేటీ

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో అదాని గ్రూప్స్ సంస్థల ఛైర్మన్ గౌతమ్ అదాని సమావేశమయ్యారు. ఉండవల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో బుధవారం ఈ సమావేశం జరిగింది. ప్రత్యేక విమానం ద్వారా రాత్రి 7 గంటలకు అదాని గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. అనంతరం ఆయన ముఖ్యమంత్రిని తన నివాసంలో కలిశారు. చంద్రబాబుతో పాటు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అదానికి పూల బొకేతో స్వాగతం పలికారు. రాష్ట్రంలో అదాని గ్రూపు చేపట్టిన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, రానున్న రోజుల్లో పెట్టబోయే పెట్టుబడులపై ఈ సమావేశంలో చర్చించినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటన ద్వారా వెల్లడించింది. అదాని ఎంటర్‌ప్రైజెస్ ఎమ్‌డి రాజేష్ అదాని, అదాని పోర్ట్స్, అండ్ సెజ్ ఎమ్‌డి కరణ్ అదాని కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు.

మణిపూర్‌లో ఎన్నికలు నిర్వహించాల్సిందే

- ఢిల్లీ కాలుష్యంపై గ్యాస్ మాస్కులతో ఎంపిలు

5

రాజ్‌భవన్ ఇక లోక్ భవన్

- పేరు మారుస్తూ నోటిఫికేషన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కేంద్ర హోంశాఖ ఆదేశాల మేరకు రాజ్‌భవన్ పేరును లోక్‌భవన్‌గా మార్చేందుకు గవర్నరు ఎస్ అబ్దుల్ నజీర్ ఆమోదం తెలిపారు. ఈ మేరకు గవర్నరు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి అనంతరాము బుధవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. దేశ వ్యాప్తంగా రాజ్‌భవన్‌ల పేరు లోక్ భవన్‌గా వాడుకలోకి రానుంది. దశాబ్దాలుగా కొనసాగుతున్న రాజ్‌భవన్ పేరు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో చరిత్రలో కనుమరుగైనట్లే.

ఉత్పత్తికి లింకు పెడుతూ జీతాల్లో భారీ కోత

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

- వడ్లపూడి నిర్వాసిత కాలనీలోని ఓ ఉక్కు యువ ఉద్యోగికి గత నెలలో రూ.65 వేలు రాగా, ఈ నెల 57 వేలు మాత్రమే అందింది. రానురానూ ఇలా వేతన కోతలు విధిస్తూ పోతుంటే తామెలా బతకాలని ఆయన వాపోతున్నారు.
- స్టీల్‌ప్లాంట్‌లో పనిచేసే కార్మికుల్లో పలువురికి నెలకు రూ.70 వేలు రావాల్సి ఉండగా ఈసారి రూ.56 వేలు మాత్రమే వచ్చింది.

ఉక్కు యాజమాన్యం అన్ని డిపార్టుమెంట్లలో వేతన కోతలు విధించింది. కార్మికుల నుంచి అధికారుల వరకూ దీన్ని అమలు చేసింది. ఎస్ఎంఎస్, బ్లాస్ట్ ఫర్నేస్ విభాగాల్లో పనిచేసేవారికి 81 నుంచి 83 శాతం వేతనాలను మాత్రమే చెల్లించింది. మెటీరియల్ మేనేజ్‌మెంట్ విభాగంలోని వారికి ఈ నెల 66 శాతం మాత్రమే జీతం అందింది. మొత్తంగా ఈ నెలలో స్టీల్‌ప్లాంట్‌లో రూ.73 కోట్లను జీతాలుగా చెల్లించాల్సి ఉండగా, మిగతా 5లో

ర్యాలీగా ఉక్కు ప్రధాన పరిపాలన భవనం వద్దకు వస్తున్న నాయకులు, కార్మికులు

ఉక్కు ప్రధాన పరిపాలన భవనం వద్ద ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న అయోధ్యరామ్ (వార్త3లో)

పూర్తి జీతాలు చెల్లించాల్సిందే

- లేబర్ కమిషనర్ ఆదేశాలు

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో కార్మికుల విషయంలో అడ్డగోలుగా వెళ్తున్న యాజమాన్యం వ్యవహారంలో మొదటసారిగా విశాఖపట్నం లేబర్ కమిషనర్ విఆర్.గణేషన్ స్పందించారు. ఉత్పత్తిని బట్టి జీతాలు ఇస్తామన్న ప్లాంట్ యాజమాన్య సర్క్యులర్ సరైనది కాదని చెప్పారు. తక్షణమే పూర్తి జీతాలు చెల్లించాలని యాజమాన్యానికి బుధవారం తెలియజేశారు. అంతేగాక అనేక ప్రశ్నలు కురిపించారు. ప్రభుత్వ అనుమతి తీసుకున్నారా? ప్రభుత్వ సంస్థల్లో ఇలాంటి సర్క్యులర్లు ఎక్కడైనా ఉన్నాయా? అని ప్రశ్నించారు. కొత్త సర్క్యులర్, జీతాల్లో కోతలపై లేబర్ కమిషనర్‌ను కార్మిక సంఘాల నేతలు కలిసిన తర్వాత ఆయన పైవిధంగా స్పందించారు. ఉత్పత్తికి ఇన్సెంటివ్స్, రివార్డులకు లింకు పెట్టొచ్చు తప్ప, జీతానికి ముడిపెట్టరాదని, ప్లాంట్ నిర్ణయం కోర్టుల ఉల్లంఘన కిందకు వస్తుందని తెలిపారు. తక్షణమే ఉత్పత్తికి జీతాలను లింకు చేస్తూ ఇచ్చిన సర్క్యులర్‌ను పక్కన పెట్టాలని ఉక్కు యాజమాన్యానికి తెలియజేశారు.

గంజాయిపై ప్రభుత్వ స్పందన బాగోలేదు

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు
- పెంచలయ్య హత్యపై సిఎం, హోంమంత్రి మౌనం అన్యాయం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గంజాయి గ్యాంగులపైనా, పెంచలయ్య హత్యపైనా ప్రభుత్వం స్పందన బాగోలేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. విజయవాడలోని బాలోత్సవ భవన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడారు. నవంబరు 28న నెల్లూరులో గంజాయి గ్యాంగ్ పెంచలయ్యను హత్య చేయడంపై రాష్ట్ర వ్యాప్తంగా చర్చ జరుగుతోందని, అయినా ఇప్పటికీ ముఖ్యమంత్రిగానీ, హోంమంత్రిగానీ స్పందించలేదని తెలిపారు. హోంమంత్రి అనితకు లేఖ కూడా రాశామని, అయినా స్పందించలేదని అన్నారు. రాజకీయ హత్యల్లో తమవారు పోతే వెంటనే ప్రకటనలు గుప్పించి నానా హడావుడి చేసి భారీ ఎత్తున సాయం ప్రకటిస్తున్న ప్రభుత్వం ప్రజల కోసం, మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పనిచేసిన పెంచలయ్య హత్యకు గురైతే కనీసం మాట్లాడకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే గంజాయి మాఫియాకు బలైన పెంచలయ్య కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. ఇటీవల ఓ రాజకీయ సభలో నెల్లూరులో లేడీడాన్ల గురించి మాట్లాడిన సిఎం దాన్ని రాజకీయ నిందల కోసం వాడుకున్నారేగానీ గంజాయి గ్యాంగ్‌లపై పోరాడి చనిపోయిన పెంచలయ్య హత్యపై మాట్లాడ లేదని విమర్శించారు. సమాజాన్ని పీడిస్తున్న గంజాయి, మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా నెల్లూరులో పెంచలయ్య ప్రజల తరపున బలిదానం చేశారని అన్నారు. కందుకూరులో రాజకీయ మిగతా 5లో

విజయవాడలోని భవానీపురంలో అధికారులు నేలమట్టం చేసిన ఇళ్లు

విజయవాడలో బుల్డోజ్ రాజ్

- సుప్రీం కోర్టు స్టే విధించినా..ఇళ్ల కూల్చివేత
- ముఖ్యమంత్రి నివాసం వద్ద బాధితుల నిరసన

ప్రజాశక్తి - విజయవాడ సిటీ

ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ వంటి బిజెపి పాలిత రాష్ట్రాల్లో కొనసాగుతున్న బుల్డోజ్‌రాజ్ తరహాలో విజయవాడలో బుధవారం ఇళ్ల కూల్చివేతలు చోటుచేసుకున్నాయి. సుప్రీంకోర్టు స్టే విధించినప్పటికీ..ఆ ఉత్తర్వులు వచ్చేలోగానే ఆఘమేఘాల మీద అధికార యంత్రాంగం ఇళ్లను కూల్చివేసింది. దీనిని నిరసిస్తూ బుధవారం రాత్రి ఉండవల్లిలోని ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసం వద్ద బాధిత ప్రజలు ప్లకార్డులు ప్రదర్శించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..విజయవాడలోని భవానీపురం జోజినగర్ కరెంట్ ఆఫీసు రోడ్డులోని 42 ఇళ్లను అధికారులు కూల్చివేశారు. శ్రీ లక్ష్మీ రామ కో–ఆపరేటివ్ సొసైటీ బిల్డింగ్ సొసైటీ స్థలదారులకు అనుకూలంగా కోర్టు తీర్పు రావడంతో బుధవారం ఉదయం సుమారు 200 మంది పోలీసుల బలగాల నడుమ భవనాలను నేలమట్టం చేశారు. 2001లో అబ్దుల్ మజీద్ అనే వ్యక్తి 2.17 ఎకరాల స్థలాన్ని విక్రయించారు. పలువురు ఆ స్థలాన్ని కొనుగోలు మిగతా 5లో

పాతాళానికి రూపాయి

- డాలర్‌తో 90.21కు క్షీణత
- నూతన రికార్డ్ కనిష్టం
- పతనంపై ప్రభుత్వం ఆందోళన చెందడం లేదన్న సిఇఎ
- ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావమే : నిపుణులు

3

వినతులతో సరి!

- పంటల కొనుగోలుపై ఒత్తిడి చేయని రాష్ట్రం
- లేఖలను బుట్టదాఖలు చేస్తున్న కేంద్రం
- ఏడాదిన్నర 'డబుల్ ఇంజన్ సర్కార్' నిర్వాకం
- ధరలు పతనమై నష్టపోతున్న రైతు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

పంటల ధరలు పతనమై రైతులు భారీ నష్టాలపాలవుతుండగా రైతులను ఆదుకొనే విషయంలో రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం కేంద్రానికి వినతులతో సరిపెడుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నది డబుల్ ఇంజన్ సర్కార్ అని ప్రచారం చేసుకుంటున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, పంటల కొనుగోలుకు ఉదారంగా నిధులిచ్చి సహకరించాలన్న రాష్ట్రం విజ్ఞప్తులను బుట్టదాఖలు చేస్తోంది. రైతులు ఆర్థికంగా చితికిపోతున్నా కూటమి సర్కార్ కేంద్రంపై నిధుల కోసం ఒత్తిడి చేసి సాధించే బదులు, ఏదోక విధంగా మభ్యపెడుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఈ దాగుడుమూతల మధ్య రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. కేంద్రంలోని బిజెపి సంకీర్ణ ప్రభుత్వం టిడిపి మద్దతుపై ఆధారపడి కొనసాగుతున్న విషయం తెలిసిందే. రాష్ట్రంలోనూ టిడిపి–జనసేన–బిజెపి త్రయం కూటమిగా ఏర్పడి అధికారం పంచుకున్నాయి. దాంతో కేంద్రం నుంచి రాష్ట్రానికి అన్ని విధాలా సహాయ సహకారాలందుతాయని అందరూ ఆశపడ్డారు. సంవత్సరం ఐదు నెలల కూటమి పాలనలో ఖరీఫ్–రబీ– ఖరీఫ్ ముగిసి తిరిగి రబీ నడుస్తోంది. ఈ కాలంలో రైతులు పండించిన ఏ పంటకూ గిట్టుబాటు ధర లభించలేదు. కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) ప్రకటించిన పంటలకు గిట్టుబాటు ధర కాదు కదా ఎంఎస్‌పి కూడా దక్కని విధంగా ధరలు దిగజారాయి. రైతుల పంటలను కొనుగోలు చేసి ఆదుకోవాల్సిన ప్రభుత్వం, కొన్ని కాయకల్ప చర్యలు చేపట్టి సహాయం కోసం కేంద్రం వంక చూస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు, టిడిపి ఎంపీలు కేంద్ర పెద్దలను ఒకటికి రెండుసార్లు కలిసి విజ్ఞాపనలిచ్చి రైతులకు మేలు చేస్తున్నట్లు ప్రచారం చేసుకుంటున్నారు. ఆ ఉత్తరాలు, వినతిపత్రాల్లో ఒక్కదానిపై కూడా కేంద్రం స్పందించలేదు.

ధాన్యం రైతు దైన్యం

2025 ఖరీఫ్‌లో తుపాన్, భారీ వర్షాలు పంటలను ముంచెత్తాయి. ముఖ్యంగా వరి పంటకు నష్టం జరిగింది. ధాన్యం తడిచి రంగు మారింది. ఎఫ్‌సిఐ నిబంధనల ప్రకారం తేమ శాతం 17 శాతం మించకూడదు. ఉండాలి. ఆ నిబంధనను 22 శాతానికి సడలించాలని రాష్ట్రం అడిగితే కేంద్రం మాట్లాడలేదు. ఈ ఏడాది ఖరీఫ్‌లో మొంథా తుపాన్ వలన ధాన్యం తడిచింది. ఇప్పుడు కూడా కేంద్రాన్ని నాణ్యతా ప్రమాణాలు సడలించాలని రాష్ట్ర సర్కార్ కోరతానంటోంది.

పత్తి.. అంతే...

తుపాన్ వలన పత్తి తడిచిపోయింది. సిసిఐ 8–12 శాతం తేమనే అనుమతించింది. దానికి కాపాస్ యాప్, స్లాట్ బుకింగ్స్, రాష్ట్రానికి చెందిన ఇ–క్రాప్, సిఎంయాప్ నిబంధనలు సరేసరి. ఈ కఠిన నిబంధనల వలన ఎంఎస్‌పికి బాగా తక్కువకు ధరలు పడిపోయాయి. నిబంధనల మార్పునకు కేంద్రాన్ని అడిగినా అటు వైపు నుంచి చలనం లేదు. ఈ ఏడాది మొక్కజొన్న ధరలు ఘోరంగా మిగతా 5లో

ఏజెన్సీలో డ్రోన్లతో మందుల బట్వాడా !

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గిరిజన ప్రాంతాల్లో మందులు, టీకాలు, రక్తం యూనిట్లు, మల, మూత్ర, లాలాజ నమూనాల రవాణా కోసం డ్రోన్లను వినియోగించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ నిర్ణయించింది. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు కేంద్రంగా పరిసర ప్రాథమిక, సామాజిక, ఏరియా ఆరోగ్య కేంద్రాలకు మందులు, టీకాలు, బ్లడ్ యూనిట్లు బట్వాడా చేయడానికి, ఆయా ఆసుపత్రుల నుంచి రోగుల రక్త, మల, మూత్ర నమూనాలు సేకరించడానికి ప్రయోగాత్మకంగా డ్రోన్లను ప్రవేశపెట్టాలని యోచిస్తోంది. ఇదే తరహాలో అరుణాచల్‌ప్రదేశ్‌లో రెడ్‌వింగ్ ల్యాబ్, టెక్ ఈగల్ కంపెనీలు సేవలందిస్తున్నాయి. అవే సంస్థలు రాష్ట్రంలోనూ సేవలందించేందుకు ముందుకొచ్చాయి. ఈ నేపథ్యంలో పాడేరు కేంద్రంగా 60 నుంచి 80 కిలోమీటర్ల దూరంలోని ఆరోగ్య కేంద్రాలకు మూడు, నాలుగు డ్రోన్లు వినియోగించాలని కసరత్తు చేస్తున్నట్లు ఉన్నతాధికారులు తెలిపారు. ఒక డ్రోన్ ద్వారా రెండు కిలోల మందులు, టీకాలు, బ్లడ్ యూనిట్లు పంపించేందుకు వీలుందన్నారు. మందులను బట్వాడా చేసిన అనంతరం సదరు ఆస్పత్రి నుంచి రక్త, మల, మూత్ర నమూనాలను తీసుకొని డ్రోన్ తిరిగి పాడేరుకు వచ్చేలా ఏర్పాట్లు చేయనున్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

వైద్య కళాశాలలో వివాదం

- జూనియర్లపై సీనియర్ల దాడి
- నలుగురిపై కేసు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఏలూరు మెడికల్ కళాశాలలో సీనియర్లు, జూనియర్లకు మధ్య వివాదం ముదిరి తారాస్థాయికి చేరుకుంది. సీనియర్లు తమపై దాడి చేశారని జూనియర్లు రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు నలుగురు సీనియర్ వైద్య విద్యార్థులపై కేసు నమోదు చేశారు. ఏలూరు రెండో పట్టణ పోలీసుల కథనం ప్రకారం... ఏలూరులోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఈ నెల 12న ఫెస్ట్ పేరుతో ఫ్రెషర్స్ డే పార్టీని నిర్వహించేందుకు ప్లాన్ చేసుకున్నారు. ఫెస్ట్ ప్లానింగ్ గురించి సీనియర్లు, జూనియర్లు కలిసి ఈ నెల ఒకటో తేదీ రాత్రి చర్చించుకుంటుండగా భేదాభిప్రాయాలు ఏర్పడ్డాయి. దీంతో ఒకరిపై ఒకరు వాదనకు దిగగా సీనియర్లు జూనియర్లపై దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో వైద్య విద్య రెండో సంవత్సరం అభ్యసిస్తున్న రాకేష్‌రెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. రాయుడు, సిద్ధార్థ, మనీష్, జోషి తనపై దాడి చేశారని ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇప్పటికే సీనియర్ విద్యార్థులను హాస్టల్ నుంచి మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ సావిత్రి సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. మొదట ఎవరు ఎవరిపై దాడి చేశారనేది పూర్తి స్పష్టత లేదు. ఈ విషయాలపై పోలీసు అధికారులు లోతుగా విచారణ చేపట్టారు.

వికలాంగుల జీవితాల్లో వెలుగులకు 'ఇంద్ర ధనస్సు'

- 7 వరాలు ప్రకటన
- బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి గడువు పొడిగింపు
- అమరావతిలో వికలాంగుల భవన్
- అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవంలో సిఎం చంద్రబాబు


చెక్కు అందజేస్తున్న సిఎం చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వికలాంగుల జీవితాల్లో ఇంద్ర ధనస్సుతో వెలుగులు నింపేలా అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం నాడు ఏడు వరాలు ప్రకటిస్తున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో వికలాంగుల సంక్షేమశాఖ ఆధ్వర్యాన నిర్వహించిన అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవంలో బుధవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. వికలాంగులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఇంద్ర ధనస్సులో భాగంగా.. వికలాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, స్థానిక సంస్థల్లో ఎక్స్ అఫిషియో సభ్యులుగా ఒకరికి నియామకం, సబ్సిడీ రుణాల పునరుద్ధరణ, క్రీడల్లో పూర్తిస్థాయి భాగస్వామ్యం (శాప్ ఆధ్వర్యంలో), ఎక్కడ ఇళ్లు ఇచ్చినా గ్రౌండ్ ఫ్లోర్‌లోనే కేటాయించడం, వినికిడి లోపం ఉన్నవారికి బాపట్లలో డిగ్రీ కళాశాల ఏర్పాటు, పెన్షన్లు ఎక్కడుంటే అక్కడే అందజేయడంతోపాటు అమరావతిలో వికలాంగుల భవన్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో వికలాంగులకు రూ.6 వేల పెన్షన్ ఇస్తున్నట్లు చెప్పారు. 7.68 లక్షల మందికి ప్రతినెలా రూ.420 కోట్ల చొప్పున ఏడాదికి రూ.6 వేలను అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. బ్యాక్‌లాగ్ పోస్టులకు స్పెషల్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌ను పొడిగిస్తున్నామని తెలిపారు. మోటారు ట్రై సైకిల్స్, వీల్‌ఛైర్స్, వినికిడి యంత్రాలను 14 వేల మందికి పంపిణీ చేశామన్నారు. అలాగే రాజధానిలో వికలాంగులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. గత ఐదేళ్లలో ఏనాడు వికలాంగుల దినోత్సవం చేసిన సందర్భం లేదని, వాళ్ల సమస్యలు పరిష్కరించాల్సిన పరిస్థితి లేదన్నారు. వికలాంగులు బలహీనులు కాదని, విభిన్న ప్రతిభావంతులని చెప్పారు. కొంచెం మద్దతు ఇస్తే విజయం సాధిస్తారన్నారు. విల్ పవర్, పట్టుదల వీరిలో అధికంగా ఉంటుందని చెప్పారు. పట్టుదలకు చిరునామాగా ఉంటారని తెలిపారు. సమాజంలో అందరిలా వీరికి అవకాశాలు, హక్కులు, గౌరవం దక్కాలన్నారు. విశాఖలో 23 ఎకరాల్లో నేషనల్ సెంటర్ ఫర్ డిసెబిలిటి స్పోర్ట్స్ స్టేడియం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఆత్మ విశ్వాసంతో ముందుకు వెళ్లాలని వికలాంగులకు సూచించారు.

అందుల ప్రపంచ క్రికెట్ పోటీల్లో దేశం విజయం సాధించేందుకు కృషి చేసిన క్రికెట్ జట్టు కెప్టెన్ దీపిక, క్రికెటర్ అరుణకుమారిని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో వారికి అండగా ఉండటమే కాకుండా ప్రోత్సాహం అందించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున అరుణకుమారికి రూ.15 లక్షలు, ఇంటిని నిర్మించి ఇస్తామని, దీపికకు రూ.10 లక్షలు ప్రోత్సాహం, ఇంటి నిర్మాణం చేపడతామని, అర్జున్ అవార్డు గ్రహీత, కోచ్ అజయ్ కుమార్ రెడ్డికి రూ.2.50 లక్షలు నగదు ప్రోత్సాహకాన్ని సిఎం ప్రకటించారు. ఎసిఎ రూ.5 లక్షలు, గొట్టిపాటి హర్షవర్ధన్ మరో రూ.5 లక్షలను ఆయన కరుణకుమారికి అందజేశారు. అనంతరం వికలాంగులకు ఉపకరణాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వయోవృద్ధులు, వికలాంగుల సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరంజనేయస్వామి మాట్లాడుతూ.. వికలాంగులకు పాఠశాలలు, కళాశాలల కోసం రూ.4 వేలకోట్లకు పైగా ప్రభుత్వం నిధులు కేటాయించిందన్నారు. ప్రతి కలెక్టర్ కార్యాలయంలో ఆస్పత్రుల్లో వికలాంగులకు లిఫ్ట్ సౌకర్యం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల సంక్షేమ సంస్థ ఛైర్మన్ జి నారాయణస్వామి, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ జి కోటేశ్వరరావు, ఎమ్మెల్యేలు బొండా ఉమామహేశ్వరరావు, గద్దె రామ్మోహన్, ఎమ్మెస్ రాజు, యుజవన సంక్షేమశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజైయ్ జైన్, వికలాంగుల సంక్షేమశాఖ కార్యదర్శి ఎ సూర్యకుమారి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుపై చర్చకు మంత్రి నాదెండ్ల సిద్ధమా?

- ఎపి కౌలు రైతు సంఘం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ధాన్యం కొనుగోలుపై బహిరంగ చర్చకు పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సిద్ధమా? అని ఎపి కౌలు రైతు సంఘం ప్రశ్నించింది. ధాన్యం కొనుగోలుకు సంబంధించి క్షేత్రస్థాయిలో తీవ్ర లోపాలు కనిపిస్తున్నాయని, లోపాలను సరిచేయకుండా ప్రభుత్వం పత్రికల్లో గొప్పలు చెప్పుకుంటూ పోతే రైతులకు తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. ఈ మేరకు ఎపి కౌలు రైతు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై రాధాకృష్ణ, ఎం హరికృష్ణ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఒకవైపు వాతావరణం అనుకూలించక రైతులు, కౌలు రైతులు తీవ్రంగా భయపడుతుంటే.. ప్రభుత్వం, అధికారులు రైతాంగాన్ని గాలికి వదిలేశారని వారు విమర్శించారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా తమ ప్రభుత్వం వాట్సాప్‌లో హాయ్ అని మెసేజ్ పెడితే రైతుల ధాన్యాన్ని వెంటనే కొంటున్నట్లు మంత్రి ప్రకటనలతో ఊదరగొడుతున్నారన్నారు. ధాన్యానికి సరిపడా సంచులు లేవని, అవసరమైన స్థాయిలో లారీలు అందుబాటులో లేవని తెలిపారు. తేమశాతం చూసే యంత్రాలు కూడా కొన్నిచోట్ల ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద అందుబాటులో లేవన్నారు. క్షేత్రస్థాయిలో లోపాలు స్పష్టంగా కనబడుతున్నప్పటికీ తమ ప్రభుత్వం ధాన్యం కొనుగోలులో విప్లవాత్మకంగా కృషి చేస్తుందని ప్రభుత్వం చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. ధాన్యం కొనుగోలు క్షేత్రస్థాయిలో ఎలా జరుగుతుందోననే అంశాన్ని పరిశీలించేందుకు ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర కమిటీ ప్రతినిధుల బృందం కృష్ణా, ఏలూరు, పశ్చిమ గోదావరి, కాకినాడ, గుంటూరు జిల్లాల్లో విస్తృతంగా పర్యటించినట్లు వారు పేర్కొన్నారు. మిల్లుల యజమానులు సంతృప్తి చెందితేనే ధాన్యం రేటు నిర్ణయిస్తున్నారని, అలా కాదంటే చుట్టుపక్కల మిల్లులన్నింటికీ రైతులను తిప్పుతున్నారని వారు పేర్కొన్నారు. ధాన్యం వర్షంలో తడవకుండా టార్పాలిన్లు రైతులు, కౌలు రైతులకు అందిస్తున్నట్లు పత్రికల్లో మంత్రి ప్రకటనలు చూశామని, ఆచరణలో పిఎసిఎస్ ఛైర్మన్లకు అనుకూలమైన వారికి ఇస్తున్నారే తప్ప వాస్తవంగా అవసరమైన రైతులకు ఇవ్వడం లేదని వారు తెలిపారు.

విషపురుగు కాటుతో బాలుడు మృతి

ప్రజాశక్తి - పెద్దవడుగూరు (అనంతపురం జిల్లా)

విషపు పురుగు కాటుకు బాలుడు ప్రాణాలు కోల్పోయాడు. మరొకరు తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలం కండ్లగూడురు గ్రామంలో బుధవారం వెలుగు చూసిన ఈ ఘటన ఆ కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన వీరనారాయణస్వామి, అపర్ణ దంపతులకు శివరామరాజు, శివనారాయణ (8) ఇద్దరు కుమారులు. వీరిద్దరూ అదే గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో పెద్దకుమారుడు 4, చిన్న కుమారుడు రెండో తరగతి చదువుతున్నారు. ఇద్దరూ మంగళవారం సాయంత్రం యథావిధిగా భోజనం చేసి ఇంట్లో నిద్రించారు. ఉదయం లేచే సరికి శివనారాయణ మరణించాడు. శివరామరాజు తీవ్ర అపస్మారక స్థితిలోఉన్నాడు. గుర్తించిన తల్లిండ్రులు అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. శివనారాయణ మృతదేహాన్ని పరిశీలించిన వైద్యులు విషపురుగు కుట్టడం వల్లనే మృతి చెందినట్లు, అతని శరీరంలో విషం ఉన్నట్లు ప్రాథమికంగా నిర్ధారించారు.

2030 నాటికి 200 నౌకలతో భారత నౌకాదళం

- విశాఖలో ఫిబ్రవరి 18న ఐఎఫ్ఆర్
- ముఖ్య అతిథిగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- 137 దేశాలకు ఆహ్వానం
- తూర్పునౌకాదళం వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా

మీడియాతో మాట్లాడుతున్న సంజయ్ భల్లా

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో/ ఎంవిపి.కాలనీ

భారత నౌకాదళం అధునాతన దేశీయ సాంకేతిక పరిజ్ఞానంతో ఎప్పుడు యుద్ధం సంభవించినా సిద్ధంగా ఉందని, తీర భద్రతలో నిర్ణయాత్మక పాత్రను పోషిస్తోందని తూర్పు నౌకాదళం వైస్ అడ్మిరల్ (కమాండింగ్ ఇన్ చీఫ్) సంజయ్ భల్లా వెల్లడించారు. భారత నౌకాదళంలో 150 వరకూ యుద్ధ నౌకలుండగా ప్రస్తుతం మరో 51 నిర్మాణంలో ఉన్నాయన్నారు. మొత్తంగా 2030కి 200 నౌకలతో భారత నౌకాదళం మరింత శక్తివంతంగా మారనుందని తెలిపారు. విశాఖలోని నేవల్ డాక్‌యార్డులో ఐఎన్ఎస్ హిమగిరి యుద్ధనౌకపై నౌకాదళ ఉన్నతాధికారులతో కలిసి బుధవారం సంయుక్తంగా నిర్వహించిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో వైస్ అడ్మిరల్ మాట్లాడారు. 2026 ఫిబ్రవరి 18న విశాఖలో ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్ఆర్) నిర్వహించేందుకు భారత నౌకాదళం ఏర్పాట్లు చేస్తోందన్నారు. దేశంలో పాల్గొనాలని 137 దేశాలకు ఆహ్వానం పంపామని, ఇప్పటివరకూ 61 దేశాలు పాల్గొనేందుకు సంసిద్ధత వ్యక్తం చేశాయని చెప్పారు. భారత నౌకాదళం నుంచి 23 యుద్ధనౌకలు, 2 ఎయిర్ క్రాఫ్టులు విన్యాసాల్లో భాగస్వామ్యం అవుతాయన్నారు. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఐఎఫ్ఆర్‌కు ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు తెలిపారు. 2001లో మొదటిసారిగా ఐఎఫ్ఆర్‌ను నౌకాదళం ప్రారంభించిందని, 2016లో విశాఖలో నిర్వహించామని, 2026లో మరలా విశాఖే కేంద్రంగా ఐఎఫ్ఆర్ జరుగుతుందని వివరించారు. నేవీ డే ఉత్సవాలు బుధవారం కేరళలోని తిరువనంతపురంలో ప్రారంభమయ్యాయని, వారం రోజుల పాటు వాటిని నిర్వహిస్తామని తెలిపారు.

తూర్పునౌకాదళం అత్యంత కీలకం

2025లో భారత నౌకాదళం ఆరు యుద్ధనౌకలను కమిషనింగ్ చేయగా వాటిలో రెండింటిని తూర్పు నౌకాదళానికే కేటాయించడం విశేషమని సంజయ్ భల్లా అన్నారు. ఐఎఫ్ఆర్ సహా మరో రెండు ఈవెంట్లను విశాఖ ఆర్‌కె బీచ్, నావికా దళంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. విశాఖ కేంద్రంగా మిలాన్ - 2026 విన్యాసాలు ఫిబ్రవరి 17 నుంచి 26 వరకూ జరగనున్నాయన్నారు. ఫిబ్రవరి 19న సాయంత్రం సిటీ పరేడ్ కార్యక్రమం ఆర్‌కె బీచ్‌లో ఉంటుందని, ముఖ్య అతిథిగా సిఎం చంద్రబాబును ఆహ్వానిస్తున్నామని తెలిపారు. సుమారు ఆరు లక్షల మంది ప్రజలు దీంట్లో పాల్గొనే అవకాశం ఉన్నట్లు అంచనా వేస్తున్నామన్నారు. బంగ్లాదేశ్ నేవీ కూడా పాల్గొంటుందన్నారు. ఐఎఫ్ఆర్ విన్యాసాలకు పాక్, చైనాకు ఆహ్వానం లేదని తెలిపారు. ఫిబ్రవరి 20న నేవల్ సింపోజియం నిర్వహిస్తున్నామన్నారు.

భోగాపురం ఎయిర్‌పోర్టుతో నిమిత్తం లేకుండా ఐఎన్ఎస్ డేగా నిర్వహణ

ఐఎన్ఎస్ డేగాను మిలటరీ హెలికాప్టర్ల రాకపోకలకు ప్రత్యేకంగా వినియోగించనున్నట్లు తెలిపారు. భోగాపురం ఎయిర్‌పోర్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయని, సివిలియన్స్ ఆ విమానాశ్రయాన్ని వినియోగిస్తారని స్పష్టం చేశారు. ట్రైనింగ్, అటాక్స్ కార్యకలాపాలు అన్నీ ఐఎన్ఎస్ డేగాలో చేపడతామన్నారు.

అట్టహాసంగా ఉద్భవ్-2025 వేడుకలు ప్రారంభం

- కెఎల్ ప్రాంగణంలో మూడు రోజుల పాటు నిర్వహణ

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు జిల్లా తాడేపల్లిలోని కె.ఎల్ విశ్వవిద్యాలయంలో గిరిజన విద్యార్థుల సదస్సు బుధవారం అట్టహాసంగా ప్రారంభమైంది. డిసెంబర్ 3 నుండి 5 వరకు నిర్వహిస్తున్న ఈ వేడుకలను కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి జువల్ ఓరం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు చదువు మాత్రమే కాకుండా సంస్కృతి, సాంప్రదాయాలు కూడా నేర్చుకోవాలని ఆకాంక్షించారు. ఇఎంఆర్ఎస్ బాలబాలికలు అన్ని రంగాల్లోనూ రాణించాలని సూచించారు. పలు రాష్ట్రాల విద్యార్థులకు వారి నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం సృజనాత్మక ప్రతిభను చూపించడానికి గొప్ప వేదిక ఉద్భవ్-2025 అని రాష్ట్ర గిరిజన సంక్షేమ, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ ఆరేళ్లుగా ఉద్భవ్ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు

దేశం నలుమూలల నుంచి వచ్చిన ఏకలవ్య గురుకుల మోడల్ పాఠశాలల విద్యార్థుల సంస్కృతి, సాహిత్య, కళా ఉత్సవాలు కన్నుల విందుగా జరిగాయి. బుధవారం మధ్యాహ్నం నుంచి ప్రధాన వేదిక అయిన కృష్ణ జింక ఆడిటోరియలో దాదాపు 22 రాష్ట్రాల నుండి వచ్చిన విద్యార్థులు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యాలు, కథలు, ఉపన్యాస పోటీలు, పలు భాషల్లో సృజనాత్మక రచన పోటీలు, దృశ్య కళలు, గిరిజన సంస్కృతీ సంప్రదాయాలు, చిత్ర కళలు వంటి దాదాపు 18 రకాల పోటీలను నిర్వహించారు. గిరిజన తెగల వస్త్రధారణతో పాటు, వారి మూలలను గుర్తుచేసుకుంటూ విద్యార్థుల ప్రదర్శన చూపరులను ఆకట్టుకుంది. పార్వతీపురం, మన్యం జిల్లా జిఎల్ పురం నుండి సీనియర్ విభాగంలో ఇఎంఆర్ఎస్ విద్యార్థులు ప్రదర్శించిన గిరిజన సంప్రదాయ వీర నృత్యం, కోలాటం నృత్యం అద్భుతంగా ప్రదర్శించారు. తెలంగాణ రాష్ట్రం నుండి ప్రఖ్యాత లంబాడి నృత్యంతో పాటు, వివిధ రాష్ట్రాల నుండి వివాహాల సందర్భంగా ప్రదర్శించే థీమ్స నృత్యం, సమాజ ఐక్యతను చిత్రీకరించే సమూహ నృత్యం భాగ థీమ్స్, ఆత్మరక్ష కళా రూపం గుండర్ల థీమ్స వంటి నత్యాలతో వారి ప్రతిభను చాటారు. ఛత్తీస్‌ఘడ్, గుజరాత్, హిమాచల్ ప్రదేశ్, కేరళ, ఉత్తరాఖండ్, సిక్కిం, తెలంగాణ, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, మిజోరాం, తమిళనాడు, ఉత్తరప్రదేశ్ , కర్ణాటక, ఒడిశా, మహారాష్ట్ర, త్రిపుర, ఝార్ఖండ్ వంటి రాష్ట్రాల విద్యార్థులు ఈ కళా ఉత్సవాల్లో పాల్గొన్నారు. గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి మల్లికార్జున నాయక్, కమిషనర్ అజిత్ కుమార్ శ్రీవాత్సవ, గిరిజన గురుకుల విద్యా సంస్థల కార్యదర్శి గౌతమి సహాయ కార్యదర్శి బిపిన్ చంద్ర రాథోడ్, రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ రాయపాటి శైలజ, కెఎల్ యూనివర్సిటీ ఉప కులపతి జి.పి.ఎస్ వర్మ, రాష్ట్ర లిడ్ క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యాలరావు, ఎస్‌టి, కమిషన్ ఛైర్మన్ చల్లా బొజ్జి రెడ్డి, రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఛైర్మన్ హస్సన్ బాషా పాల్గొన్నారు.

డిఆర్‌సి సమావేశాలకు నామినేటెడ్ ఛైర్మన్లు

- జిఓ 13 విడుదల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జిల్లా సమీక్షా సమావేశాలకు (డిఆర్‌సి) ఇకపై ప్రత్యేక ఆహ్వానితులుగా ఆయా జిల్లాలకు చెందిన నామినేటెడ్ ఛైర్మన్లను ఆహ్వానించాలని ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్లానింగ్‌శాఖ బుధవారం జిఓ ఎంఎస్ నెంబరు 13ను విడుదల చేసింది. ఇప్పటి వరకు జిల్లాకు చెందిన ఎంపి, ఎమ్మెల్యేలు, జిల్లా పరిషత్ ఛైర్మన్లు హాజరవుతుండగా, ఇకపై ఆయా జిల్లాలకు చెందిన నామినేటెడ్ ఛైర్మన్లు కూడా సమావేశాల్లో పాల్గొనున్నారు.

వైసిపి నాయకుని కారుకు దుండగుల నిప్పు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం వెంకటనగరం గ్రామ వైసిపి నాయకుడు మోత రమేష్‌కు చెందిన కారుపై కొంతమంది దుండగులు పెట్రోల్ పోసి మంగళవారం అర్ధరాత్రి నిప్పటించారు. ఈ ఘటనలో కారు పూర్తిగా కాలిపోయింది. విషయం తెలుసుకున్న వైసిపి జిల్లా అధ్యక్షులు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ఫోన్‌లో ఎస్‌పికి ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టి దోషులను శిక్షించాలని కోరారు. అనంతరం చెల్లుబోయిన వేణు తనయుడు చెల్లుబోయిన నరేన్, స్థానిక నాయకులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఘటనపై రమేష్ కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. న్యాయం జరిగే వరకూ అండగా ఉంటామని భరోసానిచ్చారు.

జగదాంబ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన పైలాన్

సిఐటియు అఖిలభారత మహాసభ పైలాన్ ఏర్పాటు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

ఈ నెల 31 నుంచి వచ్చే ఏడాది జనవరి నాలుగు వరకూ విశాఖపట్నంలో జరగనున్న సిఐటియు 18వ అఖిల భారత మహాసభను పురస్కరించుకుని జగదాంబ సెంటర్‌లో క్లాక్ టవర్ సమీపాన సిఐటియు పైలాన్‌ను బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా నాయకులు వై.రాజు, కె.చంద్రశేఖర్ మాట్లాడుతూ.. కార్మిక వ్యతిరేక విధానాలను దుందుడుకుగా అమలు చేస్తున్న కేంద్రంలోని మోడీ సర్కారుపై కార్మిక పోరాటాలను తీవ్రతరం చేసేందుకు అనువైన ప్రణాళికలను మహాసభలో రూపొందించనున్నట్లు తెలిపారు. నాలుగు లేబర్ కోడ్స్‌ను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని కోరారు. సిఐటియు జాతీయ మహాసభ చివరి రోజు నగరంలో లక్ష మందితో భారీ ప్రదర్శన, బహిరంగ సభ జరుగనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గణేష్, కెవిపి చంద్రమౌళి, కళాధర్ పాల్గొన్నారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

- మార్క్‌ఫెడ్ ద్వారా ఉత్పత్తులు కొనుగోలు చేయాలి : పి. మధు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, తెలంగాణ తరహాలో మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని సిపిఎం సీనియర్ నాయకులు, మాజీ ఎంపి పెనుమల్లి మధు డిమాండ్ చేశారు. తిరుపతి వేమన విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో రైతులు నష్టాలపాలవుతున్నారని తెలిపారు. రైతుల సమస్యలను సిఎం చంద్రబాబు గుర్తించి పరిష్కరించకుండా సభలు, సమావేశాలు, రంగురంగుల ప్రకటనల ఇవ్వడం వల్ల ఎలాంటి ఉపయోగం లేదన్నారు. వరి పంటకు కనీస మద్దతు ధర లేకపోవడంతో ఉభయగోదావరి జిల్లాల్లో రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోలో రైతులకు చంద్రబాబు ఇచ్చిన హామీలేవీ అమలు కావడం లేదన్నారు. కౌలు రైతులను అన్నదాతా సుఖీభవ పథకంలో చేరుస్తామని చెప్పి వారిని పట్టించుకోలేదని గుర్తు చేశారు. 23 రకాల పంటలకు కేంద్రం గిట్టుబాటు ధర కల్పించకపోగా యూరియా బస్తాపై రూ.వంద నుంచి 150 అదనంగా ధర పెరిగిందని వివరించారు. చిత్తూరు జిల్లాలో మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయారని, గిట్టుబాటు ధర కల్పిస్తామని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చినా నేటికీ అమలు కాలేదన్నారు. అన్నదాతా సుఖీభవ పథకంలో 50 లక్షల మంది రైతులు ఉంటే వారి సంఖ్యను తగ్గించడం దారుణమన్నారు. తక్షణమే పంటలకు బీమా సౌకర్యం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా నాయకులు కందారపు మురళి, జి. బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

సహజ ప్రసవాలపై వైద్యులకు ప్రత్యేక శిక్షణ

- కమిషనరు వీరపాండియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో సహజ ప్రసవాలను పెంచేందుకు ప్రభుత్వాస్పత్రుల్లో పనిచేసే గైనకాలజిస్టులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనరు వీరపాండియన్ వెల్లడించారు. అసిస్టెడ్ వెజైనల్ డెలివరీ విధానంపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విధానంలో ప్రధానంగా వాక్యూం ఎక్స్ట్రాక్షన్ (బిడ్డ తలపై చిన్న కప్పులా ఉండే పరికరం), ఫోర్సెప్స్ (రెండు మెటల్ స్పూన్ ఆకారపు పరికరం) సాయంతో సహజ ప్రసవాలు చేసే మెలకువలపై దశలవారీ శిక్షణ కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ నెల 10 నుంచి ప్రారంభమై 6 నెలలపాటు నిర్దేశించిన తేదీల్లో గైనకాలజిస్టులకు తరగతులు ఉంటాయని వివరించారు. గుంటూరు, ఒంగోలు, విశాఖ, కాకినాడ, తిరుపతి నగరాల్లో రెండు దశల్లో సెకండరీ, బోధనాస్పత్రుల్లో పనిచేసే 370 మంది గైనకాలజిస్టులకు ఫెర్నాండెజ్ ఫౌండేషన్, యూనిసెఫ్ సాయంతో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. పరికరాలు ఉపయోగించి సహజ ప్రసవాలు చేయడం సాధారణ విషయమే అయినా, ఈ సంఖ్య పెరిగే అవకాశం ఉన్నప్పటికీ కుటుంబ సభ్యుల నుంచి సహకారం లేకపోవడం ప్రతిబంధకంగా తయారైందని పేర్కొన్నారు. సిజేరియన్ ధోరణి పెరగడం, నిర్లిప్తత వంటి కారణాలతో వీటి సాయంతో ప్రసవాలు జరగడం లేదని తెలిపారు. ఈ నేపథ్యంలో సురక్షిత సహాయక ప్రసవ పద్ధతులను అవలంభించేలా వైద్యులను కార్యోన్ముఖులను చేసేందుకు శిక్షణ కార్యక్రమాలను నిర్ణయించినట్లు పేర్కొన్నారు. సహజ ప్రసవాలు ఎక్కువగా చేయాలన్న లక్ష్యంలో భాగంగా ఇప్పటికే ఎంపిక చేసిన స్టాఫ్ నర్సులను ప్రత్యేక ప్రొఫెషనల్ మిడ్ వైఫరీ కోర్సును నిర్వహిస్తోందన్నారు.

తమిళనాడు, కేరళకు ఉప్పాడ మత్స్యకారులు

- డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఉప్పాడ మత్స్యకారుల సమస్యలకు శాశ్వత పరిష్కారాన్ని చూపే కార్యక్రమంలో భాగంగా తమిళనాడు, కేరళకు అధ్యయనం కోసం మత్స్యకారులతో ప్రత్యేక బృందాలను పంపించనున్నట్లు డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. మంగళగిరిలోని డిప్యూటీ సిఎం కార్యాలయంలో ఉప్పాడ మత్స్యకారులతో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సముద్ర జలాల కాలుష్య సమస్యపై శాస్త్రీయ పరిశోధన, మత్స్యకారులకు అదనపు ఆదాయం తెచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. ఉప్పాడలోని 7,200 మంది మత్స్యకారులు, 25,600 మంది వారి కుటుంబ సభ్యులకు జీవన భృతి రెట్టింపు అవ్వాలన్నదే లక్ష్యమన్నారు. ఈ సమీక్షలో కాకినాడ జిల్లా కలెక్టర్ శ్రీషణ్మోహన్, సెంట్రల్ మెరైన్ షిషరీష్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ జోకిజుకుడాన్, ఫిషరీష్ అడిషనల్ డైరెక్టర్ చంద్రశేఖర్, కాకినాడ జిల్లా ఫిషరీష్ అధికారి కృష్ణారావు పాల్గొన్నారు.

మాఫియాను ఆపేదెవరు?

- యథేచ్ఛగా గంజాయి రవాణా, అమ్మకాలు
- పోలీసులు కేసులు పెడుతున్న, అరెస్టులు చేస్తున్నా ఆగని దందా
- మత్తుకు బానిసవుతున్న యువత

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

-2023 ఆగస్టు 16న గంజాయి మత్తులో ఉన్న ఇద్దరు యువకులు కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో హల్‌చల్ చేశారు. ఒపి లేకుండా వైద్యం ఎందుకు చేయరంటూ సిబ్బందిపై దాడి చేశారు. అవుట్ పోస్ట్ పోలీసులు వారిని అదుపు చేసే ప్రయత్నం చేసినా ఆగలేదు. చివరికి సోదా చేయగా వారి వద్ద కత్తులు, గంజాయి బయటపడడం అప్పట్లో చర్చనీయాంశమైంది.

-ఈ ఏడాది జూన్‌లో పెద్దాపురంలో జరిగిన మరిడమ్మ జాతరలో గంజాయి బ్యాచ్ హల్‌చల్ చేసింది. జాతర సందర్భంగా డ్యాన్స్ ప్రోగ్రాంను నిర్వహించగా అక్కడికి వచ్చిన కొందరు గంజాయి, మద్యం మత్తులో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఇరుగ్రూపులూ రక్తం కారేలా కొట్టుకున్నాయి. పోలీసులు వారిపై కేసు నమోదు చేశారు.

గత ప్రభుత్వ హయాంలో గంజాయి విక్రయాలు యథేచ్ఛగా సాగాయి. ప్రస్తుత ప్రభుత్వ హయాంలోనూ పరిస్థితిలో పెద్దగా మార్పులేదు.

'గత పాలకులు కాకినాడ స్మార్ట్ సిటీని డ్రగ్స్ సిటీగా మార్చేశారు. మేము అధికారంలోకొస్తే గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కు పాదం మోపుతాం' అని గతేడాది మే నాలుగున జరిగిన కాకినాడ ప్రజాగళం సభలో టిడిపి అధినేత చంద్రబాబు చెప్పుకొచ్చారు. సంత చెరువు సెంటర్లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. నేడు అధికారంలోకొచ్చి ఏడాదిన్నర అయినా గంజాయికి అడ్డుకట్ట పడలేదు.

'గత ప్రభుత్వంలో మాదక ద్రవ్యాలు, గంజాయి రాష్ట్రమంతటా పాకాయి. వీటిని నివారించాలి. యువతను గంజాయి మత్తు నుంచి బయటకు తీసుకురావాలి. మాదకద్రవ్యరహిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సాధించాలి' గతేడాది ఆగస్టు 15న జరిగిన స్వాతంత్ర్య దినోత్సవం వేడుకల్లో రాష్ట్ర డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ అన్న మాటలివి. అయితే, ఇప్పటికీ గంజాయి మాఫియా రెచ్చిపోతోందనే విమర్శలు ఉన్నాయి. ఇందుకు పాలకపక్షంలోని కొందరి అండదండలే కారణమని ప్రచారం జరుగుతోంది.

కాకినాడ జిల్లాలో పట్టుబడిన గంజాయి (ఫైల్)

ఏజెన్సీ నుంచి మైదాన ప్రాంతాలకు...

విశాఖ, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాల్లోని ఏజెన్సీ ప్రాంతాల్లో గంజాయి విచ్చలవిడిగా సాగవుతోంది. అక్కడ నుంచి జిల్లాలోకి అక్రమంగా గంజాయి రవాణా అవుతోంది. ముఖ్యంగా ఒడిశా, అల్లూరి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల నుంచి ఎక్కువగా వస్తోంది. మారేడుమిల్లి, రంపచోడవరం మీదుగా జగ్గంపేటకు గంజాయి రావాణా సాగుతోంది. అక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు గుట్టుచప్పుడు కాకుండా ఎగుమతి అవుతోంది. పోలీసులు నిఘా పెట్టి అరెస్టులు చేస్తున్నా గంజాయి రవాణా మాత్రం ఆగట్లేదు. జిల్లా కేంద్రం కాకినాడ స్మార్ట్ సిటీలోనూ గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. యువత, విద్యార్థులనే గంజాయి మాఫియా టార్గెట్ చేసుకుంటోంది. ఒంటరిగా, జులాయిలా తిరిగే యువకులను రవాణాకు ఉపయోగించుకుంటోంది. గంజాయిని చిన్నచిన్న పొట్లాలు, లిక్విడ్, చాక్లెట్లుగా మార్చి యువతకు, విద్యార్థులకు అమ్ముతున్నారు. ఎక్కువగా ఇంజనీరింగ్, డిగ్రీ కళాశాలల యువతనే వీరు లక్ష్యంగా చేసుకుని అమ్మకాలు సాగిస్తున్నారు. జిల్లాలోనే ఓ ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులు గంజాయి సేవిస్తూ పోలీసులకు చిక్కారు. రాజకీయ పలుకుబడితో కేసు నుంచి వారు తప్పించుకున్నారు. ఇలాంటి ఘటనలు జిల్లాలో తరచూ చోటుచేసుకుంటున్నాయి. ఈ ఏడాది జనవరి నుంచి నవంబర్ వరకు జిల్లాలో వివిధ స్టేషన్ల పరిధిలో 41 గంజాయి కేసులు నమోదయ్యాయని జిల్లా పోలీసులు తెలిపారు. గంజాయి సరఫరా చేసే వారిని, కొనుగోలు చేసేవారిని, మధ్యవర్తులను గుర్తించి 140 మందిని అరెస్టు చేశామని చెప్పారు వీరి నుంచి 34 వాహనాలను సీజ్ చేశామని, సుమారు రూ.1.25 కోట్ల విలువైన 2,163 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

రూ.4 కోట్ల విలువైన గంజాయి ధ్వంసం

2022 నుంచి జిల్లాలో 21 పోలీస్ స్టేషన్ల పరిధిలో పట్టుబడ్డ సుమారు రూ.4 కోట్ల విలువైన గంజాయిని ఇటీవల ఎస్పి జి.బిందు మాధవ్ ఆధ్వర్యంలో పోలీసులు ధ్వంసం చేశారు. 8,274.45 కిలోల డ్రై గంజాయి, 555 గ్రాముల లిక్విడ్ గంజాయి, 15 ఎండిఎంఎ మాత్రలను జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ నిర్వీర్యం చేసింది.

ఈ ఏడాది నమోదైన కేసుల్లో కొన్ని ..

- ఈ ఏడాది జూన్‌లో కాకినాడ ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి తరలిస్తున్న నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు.
- జులైలో కాకినాడ మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో నాలుగు కేజీల గంజాయిని విక్రయించేందుకు వీలుగా చిన్నచిన్న పొట్లాలు చుడుతుండగా పోలీసులు దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేసికోర్టుకు తరలించారు.
- సెప్టెంబర్ ఆరున తుని పట్టణం సీతారామపురం జంక్షన్ వద్ద అప్పుడే బస్సు దిగి అనుమానాస్పదంగా సంచరిస్తున్న కాకినాడకు చెందిన మీసాల షణ్ముఖ, జగడం చైతన్య సిద్ధార్థ, జగన్నాథం, పెద్దిరెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకొని సోదా చేయగా గంజాయి బయటపడింది.

పెంచలయ్య భార్య, పిల్లలతో కలిసి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, మూలం రమేష్ తదితరులు

పెంచలయ్య కుటుంబాన్ని ఆదుకోవాలి

- కలెక్టర్‌ను కలిసిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

గంజాయి గూండాల చేతిలో హత్యకు గురైన ప్రజాగాయకులు, సిపిఎం నాయకులు కె.పెంచలయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు కోరారు. పెంచలయ్య భార్య, పిల్లలతో కలిసి నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాను బుధవారం ఆయన కలిశారు. ఇలాంటి సంఘటనలు మరోసారి పునరావృతం కాకుండా చూడాలని, ప్రజల కోసం, సమాజం కోసం పనిచేసి ప్రాణత్యాగం చేసిన పెంచలయ్య కుటుంబానికి ప్రభుత్వం తరపున రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, ఆయన భార్యకు ప్రభుత్వ ఉద్యోగం, రెండు ఎకరాల పొలం, పిల్లల చదువుకోవడానికి అవకాశం కల్పించాలని కోరారు. ఇందుకు స్పందించిన కలెక్టర్... ప్రభుత్వం నుంచి సాయం అందుతుందని, సిఎం కార్యాలయంలో మాట్లాడి ఏర్పాటు చేస్తామని, ప్రభుత్వం తరపున పూర్తి సహాయ సహకారాలుంటాయని, కేసు విషయంలో పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడి నిందితులకు కఠినంగా శిక్షపడేలా చూస్తామని హామీ ఇచ్చారు. పెంచలయ్య భార్యకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, అందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. నెల్లూరు జిల్లాలో గంజాయి, మాదకద్రవ్యాలను అరికట్టడానికి చర్యలు తీసుకుంటామన్నారు.కలెక్టర్‌ను కలిసి వారిలో పెంచలయ్య భార్య దుర్గా, కుమారులు దేవ్, నిఖిల్, సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, నాయకురాలు షాహీనా బేగం ఉన్నారు.

ఆర్థిక సాయం అందించిన ఎమ్మెల్యే కోటంరెడ్డి

పెంచలయ్య కుటుంబానికి నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి రూ.పది లక్షల ఆర్థిక సాయం అందజేశారు. సిపిఎం నాయకులు మాదాల వెంకటేశ్వర్లతో కలిసి పెంచలయ్య భార్య, కుమారులను ఎమ్మెల్యే పరామర్శించారు. పెంచలయ్య కుటుంబాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత తనపై ఉందని, అందుకే తన వంతుగా ఆర్థిక సాయం అందజేశానని ఎమ్మెల్యే తెలిపారు. ఒకరిని ఐఎఎస్, మరొకరిని ఐపిఎస్ చదివించే బాధ్యత తన కుమార్తెలిద్దరు తీసుకున్నారని తెలిపారు. పెంచలయ్య కుమారులు పదోవ తరగతి వరకు చదువుకునేందుకు సాయం చేసేందుకు ముందుకు వచ్చిన 'మైథిలీ' స్కూల్ యాజమాన్యాన్ని అభినందించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఆర్.శ్రీనివాసులు, టిడిపి నాయకులు అరవ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పసిడి ధరల్లో పెరుగుదల కొనసాగొచ్చు

- కొటాక్ మహీంద్రా ఎఎంసి ఎమ్‌డి నీలేష్ షా

ముంబయి : భవిష్యతులో బంగారం, వెండి ధరలు మరింత పెరగొచ్చని కొటాక్ మహీంద్రా ఎఎంసి మేనేజింగ్ డైరెక్టర్ నీలేష్ షా పేర్కొన్నారు. బుధవారం ఆయన కొటక్ మ్యూచువల్ ఫండ్ వార్షిక మార్కెట్ ఔట్‌లుక్ 2026ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెంట్రల్ బ్యాంకుల నిరంతర బంగారం కొనుగోళ్ల వల్ల బంగారం, వెండి ధరల్లో కూడా పెరుగుదల కొనసాగే అవకాశాలు ఉన్నాయన్నారు. పెట్టుబడిదారులు తమ రిటర్నులపై అంచనాలను కొంచెం తగ్గించుకుని, మారుతున్న మార్కెట్ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కోవడానికి సమతుల్యతతో కూడిన, విభిన్న ఆస్తులలో పెట్టుబడి చేసే వ్యూహాన్ని అనుసరించడం ఉత్తమమని సూచించారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో భారత కంపెనీలు రెండంకెల వృద్ధి సాధించే అవకాశాలు కనిపిస్తున్నాయన్నారు. మిడ్‌క్యాప్స్, లార్జ్, చిన్న క్యాప్స్ కంటే మెరుగైన ప్రదర్శన కనబర్చే అవకాశాలున్నాయన్నారు.

నేడు తిరుపతి, నెల్లూరుల్లో భారీ వర్షాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నైరుతీ బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తీవ్ర అల్పపీడనంగా బలహీన పడినట్లు విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ఈ మేరకు ఆ సంస్థ బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. దీని ప్రభావంతో గురువారం నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ప్రకాశం, అనంతపురం, శ్రీసత్యసాయి, కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించింది. వాయుగుండం నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా తేలికపాటి నుంచి ఒక మోస్తారు వర్షాలు కురుస్తున్నాయి. ఈ నెల 2న ఉదయం 8.30 గంటల నుంచి 3న ఉదయం 8.30 గంటల వరకు తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి..తిరుపతి జిల్లా వాకాడులో 281.4మిల్లీ మీటర్లు, చిట్టమూరులో 226.7, కోటలో 189.3, దొరవారిసత్రంలో124.9, ఓజిలిలో 116.4, నాయుడుపేటలో 106.8 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటాచలంలో 247.5మిల్లీ మీటర్లు,మనుబోలులో 145.3, నెల్లూరు రూరల్‌లో 112.5, ముత్తుకూరులో 106.9మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. బుధవారం సాయంత్రం 5 గంటలకు తిరుపతి జిల్లా తొట్టంబేడులో 47.2 మిల్లీ మీటర్లు, నెల్లూరు జిల్లా కృష్ణపట్నంలో 37.5 మిల్లీమీటర్లు, తిరుపతి జిల్లా మన్నారుపోలూరులో 32.7 మిల్లీ మీటర్లు, చిత్తూరు జిల్లా నింద్రలో 30 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైందని విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది.

దలాల్ స్ట్రీట్‌లో కొనసాగిన నష్టాలు

ముంబయి : దలాల్ స్ట్రీట్ వరుసగా నాలుగో రోజూ ప్రతికూలతను ఎదుర్కొంది. అమ్మకాల ఒత్తిడితో నిఫ్టీ 26వేల దిగువన ముగిసింది. డాలర్‌తో రూపాయి రికార్డ్ పతనానికి తోడు ఆర్‌బిఐ కీలక వడ్డీ రేట్లపై శుక్రవారం ప్రకటన చేయనున్న నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. ఈ నేపథ్యంలోనే బుధవారం బిఎస్ఇ సెన్సెక్స్ 31.46 పాయింట్లు లేదా 0.04 శాతం నష్టంతో 85,106.81కు పరిమితమయ్యింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 46 పాయింట్లు లేదా 0.18 శాతం తగ్గి 25,986 వద్ద ముగిసింది. నిఫ్టీలో మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 0.98 శాతం, 0.71 శాతం చొప్పున కోల్పోయాయి. పిఎస్‌యు సూచీ అత్యధికంగా 3.07 శాతం నష్టపోగా.. ఆటోమొబైల్, కన్స్యూమర్ డ్యూరెబుల్స్, లోహ, ఫైనాన్సీయల్ సర్వీసెస్, ఎఫ్ఎంసిజి, ఆయిల్ అండ్ గ్యాస్ సూచీలు నష్టాలను ఎదుర్కొన్నాయి. సెన్సెక్స్ 30 సూచీలో బిఇఎల్, టైటాన్, మహీంద్రా అండ్ మహీంద్రా, ఎన్‌టిపిసి, ఎస్‌బి షేర్లు అధికంగా నష్టపోయిన వాటిలో ఉన్నాయి. మరోవైపు టిసిఎస్, ఐసిఐసిఐ బ్యాంక్, ఇన్ఫోసిస్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు లాభపడిన వాటిలో ఉన్నాయి.

మారుతి 'ఇ-విటారా'కు 5-స్టార్ ఎన్‌కాప్ సేఫ్టీ రేటింగ్

న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ కంపెనీ మారుతి సుజుకి తన తొలి ఎలక్ట్రిక్ ఎస్‌యువి ఇ-విటారకు భారత్ న్యూ కార్ అసెస్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎన్‌క్యాప్) క్రాష్ టెస్ట్‌లలో అత్యుత్తమంగా రాణించి 5-స్టార్ భద్రతా రేటింగ్‌ను సాధించినట్లు తెలిపింది. భారత్‌లో తయారైన తొలి గ్లోబల్ ఇవి ఎస్‌యువి ఇదేనని పేర్కొంది. ఈ కారులో 7 ఎయిర్‌బ్యాగ్‌లు, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్, యాంటీ-లాక్ బ్రేకింగ్ సిస్టమ్, 360-డిగ్రీ కెమెరా వంటి అధునాతన భద్రతా ఫీచర్లు ఉన్నాయని తెలిపింది.

జీతాల్లో కోతలు దుర్మార్గం

స్టీల్‌ప్లాంట్ ప్రధాన పరిపాలన భవనం ఎదుట కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

ఉత్పత్తి ఆధారంగా జీతాల్లో కోతలు విధించడం దుర్మార్గమని విశాఖ స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ ప్రధాన పరిపాలన భవనం ఎదుట కార్మికులు ధర్నా నిర్వహించారు. 'కార్మికులకు పూర్తి జీతాలు చెల్లించాలి, హెచ్‌ఆర్‌ఎను అమలు చేయాలి, కరెంటు ఛార్జీలు తగ్గించాలి, ఉత్పత్తి ఆధారంగా జీతాలు చెల్లిస్తామన్న సర్క్యులర్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలి' అంటూ పెద్దపెట్టున నినదించారు. ధర్నానుద్దేశించి యూనియన్ ప్రధాన కార్యదర్శి జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ...కోతలతో జీతాలు చెల్లించడం పైశాచిక చర్య అని విమర్శించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తీసుకువచ్చిన సర్క్యులర్‌ను లేబర్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లినా యాజమాన్యం ఏకపక్షంగా అమలు చేయడం దుర్మార్గమన్నారు. గత ఏడాది నుంచి హెచ్‌ఆర్‌ఎను నిలిపివేయడంతో పాటు ఉక్కునగరంలో కార్మికులపై విద్యుత్ ఛార్జీలు పెంచి ఆర్థికంగా ఇబ్బందుల్లోకి నెడుతున్నారని తెలిపారు. యాజమాన్య వైఖరికి వ్యతిరేకంగా కార్మిక వర్గం పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధంగా ఉందని హెచ్చరించారు. యూనియన్ అధ్యక్షులు యు.రామస్వామి మాట్లాడుతూ.. రా మెటీరియల్ లేకపోవడం వల్లే ఉత్పత్తి తగ్గిందన్నారు. ముడి సరుకు అందుబాటులో ఉంటే పూర్తి స్థాయి ఉత్పత్తికి కార్మికులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. గత నెల 30న 20,400 టన్నుల ఉత్పత్తి సాధించింది ఇదే కార్మికవర్గమని గుర్తుచేశారు. మంగళవారం విద్యుత్ సరఫరా లేక ప్లాంట్ ఆగిన విషయం వాస్తవం కాదా ? అని ప్రశ్నించారు. వాస్తవాలను దాచిపెట్టి కార్మికులపై నిందలు వేసేందుకు యాజమాన్యం ప్రయత్నించడం దారుణమన్నారు. కన్వేయర్ బెల్ట్‌ను కార్మికులు తెంపేసారని యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేసిందని, వారి వచ్చి ప్లాంట్ సందర్శించి ఇక్కడ అలాంటి ఘటనలు ఏమీ చోటు చేసుకోలేదని చెప్పినప్పటికీ యాజమాన్యం మొండిగా కార్మికులపై తప్పుడు ప్రచారం చేయడం అంగీకారయోగ్యం కాదన్నారు. కార్మికులకు జరుగుతున్న అన్యాయంపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని కోరారు. ధర్నాలో నాయకులు పి.శ్రీనివాసరాజు, పుల్లారావు, బిఎన్.మధుసూదన్, టివికె.రాజు, బి.అప్పారావు, శ్రీనివాసరెడ్డి, దుర్గాప్రసాద్, పవన్, కర్రి శ్రీనివాస్, మురళి, చంద్రశేఖర్, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉక్కు ప్రధాన పరిపాలన భవనం వద్ద ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న అయోధ్యరామ్

పాతాళానికి రూపాయి

- డాలర్‌తో 90.21కు క్షీణత
- నూతన రికార్డ్ కనిష్టం
- పతనంపై ప్రభుత్వం ఆందోళన చెందడం లేదన్న సిఇఎ
- ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావమే : నిపుణులు

ముంబయి : భారత ఆర్థిక వ్యవస్థ దూసుకుపోతోందన్న మోడీ సర్కార్ గొప్పలకు భిన్నంగా అంతర్జాతీయ మార్కెట్‌లో రూపాయి విలువ అధోపాతాళానికి పడిపోయింది. రూపీ రోజు రోజుకు క్షీణిస్తూ భారతదేశ చరిత్రలోనే ఎప్పుడూ లేని స్థాయిలో తాజాగా డాలర్‌తో రూపాయి 90 దాటి మరింత క్షీణించింది. బుధవారం మరో 25 పైసలు కోల్పోయి రికార్డ్ స్థాయిలో 90.21కు పతనమయ్యింది. ఇంతక్రితం మంగళవారం సెషన్‌లో 43 పైసలు పతనమై 89.96 ఆల్‌టైం కనిష్టం వద్ద ముగిసింది.

చమురు ధరలు పెరగొచ్చనే అంచనాలకు తోడు విదేశీ ఇన్వెస్టర్లు భారత స్టాక్ మార్కెట్ల నుంచి ఈక్విటీలను తరలించుకుపోవడం, అమెరికాతో నెలకొన్న వాణిజ్య ఒప్పంద అనిశ్చితి, దిగుమతిదారుల నుంచి డాలర్లకు డిమాండ్ తదితర అంశాలు రూపాయి విలువను అమాంతం పడిపోయేలా చేస్తోన్నాయి. రూపాయి విలువ వరుసగా పడిపోతోంటే ఇటు బిజెపి పాలకవర్గాలు కానీ.. అటు ఆర్‌బిఐ కానీ స్పందించకపోవడం గమనార్హం. పైగా దీనిపై ప్రభుత్వం ఎలాంటి ఆందోళన చెందడం లేదని కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సలహాదారు పేర్కొనడం విశేషం. దేశీయ ఈక్విటీ మార్కెట్‌లో అమ్మకాల పరంపర, భారత్, అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం విషయంలో ఇప్పటికీ ఒక స్పష్టత రాకపోవడమూ కరెన్సీ విలువ తగ్గుదలకు కారణమని ఫారెక్స్ ట్రేడర్లు చెబుతున్నారు. రూపాయి పతనం ద్రవ్యోల్బణానికి ఆజ్యం పోయనుందని హెచ్చరిస్తోన్నారు.

ఆందోళనేమి లేదు : సిఇఎ నాగేశ్వరన్

డాలరుతో రూపాయి మారకం విలువ ఆల్‌టైమ్ కనిష్ఠ స్థాయికి పడిపోవడంపై ప్రభుత్వమేమీ ఆందోళన చెందడం లేదని కేంద్ర ప్రభుత్వ ముఖ్య ఆర్థిక సలహాదారు (సిఇఎ) వి అనంత నాగేశ్వరన్ అన్నారు. బుధవారం న్యూఢిల్లీలో జరిగిన కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సిఐఐ) సమావేశంలో నాగేశ్వరన్ మాట్లాడుతూ.. రూపాయి విలువ 90 రూపాయల మార్కు దాటడం వల్ల ద్రవ్యోల్బణంపై గానీ, ఎగుమతులపై గానీ ప్రభావం ఉండబోదన్నారు. వచ్చే ఏడాది పరిస్థితి మెరుగవుతుందని అన్నారు.

ధరలకు ఆజ్యమే..

రూపాయి పతనంపై పెద్ద ఆందోళన అవసరం లేదని సిఇఎ అనంత నాగేశ్వరన్ వ్యాఖ్యలు కరెన్సీ క్షీణత తీవ్రతను తగ్గించుకోవడానికి చేసిన వ్యాఖ్యలుగా కనబడుతున్నాయని నిపుణులు భావిస్తున్నారు. రూపాయి విలువ రికార్డ్ స్థాయిలో తగ్గడం ద్వారా తీవ్ర పరిణామాలే ఉంటాయని అనేక అంశాలు స్పష్టం చేస్తోన్నాయి. ముఖ్యంగా దిగుమతులు తీవ్రంగా ప్రభావితం కానున్నాయి. దేశంలో ప్రజలు అధికంగా ఉపయోగించే ముడి చమురు, బంగారం, ఎలక్ట్రానిక్స్, మెడికల్ పరికరాలు వంటి దిగుమతి వస్తువుల ధరలు అమాంతం పెరుగుతాయి. దీని ఫలితంగా పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు పెరుగుతాయి. అంతిమంగా ఇతర ఉత్పత్తుల రవాణా ఖర్చులు కూడా పెరుగుతాయి. ఈ పరిణామాలు ద్రవ్యోల్బణానికి ఆజ్యం పోస్తాయి. ప్రజలు ఆదాయాలు హరించుకుపోవడంతో పొదుపు పడిపోనుంది.

విదేశీ విద్యా భారం..

విదేశాలకు వెళ్ళేవారికి ఖర్చులు అధికమవుతాయి. విదేశాల్లో చదువుతున్న భారతీయ విద్యార్థులకు ఫీజులు, జీవన వ్యయం మరింత భారం కానుంది. ఇప్పటికే డాలర్‌తో రూపాయి పతనానికి తోడు అమెరికా లాంటి దేశాల్లో గత రెండు, మూడేళ్లుగా ఫీజులు భారీగా పెరిగాయి. మరోవైపు భారత కంపెనీలు లేదా ప్రభుత్వం విదేశాల్లో తీసుకున్న రుణాలపై అధికంగా వడ్డీ, అసలు చెల్లించాల్సి ఉంటుంది. ఈ చెల్లింపులు పెరగడం ద్వారా దేశానికి ఆర్థిక భారంగా మారుతాయి. స్టాక్ మార్కెట్లు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కోనున్నాయి. దేశ కరెన్సీ బలహీనపడితే గ్లోబల్ మార్కెట్లలో దేశ ఆర్థిక స్థిరత్వంపై సందేహాలు పెరిగి పెట్టుబడులు రాకుండా పోతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

నిర్బంధం ప్రయోగిస్తే ప్రజాగ్రహం తప్పదు

- రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ప్రజా ఉద్యమాలపై నిర్బంధం ప్రయోగిస్తే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని పలువురు వక్తలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. వామపక్షాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యాన ప్రజా ఉద్యమాలపై ప్రభుత్వ నిర్బంధాన్ని ఖండిస్తూ బుధవారం శ్రీకాకుళం నగరంలోని సుందరయ్య భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, సిపిఐ లిబరేషన్ జిల్లా కార్యదర్శి టి.సన్యాసిరావు, న్యూ డెమోక్రసీ జిల్లా ఉపాధ్యక్షులు వంకల మాధవరావు మాట్లాడారు. ప్రజా ఉద్యమాలపై ఎందుకు నిర్బంధం ప్రయోగిస్తు న్నారని జిల్లా మంత్రులను ప్రశ్నించారు. కార్గో ఎయిర్‌పోర్టు, థర్మల్ ప్లాంట్ ప్రతిపాదనలు రద్దు చేయాలని ధర్నాలకు పిలుపిస్తే, అనుమతులు నిరాకరిస్తూ ప్రజలపై నిర్బంధాన్ని ప్రయోగించి అక్రమ అరెస్టులకు పాల్పడ్డారని ఆగ్రహించారు. నిర్బంధాలు ప్రయోగించిన ప్రభుత్వాలు కాలగర్భంలో కలిసిపోయాయని, ఇదే ఒరవడి కొనసాగిస్తే ఈ ప్రభుత్వానికీ అదే గతి పడుతుందని హెచ్చరించారు. ధర్నాలు, ప్రదర్శనలు నిరాకరించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. జిల్లా తీరప్రాంతాన్ని అదానికి, మరోవైపు కార్గో ఎయిర్‌పోర్టు, ఇంకోవైపు థర్మల్ ప్లాంట్‌తో విధ్వంసానికి ఎందుకు పూనుకుంటున్నారో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజల ఆస్తులను కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టడమే అభివృద్ధా అని ప్రశ్నించారు. ప్రజా ఉద్యమాలపై నిర్బంధం ఎత్తివేయాలని, రాజ్యాంగం కల్పించిన వాక్ స్వాతంత్ర్యం, సభలు, సమావేశాలు పెట్టుకునే హక్కును కాపాడాలని రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానించింది. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కార్గో ఎయిర్‌పోర్టు వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కొమర వాసు, జోగి అప్పారావు, ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు వాబ యోగి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, పౌర హక్కుల సంఘం నాయకులు కె.వి జగన్నాథం, థర్మల్ పవర్ ప్లాంట్ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు సవర సింహాచలం, శ్రామిక మహిళా సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ కె.నాగమణి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి.ప్రసాదరావు, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్నతో పాటు పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.


సంఘీభావం తెలియజేస్తున్న వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు

వెండి మెరుపులు

న్యూఢిల్లీ : వెండి ధరలు భగ్గుమంటున్నాయి. బంగారంతో పోటీపడి పెరుగుతోన్నాయి. దేశీయంగా కిలో వెండి ధర రూ.1.84 లక్షలు పలికి సరికొత్త రికార్డు గరిష్ఠాలను నమోదు చేసింది.

మరోవైపు 10 గ్రాముల బంగారం ధర రూ.1.30 లక్షల పైనే నమోదయ్యింది. గుడ్‌రిటర్న్స్ ప్రకారం.. బుధవారం హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారంపై రూ.710 పెరిగి రూ.1,30,580కి చేరింది. 22 క్యారెట్ల పసిడి ధర రూ.1,19,700గా నమోదయ్యింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ధర పెరగడానికి తోడు, రూపాయి విలువ పతనం కావడమూ ఈ లోహాల ధరల పెరుగుదలకు కారణమని నిపుణులు పేర్కొంటున్నారు. బుధవారం డాలరుతో రూపాయి మారకం విలువ 90 మార్కు దాటడంతో బంగారం, వెండి ధరలు భగ్గుమంటున్నాయి.

ఏ పంటకూ మద్దతు ధర కల్పించలేదు

- మాజీ మంత్రి కారుమూరి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ధాన్యం సహా ఏ పంటకూ మద్దతు ధర కల్పించని దయనీయ పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు విమర్శించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతన్న మీ కోసం పేరుతో ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమం వారిని మోసం చేయడానికేనని తెలిపారు. రైతులు లేకుండా కార్యక్రమాలు చేస్తూ పచ్చకండువాలు కప్పుకున్న అధికార పార్టీ కార్యకర్తలతో నిర్వహిస్తున్నారని ఆరోపించారు. మంత్రులు నేరుగా రైతులను ఎందుకు కలవడం లేదని ప్రశ్నించారు. రూ.కోట్లతో ప్రచారమే పరమావధిగా వ్యవహరిస్తున్నారని, రైతుల కోసం ఒక్క సమీక్ష కూడా నిర్వహించలేదని అన్నారు.

యథేచ్ఛగా రాజ్యాంగ ఉల్లంఘన

- మాజీ ఎమ్మెల్యే టిజెఆర్ సుధాకర్‌బాబు

టిడిపి కూటమి ప్రభుత్వం యథేచ్ఛగా రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడుతోందని, రాజకీయ కక్షసాధింపు చర్యలకు దిగుతోందని వైసిపి మాజీ ఎమ్మెల్యే, ఎస్‌సి సెల్ అధ్యక్షులు టిజెఆర్ సుధాకర్‌బాబు విమర్శించారు. సాక్ష్యాలు, కారణాలు లేకుండా యడాపెడా కేసులు బనాయిస్తున్నారని విమర్శించారు. టిడిపిలో తీవ్ర ఆధిపత్య పోరు నడుస్తోందని, హత్యలకు సైతం వెనుకాడటం లేదని, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో హత్యలకు అదే కారణమని తెలిపారు. వాటిని వైసిపికి ఆపాదిస్తున్నారని, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోదరులపై అక్రమంగా కేసులు బనాయించారని తెలిపారు.

ఎల్‌ఐసి నుంచి రెండు కొత్త ప్లాన్లు

- బీమా కవచ్, ప్రొటెక్షన్ ప్లస్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - హైదరాబాద్

ప్రభుత్వ రంగంలోని దిగ్గజ జీవిత బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్‌ఐసి) కొత్తగా రెండు పాలసీలను విడుదల చేసింది. బీమా కవచ్, ప్రొటెక్షన్ ప్లస్ పేరుతో వీటిని బుధవారం ఎల్‌ఐసి సిఇఒ, ఎండి ఆర్ దొరైస్వామి ఆవిష్కరించారు. ఎల్‌ఐసి బీమా కవచ్ రిస్క్ కవర్ అందించే ప్లాన్. పెట్టుబడి లాభాపేక్ష లేకుండా కేవలం కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించాలని కోరుకునే వారికి ఇది అనుకూలంగా ఉంటుందని ఎల్‌ఐసి తెలిపింది. ఇది నాన్-పార్టిసిపేటింగ్, నాన్ లింక్డ్, ఇండివిడ్యువల్ ప్యూర్ రిస్క్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్లాన్. ఈ పాలసీ వ్యవధిలో పాలసీదారు దురదృష్టవశాత్తూ మరణిస్తే నామినీకి హామీ ఇవ్వబడిన ప్రయోజనాన్ని అందిస్తుంది. కనీస మ్యాచూరిటీ 28 ఏళ్లుగా.. గరిష్ట పరిమితి 100 ఏళ్లుగా నిర్ణయించింది.

ఎల్‌ఐసి ప్రొటెక్షన్ ప్లాన్‌లో జీవిత బీమా కవరేజీతో పాటు మార్కెట్-లింక్డ్ పొదుపు ప్రయోజనాలను కలిపి అందిస్తుంది. పాలసీదారులు తమ ప్రీమియంలను వివిధ ఫండ్లలో పెట్టుబడి పెట్టడానికి ఇది వీలు కల్పిస్తుంది. ఇది నాన్-పార్టిసిపేటింగ్, లింక్డ్, ఇండివిడ్యువల్ సేవింగ్స్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్లాన్. భద్రత, పెట్టుబడి లక్షణాలు రెండూ కోరుకునే వారికి ఈ ప్లాన్ అనువుగా ఉంటుంది. ఫండ్లు, క్యాపిటల్ మార్కెట్లలో పెట్టుబడి పెట్టబడతాయి కాబట్టి పాలసీ విలువ మార్కెట్ ప్రమాదాలకు లోబడి ఉంటుందని ఎల్‌ఐసి తెలిపింది. ఈ పాలసీని 5,7,10,15 ఏళ్ల కాలపరిమితితో ఎంచుకోవచ్చు.

సంపాదకీయం

దుర్మార్గం!

మోడీ ప్రభుత్వ హయాంలో కేంద్ర దర్యాప్తు సంస్థలు బిజెపి రాజకీయ ఆయుధంగా మారిపోయాయి. ఎన్నికలకు ముందు ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల్లో కీలక నేతలకు, సిఎంలకు నోటీసులు పంపడం, అరెస్టులు చేయడం, జైలుకు పంపడం, తప్పుడు కేసులు పెట్టడం లాంటి చర్యలకు పాల్పడటం ద్వారా బిజెపి విజయావకాశాలు మెరుగుపరచడంలో భాగస్వాములుగా మారడం దుర్మార్గం. స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతున్న, త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తరుణంలో కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, ఆ రాష్ట్ర మాజీ ఆర్థిక మంత్రి, ప్రఖ్యాత ఆర్థికవేత్త డాక్టర్ థామస్ ఐజాక్, కేరళ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ బోర్డు (కెఐఐఎఫ్‌బి) సిఇఒ డాక్టర్ కెఎం అబ్రహాంలకు నోటీసులు పంపడం చర్చనీయాంశమైంది.

దేశంలో తీవ్ర పేదరికాన్ని తరిమేసిన రాష్ట్రంగా ఈ ఏడాది నవంబర్ 1న కేరళను కేంద్ర ప్రభుత్వమే ప్రకటించాల్సి వచ్చింది. అక్షరాస్యతలోనే కాదు డిజిటల్ అక్షరాస్యతలోనూ, ప్రభుత్వ రంగంలోనే అత్యున్నత ప్రమాణాలతో కూడిన వైద్యం అందించడంలో, జీవన ప్రమాణాలు మెరుగుపరచడంలో, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో, మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయడంలో ప్రపంచ స్థాయిలోనే ముందుంది. పినరయి విజయన్ నేతృత్వంలోని లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డిఎఫ్) గత తొమ్మిదిన్నరేళ్లలో అప్రతిహతంగా సాధిస్తున్న ప్రగతిని అడ్డుకునేందుకు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం చేయని ప్రయత్నం లేదు. కేరళ పన్నుల ద్వారా చెల్లించిన ఆదాయంలో వాటా ఇవ్వడానికి నిరాకరిస్తుండటం, అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బిల్లులను గవర్నర్ల ద్వారా అడ్డుకోవడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందంటే ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి నేతృత్వంలోని కేంద్ర సర్కారు నిర్వాకం అర్థమవుతుంది. కెఐఐఎఫ్‌బిని 1999లో అప్పటి యుడిఎఫ్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దాన్ని విజయన్ ప్రభుత్వం విస్తరించింది. కరోనా సమయంలో విరాళాల సేకరణ కోసం ప్రకటించిన పిఎం కేర్స్ లాగానో, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) లాగానో లెక్కలు చూపేందుకు నిరాకరించే సంస్థ కాదు. కేరళ ప్రభుత్వం ఆర్‌బిఐ అనుమతితో ఏర్పాటు చేసి, అన్ని నిబంధనలనూ పాటిస్తున్న సంస్థ. నిధులు అందుబాట్లో లేకుండా చేసి కేరళ అభివృద్ధిని అడ్డుకోవాలనుకుంటున్న కుతంత్రాలకు చరమగీతం పాడేందుకు 2019లో ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం రాష్ట్రంలో మౌలిక వసతుల నిర్మాణానికి అవసరమైన నిధుల సమీకరణ కోసం మసాలా బాండ్లు జారీ చేసింది. వాటి ద్వారా రూ.2,150 కోట్లు సమీకరించింది. ఆ నిధుల్లో రూ.466.92 కోట్లు భూముల కొనుగోలుకు వినియోగించారని, ఆర్‌బిఐ నిబంధనలను ఉల్లంఘించారని, నెల రోజుల్లో సిఎం, నాటి ఆర్థిక మంత్రి, సిఇఒ వివరణ ఇవ్వాలని నోటీసుల సారాంశం. ఇది శుద్ధ అబద్ధం. కెఐఐఎఫ్‌బి భూములు కొనుగోలు చేయలేదు. భూసేకరణ కోసం రూ.66 కోట్లు మాత్రమే వినియోగించారు.

కెఐఐఎఫ్‌బి గత తొమ్మిదిన్నరేళ్లలో కేరళ మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ.90,562 కోట్లు ఖర్చు చేసింది. అత్యుత్తమ ఆసుపత్రులను అభివృద్ధి చేసింది. అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యాసంస్థలను నెలకొల్పింది. తీర ప్రాంతాలు, పర్వత ప్రాంతాల్లో సైతం రహదారులు, క్రీడా మైదానాలు, ఆకస్మిక వరదలతో వందల మంది ప్రాణాలు కోల్పోయిన వయనాడ్ ప్రాంతంలో మౌలిక సదుపాయాలు, టౌన్ షిప్ నిర్మించడానికి... ఇలా ప్రజా సంక్షేమానికి అంకితమైన సంస్థగా పేరు తెచ్చుకుంది. అవినీతి బురదలో నిండా మునిగిన ఒక్క బిజెపి నేతకు గానీ, అమెరికా లాంటి దేశాల్లో కేసులు ఎదుర్కొంటున్న అదానీ లాంటి వారికిగానీ నోటీసు పంపేందుకు దర్యాప్తు సంస్థలు సాహసించకపోగా, ఆ పార్టీలో చేరిన అవినీతిపరులపైనా చర్యలు తీసుకోకుండా వాటి చేతులు కట్టేసిన ఉదాహరణలు కోకొల్లలు. అందుకు భిన్నంగా ప్రతిపక్షాలపై అవి విరుచుకుపడిన ఉదంతాలెన్నో! జార్ఖండ్ సిఎం హేమంత్ సొరేన్, ఢిల్లీ మాజీ సిఎం కేజ్రీవాల్‌లను జైలులో పెట్టడం, ఇటీవల బీహార్ ఎన్నికలకు ముందు ఇడి, సిబిఐలు 'ఇండియా' వేదిక సిఎం అభ్యర్థి తేజస్వి యాదవ్ తోపాటు ఆయన కుటుంబం, నేతలపై దాడులు చేయడం అందరికీ తెలిసిందే. స్వచ్ఛమైన, ప్రజాస్వామ్యయుతమైన, ప్రజానుకూలమైన పాలనను అందిస్తున్న కేరళ ఎల్‌డిఎఫ్ ప్రభుత్వానికి అడుగడుగునా అడ్డుపడటం మోడీ సర్కారుకు అలవాటుగా మారిపోయింది. ప్రఖ్యాత ఆర్థికవేత్త, నాటి ఆర్థిక మంత్రి థామస్ ఐజాక్‌కు ఇడి పలుమార్లు నోటీసులు పంపింది. లోక్‌సభ ఎన్నికల ప్రచార సమయంలోనూ పంపింది. అందుకు కారణాలను వివరించలేదు. నిరంతరం అధికారులకు సమన్లు పంపుతోంది. ఈ అంశంపై హైకోర్టు సైతం ప్రశ్నించింది. ఈ కేసు విచారణ హైకోర్టులో కొనసాగుతూనే ఉంది. ఈ తరుణంలో మళ్లీ నోటీసులు పంపడం కెఐఐఎఫ్‌బికి నిధుల సమీకరణను అడ్డుకోవడం, ఎల్‌డిఎఫ్ ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసే ప్రయత్నమే! పోరాటాలు, ఉద్యమాల చరిత్ర కలిగిన కేరళలోని ప్రజానీకం విజ్ఞతతో ఇటువంటి కుతంత్రాలను తిప్పికొట్టేందుకు, అందుకు పాల్పడుతున్న వారికి బుద్ధి చెప్పేందుకు మరోసారి సిద్ధమవుతోంది.

మహనీయుల మాట



నిజం కూడా నిరంతరం ప్రచారంలో వుండాలి. లేకుంటే నిజం అబద్ధంగా మారుతుంది. రాష్ట్రాన్ని కాదు, ప్రపంచాన్ని సైతం ప్రమాదంలోకి నెడుతుంది!

- డా|| బి.ఆర్.అంబేద్కర్, భారత రాజ్యాంగ నిర్మాత.

నామినేటెడ్ గవర్నర్ల 'నిష్పాక్షికత'

విశ్లేషణ

ఎం.ఎ. బేబీ

గవర్నర్లు అధికార జోక్యానికి పాల్పడతారనేది ముందుగా ఊహించలేకపోయారు.

గవర్నర్ల పాత్ర మీద సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు, తదనంతరం ఆ తీర్పు మీద రాష్ట్రపతి సలహా కోరుతూ సుప్రీంకోర్టుకు నివేదించడం, దరిమిలా సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం వెలువరించిన సలహా...వంటి పరిణామాలన్నీ మరోసారి రాజ్యాంగ స్ఫూర్తి మీద చర్చకు దారితీశాయి. రాజ్యాంగ అసెంబ్లీ రాజ్యాంగ తుది ప్రతిని ఆమోదించే సందర్భంలో జరిగిన చర్చల స్ఫూర్తి అక్షర రూపంలో మన రాజ్యాంగంలో ప్రతిఫలించింది. మన రాజ్యాంగం 1949 నవంబరు 26న ఆమోదం పొందగా...తాజాగా సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం తీర్పు అదే రోజున వెలువడడం యాదృచ్ఛికంగా జరిగిందని భావించాలి.

గవర్నర్ల పాత్ర మీద రాజ్యాంగ అసెంబ్లీలో నాణ్యమైన, విలువైన చర్చలు జరిగాయి. స్వతంత్ర భారత దేశంలో గవర్నర్లకు ఉండే అధికారాలు, వారు పోషించాల్సిన పాత్ర మీద అనేక ప్రశ్నలు తలెత్తాయి. ప్రతి సందర్భంలోనూ బాబా సాహెబ్ బి.ఆర్.అంబేద్కర్ జోక్యం చేసుకుని...రాజ్యాంగ డ్రాఫ్ట్ కమిటీ అనేక జాగ్రత్తలు తీసుకుని ఏ దృష్టితో గవర్నర్ల అధికారాలు, పాత్రను రూపొందించిందో వివరణలు ఇచ్చారు. తుది ముసాయిదాలో వాటికి చోటు కల్పించామని స్పష్టం చేశారు.

నామినేటెడ్ గవర్నర్ల నిష్పాక్షికత గురించి రాజ్యాంగసభ సభ్యులు పలు అనుమానాలు వ్యక్తం చేశారు. ప్రజల ద్వారా ఎన్నుకోబడకుండా కేంద్ర ప్రభుత్వం ద్వారా నామినేట్ అయ్యే గవర్నర్లు కేంద్ర ప్రభుత్వం చేతిలో కీలుబొమ్మలుగా వ్యవహరించే అవకాశం ఉంటుంది. ఈ వ్యవహారం అంతా 1935 నాటి చట్టం ద్వారా నియమించబడిన ప్రాదేశిక గవర్నర్ల వ్యవస్థకన్నా ఏమాత్రం భిన్నంగా లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. గవర్నర్ల వ్యవస్థ 'వైస్రాయి నామినీ'లకు నకలుగా మారకుండా చూడాలని ఆందోళన వ్యక్తం చేశారు. గవర్నరు పదవి చేపట్టేవారు సందేహాలు, అనుమానాలకు అతీతంగా వ్యవహరించాలని ఆకాంక్షించారు.

అచ్చమైన రాజ్యాంగ గవర్నర్

రాజ్యాంగ అసెంబ్లీ సభ్యులు 1947లోను 1949లో రాజ్యాంగాన్ని ఆమోదించడానికి ఉద్దేశించిన సదస్సులోను వెలిబుచ్చిన సందేహాలకు డాక్టర్ అంబేద్కర్ సమాధానం ఇస్తూ 'గవర్నర్లను కేంద్ర ప్రభుత్వం నామినేట్ చేస్తుంది తప్ప ఇందులో రాష్ట్రాలకు ఏ పాత్ర లేదని సభ్యులు అభిప్రాయపడ్డారు. కానీ గవర్నర్లు రాష్ట్ర మంత్రి మండలి సలహా మేరకే నడుచుకోవాలని నేను నిస్సందేహంగా చెప్పగలను. గవర్నరు కేంద్ర ప్రభుత్వ ప్రతినిధి మినహా మరొకటి కాదు' అని వివరించారు.

> గవర్నర్ల విచక్షణాధికారాల పేరిట తిరిగి 1935 నాటి భూతానికి ప్రాణం పోస్తున్నాం అన్న భావన పొరపాటు అవగాహన. ఆ నాటి చట్టం గవర్నర్లకు దేనినయినా తోసిపుచ్చే విశేషాధికారాలు కల్పించింది. కానీ మన రాజ్యాంగం అలాంటి అధికారాలు కల్పించలేదు' అని స్పష్టం చేశారు. కానీ సభ్యులు పదే పదే అవే అభ్యంతరాలు వ్యక్తం చేస్తుండడంతో 'సభ్యులు రాజ్యాంగంలో పొందుపరిచిన అంశాలకు మించి ఆలోచించ వద్ద'ని నిష్కర్షగా చెప్పారు అంబేద్కర్. 'గవర్నర్లకు జోక్యం చేసుకునే అధికారాలు లేవు. గవర్నర్లకు ఉండే విచక్షణాధికారాలూ పరిమితమయినవే' అని వివరించారు.



> 'గవర్నర్‌కు ఉండే అధికారాలు చాలా పరిమితం, అతి స్వల్పం. గవర్నర్ పదవి అలంకార ప్రాయం. గవర్నర్ ఎంపిక కోసం ముందుకు వచ్చేవాళ్ళు బహు కొద్దిమంది మాత్రమే ఉంటారు' అని అంబేద్కర్ వ్యాఖ్యానించారు. గవర్నర్ల అధికారాలు, రాష్ట్ర పరిపాలనలో వారి ప్రాత్ర గురించి రాజ్యాంగ నిర్ణేతల అవగాహన అంత స్పష్టంగా ఉన్నది. దేశ వాస్తవిక పరిస్థితులను ప్రతిబింబించే విధంగా రాజ్యాంగాన్ని రూపొందించిన దూరదృష్టి వారిది. అయితే కొద్దిమంది స్వార్థపూరిత పక్షపాత ధోరణులుగల వ్యక్తులు రాజ్యాంగపరమైన అత్యున్నత స్థానాన్ని అధిరోహిస్తారని బహుశా వాళ్ళే ఊహించి కూడా వుండరు.

'రాజ్యాంగపరంగా నియమించబడే ఈ గవర్నర్లు అచ్చంగా రాజ్యాంగ నిర్వహణకు మాత్రమే పరిమితమని నేను నొక్కి చెప్పదలిచాను. వారు పార్లమెంటరీ వ్యవస్థ సజావుగా నడిచేలా చూడాలే తప్ప ఎన్నికయిన మంత్రిమండలికి శత్రువుల్లా వ్యవహరించకూడదు' అని స్పష్టం చేశారు.

రాజ్యాంగ అసెంబ్లీలో తీవ్రమైన చర్చ జరిగిన మరో అంశం గవర్నర్లకు ఉండే విచక్షణాధికారాల గురించి. రాజ్యాంగ అసెంబ్లీ సభ్యులు అనేకమంది ఈ అధికారాల పట్ల వ్యతిరేకత వ్యక్తం చేశారు. ఇది 1935 నాటి చట్టం కన్నా భిన్నంగా లేదని ఎత్తి చూపారు. మరోసారి డాక్టర్ అంబేద్కర్ ఈ సందేహాలను నివృత్తి చేశారు. గవర్నర్ల విచక్షణాధికారాల పేరిట తిరిగి 1935 నాటి భూతానికి ప్రాణం పోస్తున్నాం అన్న భావన పొరపాటు అవగాహన. ఆ నాటి చట్టం గవర్నర్లకు దేనినయినా తోసిపుచ్చే విశేషాధికారాలు కల్పించింది. కానీ మన రాజ్యాంగం అలాంటి అధికారాలు కల్పించలేదు' అని స్పష్టం చేశారు. కానీ సభ్యులు పదే పదే అవే అభ్యంతరాలు వ్యక్తం చేస్తుండడంతో 'సభ్యులు రాజ్యాంగంలో పొందుపరిచిన అంశాలకు మించి ఆలోచించ వద్ద'ని నిష్కర్షగా చెప్పారు అంబేద్కర్. 'గవర్నర్లకు జోక్యం చేసుకునే అధికారాలు లేవు. గవర్నర్లకు ఉండే విచక్షణాధికారాలూ పరిమితమయినవే' అని వివరించారు.

'పరిమిత విచక్షణ' అంటే ఎన్నికల అనంతరం మెజారిటీ శాసనసభాపక్షం నాయకుడిని ఎన్నుకుంటే ఆ నాయకుడిని ప్రభుత్వం ఏర్పాటు చెయ్యమని కోరడం, నూతన ప్రభుత్వంతో ప్రమాణ స్వీకారం చేయించడం వంటి రాజ్యాంగంలో పొందుపరిచిన నిర్దిష్టమయిన విధులే తప్ప మరొకటి కాదు' అని కూడా అంబేద్కర్ పేర్కొన్నారు. అయితే ఇవాళ ప్రతిపక్ష రాజకీయ పార్టీల పాలిత రాష్ట్రాల్లో గవర్నర్లు ఏ స్థాయిలో అధికార జోక్యానికి పాల్పడుతున్నారో చూస్తే ఆనాడు డాక్టర్ అంబేద్కర్ ఇదంతా ఊహించి ఉండరని తేటతెల్లం అవుతున్నది.

ప్రాసంగిక చర్చ

శాసన సభలు ఆమోదించిన బిల్లులపై ఆమోదముద్ర వెయ్యకుండా సతాయిస్తున్న గవర్నర్ల అధికారాల గురించి మరోసారి చర్చ మొదలవ్వడం స్వాగతించాల్సిన అంశమే. ఇవాళ మరోసారి రాజ్యాంగ అసెంబ్లీ సభ్యులు 1935 నాటి చట్టాన్ని ఉదహరిస్తూ లేవనెత్తిన ప్రశ్నలు ప్రాసంగికమైనవే. 'ఎన్నికయిన శాసన వ్యవస్థ ఆమోదించిన బిల్లు నామినేట్ చెయ్యబడిన గవర్నరు దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి ఉండకూడదు. ఇది చాలా ప్రమాదకరం. ఇది గవర్నర్‌కు పరోక్షంగా విచక్షణాధికారాలు కట్టబెట్టడమే' అని రైతు నాయకుడు యన్.జి.రంగా అభ్యంతరం లేవనెత్తారు. రోహిణి కుమార్ చౌదరి కూడా గొంతు కలుపుతూ 'అయ్యా! రాష్ట్రపతి ఆమోదం కోసం ఒక బిల్లు పంపాలా వద్దా అని నిర్ణయించే అధికారం గవర్నరుకు దఖలు చెయ్యడం అంటే ఇది ఎన్నికయిన శాసన వ్యవస్థ మీద దాడిగా పరిగణించాలి. ఇది ఒకప్పటి వైస్రాయ్ నియమిత ఏజెంట్లుగా వ్యవహరించిన బ్రిటిష్ గవర్నర్ల వ్యవస్థ అవశేషం తప్ప వేరొకటి కాదు. గవర్నర్లకు జోక్యం చేసుకునే అధికారాలు ఉండకూడదని మనం అనేకసార్లు చర్చించాం. మీరు గవర్నర్లకు ఆ అధికారాలు ఇస్తే వాళ్ళు బ్రిటీష్ గవర్నర్ల వలె తయారవుతారు' అని అభ్యంతరం వ్యక్తం చేశారు.

ఈ అభ్యంతరాలను, భయ సందేహాలను నివృత్తి చేస్తూ డాక్టర్ అంబేద్కర్ ఇలా చెప్పుకొచ్చారు. 'ఈ అధికార స్వభావం గురించి సభ్యులలో పొరబాటు అవగాహన నెలకొన్నదని తెలియవస్తున్నది. రాష్ట్రపతి ఆమోదం కోసం పంపాల్సిన బిల్లులను రిజర్వ్ చేసి ఉంచేందుకు గవర్నర్లకు స్వయంగా విచక్షణాధికారాలు వున్నట్లు కాదు. గవర్నర్‌కు అలా తోసిపుచ్చే సర్వసాధారణ అధికారం ఉన్నదని భావించడం శుద్ధ పొరపాటు. గవర్నర్‌కు అలాంటి అధికారాలు లేవు. ఏదైనా బిల్లు రాజ్యాంగ మౌలిక సూత్రాలను ఉల్లంఘించేదిగా ఉన్నా లేక కేంద్రం అధికారానికి ప్రమాదకరంగా పరిణమించేలా ఉంటే తప్ప గవర్నర్‌కు బిల్లులను రిజర్వ్ చేసే అధికారం లేదు' అని స్పష్టం చేశారు.

అంతే కాదు, 'శాసనసభ ఆమోదించిన బిల్లు మీద గవర్నరు తీర్పరిగా వ్యవహరించడానికి ఆ కుర్చీలో కూర్చోలేదు అని రాజ్యాంగ అసెంబ్లీకి నేను స్పష్టంగా అభయమిస్తున్నా. గవర్నర్ల విధులు అతి సాధారణమైనవి. మన రాజ్యాంగం ఏం చెబుతుంది? మంత్రివర్గ సలహా మేరకు నడుచుకోవాలనే కదా. కాబట్టి ఆయన మంత్రివర్గ సలహాను పాటించాలి. అలాగే గవర్నరు తన విచక్షణాధికారాన్ని ఏ యే సందర్భాలలో వినియోగించవచ్చో కూడా రాజ్యాంగంలో పేర్కొన్నాం. కాబట్టి విచక్షణాధికారాల వినియోగం కూడా ఆ సందర్భాలకే పరిమితమై ఉంటుంది. రాజ్యాంగాన్ని సమగ్రంగా అధ్యయనం చేసి అన్వయించుకోవాలి. రాజ్యాంగంలో నిర్దిష్టంగా పేర్కొంటే తప్ప (గవర్నర్‌కు) ఎలాంటి విచక్షణాధికారానికి తావు లేదు' అని విశదీకరించి మరీ చెప్పారు. 'గవర్నర్ ప్రత్యర్థి అధికార కేంద్రంగా వ్యవహరిస్తారని ఆందోళన చెందడానికి అర్థమే లేదు' అని మరింత స్పష్టంగా పేర్కొన్నారు.

డాక్టర్ అంబేద్కర్ దృష్టిలో రాజ్యాంగ పరిధిలో గవర్నర్‌కు ఎలాంటి ప్రత్యేక అధికారాలూ ఉండవు. అది అత్యయిక పరిస్థితి అయినా సరే గవర్నర్ మంత్రివర్గ సలహా మేరకు నడుచుకోవాలి. గవర్నర్లకు ఉండే పరిమిత పాత్ర పట్ల డాక్టర్ అంబేద్కర్‌కు గట్టి విశ్వాసం ఉన్నది. 'గవర్నర్‌కు ఉండే అధికారాలు చాలా పరిమితం, అతి స్వల్పం. గవర్నర్ పదవి అలంకార ప్రాయం. గవర్నర్ ఎంపిక కోసం ముందుకు వచ్చేవాళ్ళు బహు కొద్దిమంది మాత్రమే ఉంటారు' అని అంబేద్కర్ వ్యాఖ్యానించారు. గవర్నర్ల అధికారాలు, రాష్ట్ర పరిపాలనలో వారి ప్రాత్ర గురించి రాజ్యాంగ నిర్ణేతల అవగాహన అంత స్పష్టంగా ఉన్నది. దేశ వాస్తవిక పరిస్థితులను ప్రతిబింబించే విధంగా రాజ్యాంగాన్ని రూపొందించిన దూరదృష్టి వారిది. అయితే కొద్దిమంది స్వార్థపూరిత పక్షపాత ధోరణులుగల వ్యక్తులు రాజ్యాంగపరమైన అత్యున్నత స్థానాన్ని అధిరోహిస్తారని బహుశా వాళ్ళే ఊహించి కూడా వుండరు. డాక్టర్ అంబేద్కర్ ఆశావహ దృక్పథం దారి తప్పిందని రుజువు చెయ్యడానికి కృతనిశ్చయంతో వున్నట్లున్నారు ఇవాళ గద్దెనెక్కిన కొందరు గవర్నర్లు.

మన దేశ స్వర్ణోత్సవ సంబరాల సందర్భంగా నేటి రాష్ట్రపతి కె.ఆర్.నారాయణ్ మన రాజ్యాంగం విఫలమైందా లేక మనమే రాజ్యాంగాన్ని విఫలం చేశమా' అంటూ లేవనెత్తిన ప్రశ్నను గుర్తుకు తెచ్చుకోవడం సమయోచితం అని నేను భావిస్తున్నాను.

తప్పిదాలను సరిదిద్దాలి

ప్రస్తుతం గవర్నర్ల పాత్ర మీద జరుగుతున్న చర్చలో మనం గుర్తించాల్సిన అంశం ఏమిటంటే ఇప్పుడు కొద్దిమంది వ్యక్తులు రాజ్యాంగాన్ని విఫలం చేస్తున్నారు అని. గవర్నర్లు తమ నిర్ణయాన్ని 'సాధ్యమైనంత త్వరగా' వెలువరించాలి అని రాజ్యాంగంలో పొందుపరచిన పదాన్ని సరిగ్గా అపసవ్య దిశలో వినియోగిస్తున్నారు. నిర్ణయాలను సాధ్యమైనంత ఆలస్యం చేస్తున్నారు. అందుకే న్యాయస్థానాల జోక్యం అవసరమైంది. రాజ్యాంగ స్ఫూర్తిని సక్రమంగా అన్వయించి ఆ పదాలకు ఉన్న భావార్థాన్ని అర్థవంతంగా నిర్ణయించి చెప్పాల్సి ఉన్నది. అయితే దురదృష్టవశాత్తు న్యాయస్థానాలు కూడా డాక్టర్ అంబేద్కర్ పరిశీలనలను పరిగణలోనికి తీసుకున్నట్లు కనిపించడం లేదు. 'నూతన రాజ్యాంగం మూలంగా ఏమన్నా పొరబాట్లు జరిగితే అవి మానవీయ తప్పిదాలే' అని డాక్టర్ అంబేద్కర్ స్పష్టంగా ప్రకటించారు. ఈ తప్పిదాలను సరిదిద్దకపోతే న్యాయస్థానాలు రాజ్యాంగపరమైన విధులు సక్రమంగా నిర్వహించడంలో విఫలమైనట్లే.

(వ్యాసకర్త సి.పి.యం ప్రధాన కార్యదర్శి)
/ 'హిందూ' సౌజన్యంతో /

స్ఫూర్తి నింపిన ఉపాధ్యాయ సాంస్కృతికోత్సవాలు

వ్యాసం

కట్టా కోటేశ్వరరావు

నైతిక విలువలను కాపాడే బాధ్యత ఉపాధ్యాయులదే. ఉపాధ్యాయుడు ఉద్యోగి మాత్రమే కాదు, సమాజ నిర్మాత. మంచి ఉపాధ్యాయుడు ఒక సామాజిక వైద్యుడు.

- ఐ.ఐ.టి రామయ్య

> తెనాలి ఉపాధ్యాయుల 'మాయాబజార్' నాటిక ఈనాటి రాజకీయాలకు అద్దం పట్టేలా ఉంది. స్త్రీ శక్తి పథకం కింద ఉచిత బస్ సౌకర్యంపై హాస్య నాటికను పల్నాడు జిల్లా ఉపాధ్యాయులు ప్రదర్శించారు. ఉగ్రవాద సమస్య మీద తిరుపతి, సత్య సాయి జిల్లాల టీచర్లు కలిసి చేసిన నాటిక, పాకాలపాడు పాఠశాల టీచర్లు ప్రదర్శించిన ఇతర నాటికలు ప్రశంసలు అందుకున్నాయి. దేశభక్తి గీతాలలో, కవితల్లో ఉపాధ్యాయుల ప్రతిభ అందరినీ ఆకట్టుకుంది. 50 సంవత్సరాలు దాటిన ఉపాధ్యాయులు శాస్త్రీయ, జానపద నృత్యాలలో తామెవ్వరికీ తీసిపోమని, వయస్సు ఓ నెంబర్ మాత్రమే అని నిరూపించేలా ఉత్సాహంగా పాల్గొన్నారు.

రాష్ట్రంలో మొట్టమొదటిసారి నర్సరావుపేటలో 'పల్నాడు బాలోత్సవం' ఆధ్వర్యంలో జరిగిన ఉపాధ్యాయ సాంస్కృతిక ఉత్సవం గొప్ప అనుభవాల్ని ఇచ్చింది. గురువులు బాలల వేలు పట్టుకుని నడుపుతూ విద్య నేర్పడం సాధారణంగా జరిగే పని. గురువుల సృజనాత్మకత పెంచితే బాలలకు సమగ్ర విద్య అందించగలుగు తారని పల్నాడు బాలోత్సవం కమిటీ ఈ ఉత్సవాన్ని తలపెట్టింది. విద్యార్థుల్లో సామాజిక విలువలు నేర్పడంలో తల్లిదండ్రుల తర్వాత టీచర్లది ముఖ్యమైన పాత్ర. నేడు ఆటపాటలతో కూడిన విద్య కనుమరుగయ్యింది. పాలకవర్గం మార్కులు, ర్యాంకులతో పాటు ఇంగ్లీష్ వ్యామోహం పెంచి, ప్రభుత్వ విద్యను ప్రణాళిక ప్రకారం బలహీన పర్చుతోంది. కార్పొరేట్ విద్యాసంస్థల అధినేతలే గత, నేటి ప్రభుత్వాలలో మంత్రులుగా ఉండటమే దీనికి తార్కాణం. కార్పొరేట్ విద్యాసంస్థలు పాఠశాల రంగంలోకి ప్రవేశించాయి. ప్రైవేట్ రంగ చిన్న బడ్జెట్ స్కూళ్ళు కూడా వీరి పోటీకి తట్టుకోలేకపోతున్నాయి. పేదలకు ఉచిత విద్య అందించడం తగ్గిపోతున్నది. వీరికి ఉన్నత విద్య అందనంత దూరంలో ఉంది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగానికి కేటాయింపులు పెంచకుండా, మరొకవైపు మౌలిక అంశాలు పట్టించుకోకుండా ప్రభుత్వ విద్యను బలహీన పరుస్తున్నాయి. కరోనా కాలంలో మన రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సంఖ్య 46 లక్షలు ఉండగా నేడు 30 లక్షలకు తగ్గింది. 40 మంది విద్యార్థుల లోపు ఉన్న ప్రాథమిక పాఠశాలలు 26,608 ఉండటం శోచనీయం. ఈ నేపథ్యంలో గురువులకు సాంస్కృతిక ఉత్సవాలు జరపడం ద్వారా ప్రభుత్వ విద్యను కాపాడటం, బాలల్లో అభ్యుదయ, దేశభక్తి భావాలను పెంపొందించడం లక్ష్యంగా భావించాము. పేదలకు విద్య అందించడం కోసం, వారి హక్కులు సాధించడం కోసం ప్రభుత్వ, ప్రైవేటురంగ ఉపాధ్యాయుల ఐక్యత అవసరంగా ముందుకొచ్చింది.

గురువులు నాట్యం చేస్తే పిల్లలు దానిని అనుకరిస్తారు. పాటలు పాడితే వారు అందుకుంటారు. బాలల్లో బెరుకు పోతుంది. సామాజిక స్పృహ, ఐక్యత, చొరవ పెరుగుతాయి. పల్నాడు బాలోత్సవం మూడవ పిల్లల పండుగకు సిద్ధమైన నేపథ్యంలో మా కమిటీ ఈ ఆలోచన చేసింది. ప్రపంచీకరణ పుణ్యమా అని నాలుగు గోడల మధ్య కెరీరే లక్ష్యంగా పరిగెత్తే ఈ ప్రపంచంలో ఒత్తిడి ఎదుర్కొంటున్నది విద్యార్థి మాత్రమే కాదు. ఉపాధ్యాయుడు కూడా. దశాబ్దాల ఉద్యమాల ఫలితంగా ఉపాధ్యాయులు గౌరవనీయమైన స్థానంలో ఉన్నప్పటికీ.. వారి ముందు కూడా బోలెడు సమస్యలున్నాయి. ప్రభుత్వాలు ఏవైనా... ప్రభుత్వ బడి అనేక ప్రయోగాలకు కేంద్ర బిందువుగా మారిపోయింది. పాఠాలు చెప్పాల్సిన ఉపాధ్యాయులు యాప్ లతో సతమతమవుతున్నారు. భవిష్యత్తులో ప్రభుత్వ పాఠశాల మనుగడే ప్రశ్నార్థకంగా మారే పరిస్థితులు ఉపాధ్యాయ లోకాన్ని ఆందోళనలకు గురిచేస్తున్నాయి. ఇక ప్రైవేటు ఉపాధ్యాయుల సమస్యలు సరేసరి. విద్యార్థుల సృజనాత్మకతకు అద్దం పట్టేలా, వారి అంతర్గత శక్తులను, ఆసక్తులను వెలికితీసేలా నిర్వహించే బాలోత్సవాలను అర్థం చేసుకోవడంలో కూడా ఉపాధ్యాయ ఉత్సవాలు సహకరిస్తాయని భావించింది. ఉపాధ్యాయుల రాష్ట్ర స్థాయి ఉత్సవాలకు చిన్న పట్టణమైన నరసరావుపేటలో విశేష స్పందన వచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా 20 జిల్లాల నుండి వచ్చిన ఉపాధ్యాయులకు ఆతిథ్యం ఇవ్వడంలో అందరూ సహకరించారు. మహిళా ఉపాధ్యాయులకు నరసరావుపేటలో స్థానికంగా నివాసం ఉండే మహిళా ఉపాధ్యాయులే తమ ఇళ్లలో ఆతిథ్యం ఇవ్వడం విశేషం. రాష్ట్రంలో 20 జిల్లాల నుండి వచ్చిన 500 పైగా ఉపాధ్యాయులతో సాంస్కృతిక ఉత్సవాలు మరింత శోభను సంతరించుకున్నాయి. స్థానిక ఉపాధ్యాయులు, కళాకారులు, ప్రజలతో కలిపి 1000 మంది పాల్గొన్నారు. ప్రభుత్వ బడిని కాపాడుకుందాం అంటూ నెల్లూరు కోలాట దళం ప్రదర్శిస్తే, పాడుదమా స్వేచ్ఛా గీతం అంటూ గుంటూరు జిల్లా కోలాట దళం నినదించింది. మహిళా సాధికారత మీద, సామాజిక రుగ్మతల మీద, యువ చైతన్యం మీద పల్నాడు జిల్లా ఉపాధ్యాయుల కోలాటం అందరినీ ఆకట్టుకుంది.

తెనాలి ఉపాధ్యాయుల "మాయాబజార్" నాటిక ఈనాటి రాజకీయాలకు అద్దం పట్టేలా ఉంది. స్త్రీ శక్తి పథకం కింద ఉచిత బస్ సౌకర్యంపై హాస్య నాటికను పల్నాడు జిల్లా ఉపాధ్యాయులు ప్రదర్శించారు. ఉగ్రవాద సమస్య మీద తిరుపతి, సత్య సాయి జిల్లాల టీచర్లు కలిసి చేసిన నాటిక, పాకాలపాడు పాఠశాల టీచర్లు ప్రదర్శించిన ఇతర నాటికలు ప్రశంసలు అందుకున్నాయి. దేశభక్తి గీతాలలో, కవితల్లో ఉపాధ్యాయుల ప్రతిభ అందరినీ ఆకట్టుకుంది. 50 సంవత్సరాలు దాటిన ఉపాధ్యాయులు శాస్త్రీయ, జానపద నృత్యాలలో తామెవ్వరికీ తీసిపోమని, వయస్సు ఓ నెంబర్ మాత్రమే అని నిరూపించేలా ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఉపన్యాసాలు, కవితలు...ఇలా 15 అంశాలలో ఈ సాంస్కృతిక ఉత్సవాలను నిర్వహించాం. ఉపాధ్యాయ ఉత్సవాలలో మహిళా ఉపాధ్యాయులే ఎక్కువ మంది పాల్గొనడం గమనార్హం.

ఉపాధ్యాయ ఉత్సవాలకు, మూడవ బాలోత్సవానికి, రెండు కార్యక్రమాల నిర్వహణకు కలిపి పలువురు విరాళాలు అందించారు. నరసరావుపేటలో ప్రముఖులతో పాటు ఉపాధ్యాయులు కూడ నిధుల సేకరణకు సహకరించడం విశేషం. సుమారు 130 మంది ఉపాధ్యాయులు రూ.4 లక్షలు విరాళం అందించడం ప్రత్యేక అంశం.

దశాబ్దాల చరిత్ర కలిగిన శ్రీ సుబ్బరాయ నారాయణ (ఎస్.ఎస్.ఎన్) కాలేజీ ఈ ఉత్సవాలకు వేదిక కావడం మరింత శోభనిచ్చింది. కళ కళ కోసం కాదు, ప్రజల కోసం కూడ.. అన్న అభ్యుదయకర ఆలోచనా విధానానికి ఉపాధ్యాయ ఉత్సవం దర్పణం పట్టింది. జిల్లా సమగ్రాభివృద్ధి కోసం నరసరావుపేట కేంద్రంగా పని చేస్తున్న పల్నాడు విజ్ఞాన కేంద్రం పూర్తిగా సహకరించింది. విద్యార్థుల, ఉపాధ్యాయుల సర్వతోముఖాభివృద్ధికి చేస్తున్న కృషికి ఈ ఉత్సవం స్ఫూర్తినిచ్చింది.

/ వ్యాసకర్త పల్నాడు బాలోత్సవం కమిటీ ప్రధాన కార్యదర్శి,
సెల్: 7207450369 /

జనవాక్యం

సంచార్ సాథీ తోడుగానా? నీడగానా?

కేంద్ర ప్రభుత్వం సంచార్ సాథీ యాప్‌ని అన్ని ఫోన్లలో తప్పనిసరిగా ఇన్‌స్టాల్ అయి ఉండేలా తయారీదారులకు ఆదేశాలు జారీ చేసింది. ఆ యాప్‌తో ఫోన్ ద్వారా జరిగే సైబర్ మోసాల పట్ల అవగాహన కల్పించడంతో బాటు, సకాలంలో అడ్డుకొనే అవకాశం ఉంటుందని చెప్తోంది. కొన్న ఫోన్ అసలా, నకిలీయా తెలుసుకోవడం, పోతే బ్లాక్ చెయ్యడం సులువని, అందుకొనే ఫోన్‌కాల్స్ మోసపూరితం అని గుర్తించి హెచ్చరించే వీలుంటుందని చెప్తోంది. ఈ ప్రకటన వినగానే ప్రతిపక్షాలు, కొన్ని సాంకేతిక పరిజ్ఞానం ఉన్న సంస్థలు ఆందోళన వెలిబుచ్చాయి. ఇలా ఒక యాప్‌ని ఫోన్‌లో తప్పనిసరి చెయ్యడంలో ప్రభుత్వానికి వేరే ఉద్దేశాలు ఉన్నాయని అంటున్నాయి. పౌరులపై వారికి తెలియకుండానే నిరంతర నిఘా కోసం ఉపయోగించే అవకాశం ఉన్నట్లు చెప్తున్నాయి. ఇది ప్రజల గోప్యతా హక్కుకి భంగకరమని, వారి వివరాలన్నీ ప్రభుత్వానికి, ఇతరులకు అందుబాటులో ఉండి దుర్వినియోగానికి దారితీస్తాయని వారి వాదన. గతంలో ప్రభుత్వం, కొన్ని రాష్ట్రాలు పెగాసస్ యాప్ ద్వారా చట్టానికి వ్యతిరేకంగా కొంతమంది వ్యక్తుల సమాచారాన్ని రహస్యంగా సేకరించిన రీతిలో ఈ యాప్ ద్వారా జరగొచ్చని చెప్తున్నాయి. అయితే ప్రభుత్వం ఈ యాప్ లక్ష్యం కేవలం సైబర్ క్రైమ్ దాడుల్ని తగ్గించడం, ప్రజలకు అవగాహన పెంచడం మాత్రమే అంటుంది. అక్కర్లేదనుకుంటే ఉన్న యాప్‌ని తొలగించవచ్చని చెప్తోంది. ఏదైనా ఈ సమాచార యుగంలో సాంకేతికత రెండు వైపులా పదునున్న కత్తి. అది సక్రమంగా పని చేయాలంటే ముందు దానిపై అపోహల్ని తొలగించి, అవగాహన పెంచి ప్రజల్ని సమాయత్త పర్చాలి. బలవంతంగా రుద్దినట్లు కనబడితే అనుమానాలు పెరుగుతాయి. వాడకం తగ్గి, ఉపయోగం కూడా తగ్గిపోతుంది. సైబర్ క్రైమ్ తగ్గించడానికి ప్రభుత్వం మిగతా దారుల్ని పూర్తిగా వినియోగిస్తూ, ఈ యాప్‌పై ముందు అవగాహన కల్పించాలి. డిజిటల్ అరెస్ట్ పేరుతో మోసాలు బాగా పెరిగిపోవడం వల్ల సుప్రీం కోర్టు వాటిపై దర్యాప్తుకై సిబిఐ కి నేరుగా ఆదేశాలివ్వాల్సి వచ్చింది. వాటిని అరికట్టడంలో ప్రభుత్వం చేయాల్సింది ఇంకా చాలా ఉంది. సంచార్ సాథీ మీకు రక్షణ, తోడు అని ప్రభుత్వం అంటుంటే, కాదు మిమ్మల్ని వెంటాడే నీడ అని ప్రతిపక్షాలు చెప్తున్నాయి. ప్రజలకు మాత్రం అయోమయంగా ఉంది. పూర్తి సమాచారం అవసరం.

- డా.డి.వి.జి. శంకరరావు, మాజీ ఎంపీ, విజయనగరం.

అమరావతిపై వైసిపి దాడి

- మాజీ మంత్రి దేవినేని ఉమ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాజధాని అమరావతిపై వైసిపి, దాని అనుబంధ మీడియా రాస్తున్న కథనాలు యువత భవిత, రాష్ట్ర ప్రగతిపై దాడి చేయడమేనని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు విమర్శించారు. టిడిపి కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మాజీ సిఎం జగన్ అమరావతిపై మాట్లాడే ముందు 3 వేలమంది రైతులు 1,631 రోజులు చేసిన ఉద్యమాన్ని గుర్తుపెట్టుకోవాలని చెప్పారు. అధికారంలో ఉన్నప్పుడు అమరావతిపై కక్ష సాధించారని, ఇప్పటికీ అక్కడ అభివృద్ధి జరగకుండా అడ్డుపడుతున్నారని విమర్శించారు. 16 వేలమంది కార్మికులు రాత్రీపగలు తేడా లేకుండా శ్రమిస్తున్నారని చెప్పారు. మార్చి నాటికి ఎమ్మెల్యేలు, ఐఎఎస్, ఐజి, ఆఫీసర్లు, అధికారుల భవన నిర్మాణాలు పూర్తి చేస్తామన్నారు. ఒక్కో వైద్య కళాశాలలో రూ.50 కోట్ల కుంభకోణాలకు వైసిపి నాయకులు పాల్పడ్డారని ఆరోపించారు. పిపిపి విధానంలో పేదలకు కార్పొరేట్ వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య మరో సమావేశంలో అన్నారు. పిపిపి విధానం వల్ల కేంద్ర కోటా ద్వారా అదనంగా 220 మెడికల్ సీట్లు పెరుగుతాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే మహిళా సంక్షేమం, సాధికారతలో రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని టిడిపి డ్వాక్రా సాధికార కమిటీ అధ్యక్షులు ఆచంట సునీత మరో సమావేశంలో తెలిపారు. అలాగే టిడిపి కార్యాలయంలో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, మాజీ మంత్రి దేవినేని ఉమా, గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, వికలాంగుల కార్పొరేషన్ ఛైర్మన్ నారాయణ స్వామి, మీడియా కో-ఆర్డినేటర్ దారపనేని నరేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
రహదారులు మరియు భవనముల శాఖ
ఇ-ప్రొక్యూర్మెంట్ టెండరు ప్రకటన

నెం: 19(2)/టి.ఓ/2025-26, తేది: 27.11.2025

2025-26 సంవత్సరమునకు రహదారులు మరమ్మత్తుల నిమిత్తం మొత్తము 2 పనులకు గాను **అంచనా విలువ: రూ. 80.00** లక్షలకు టెండర్లు ఆహ్వానించడమైనది. టెండరు షెడ్యూల్ డౌన్‌లోడ్ చేసుకొనుటకు తేది:06.12.2025, సా.3 గం.ల నుండి. ఇతర వివరాలను ఇ-మార్కెట్ ప్లేస్ www.eprocurement.gov.in లో పొందవచ్చును. ఫోన్.08672-252500.

సం/- కార్యనిర్వాహక ఇంజనీరు,
(ర.భ) డివిజన్, మచిలీపట్నం

DIPRNo: 18249/CL/ADVT/1/1/2021-22

BEFORE THE DEBTS RECOVERY TRIBUNAL AT VISAKHAPATNAM
O.A.NO. 1130 OF 2025

Between:
M/s Axis Bank Limited, Rep, by its Authorized Officer **Mr.Chokkakula Varun Prajna Vardha,** Office at No - 43-9-141,4th Floor, Sri Gayatri Towers, Srikanya Main Road,
Dondaparthy, Vishakaptnam - 530016 ..... **Applicant Bank**

And

1. M/S. Sri Durga Gayathri Cotton Traders, Rep by its Proprietor Inaganti **Mohammad Kasim,** D.No.1-80/C, Opposite Water Tank Road,Chamallamudi, Guntur District - 522017
2. Mr. Inaganti Mohammad Kasim,S/o Inagariti Nabi Saheb, D.No.1-80/C, Opposite Water Tank Road,Chamallamudi, Guntur District - 522017..... **Defendants**

SUBSTITUTED SERVICE OF SUMMONS TO THE DEFENDANT NO. D1 to D.2 BY WAY OF PAPER PUBLICATION

D. 1. M/S. Sri Durga Gayathri Cotton Traders, Rep by its Proprietor Inaganti Mohammad KasimD.No.1-80/C, Opposite Water Tank Road,Chamallamudi, Guntur District - 522017.
D. 2. Mr. Inaganti Mohammad Kasim,S/o Inaganti Nabi Saheb, D.No.1-80/C, Opposite Water Tank Road,Chamallamudi, Guntur District -522017.
WHEREAS the Applicant Bank has instituted an application U/S 19 of the Recovery of Debts Due to Banks and Financial Institutions Act 1993 against you for the recovery of sum mentioned therein together with current and future interest and other reliefs. You are hereby summoned to appear and file written statement before this Tribunal **at 10.30** or at such time immediately thereafter according to the convenience of Tribunal **on 07/01/2026**. you are directed to collect the copy of the application and annexure on your appearance before the Tribunal.
2. If you intend to file any documents, you may file the same with a list along with the written statement.
3. You should file your registered address and a memo of appearance when you enter appearance before the Tribunal either in person or by a Pleader /Advocate duly instructed.
4. Take notice that, in default of your appearance on the day mentioned herein before, the proceeding will be heard and determined in your absence.
Given under my hand and the seal of this Tribunal **on this the 1st Day of Dec, 2025**

Sd/- Signatu re of the Officer
Authorised to issue summons

BEFORE THE DEBTS RECOVERY TRIBUNAL AT VISAKHAPATNAM
O.A.NO. 1134 OF 2025

Between:
M/s Axis Bank Limited Rep, by its Authorized Officer Mr.Chokkakula Varun Prajna Vardha Office at No - 43-9-141,4tl1 Floor, Sri Gayatri Towers,Srikanya Main Road, Dondaparthy,Vishakaptnam - 530016
..... **Applicant Bank**

And

1.M/s. Greentech UPVC Industries Rep. by its Managing Partner: Vemuri Bindu,D. No. 99 / 18, D-Block, Auto Nagar, Near Nagarjuna RMC, Gajuwaka, Visakhapatnam District, Andhra Pradesh - 530012.
2. Mrs. Vemuri Bindu, W/o. Vemuri Aravind, Flat No. 301, SS Nilayam, Pedagantyada, Gajuwaka,Visakhapatnam District, Andhra Pradesh - 530044.
Alsoat: Mrs. Vemuri Bindu,W /o. Vemuri Aravind, D.No. 24-102, Sivalayam Street, Mandapam Centre, Yanamalakuduru,Vijayawada, Krishna District, Andhra Pradesh - 520007.
3. Mr. Vemuri Aravind,S/o. Vemuri Mallikarjuna Rao, D.No. 24-102, Flat No. 301, SS Nilayam, Pedagantyada, Gajuwaka, Visakhapatnam District, Andhra Pradesh - 530044.
Also at: Mr. Vemuri Aravind S/o. Vemuri Mallikarjuna Rao, D.No. 23-103, Sivalayam
Street, Mandapam Centre, Yanamalakuduru,Vijayawada, Krishna District, Andhra Pradesh - 520007.
4. Mr. Eragam Reddy Siva Reddy S/o. Eragam Reddy Veera Reddy, P.No. 243, Sy. No. 38, 3, Panha Sarathi Nagar, Shamirpal Mandal,Thumakunta, K.V. Ranga Reddy District, Telangana-500078. ..... **Defendants**

SUBSTITUTED SERVICE OF SUMMONS TO THE DEFENDANT NO. D1 to D4 BY WAY OF PAPER PUBLICATION

D.1. M/s. Green tech UPVC Industries Rep. by its Managing Partner: Vemuri Bmdu, D.No. 99/ 18, D-Block, Auto Nagar, Near Nagarjuna RMC, Gajuwaka, Visakhapatnam District, Andhra Pradesh - 530012.
D.2. Mrs. Vemuri Bindu, W/o. Vemuri Aravind, Flat No. 301, SS Nilayam, Pedagantyada, Gajuwaka,Visakhapatnam District, Andhra Pradesh - 530044.
Also at: Mrs. Vemuri Bindu, W/o. Vemuri Aravind, D.No. 24-102, Sivalayam Street, Mandapam Centre, Yanamalakuduru,Vijayawada, Krishna District, Andhra Pradesh -520007.
D.3. Mr. Vemuri Aravind, S/o. Vemuri Mallikarjuna Rao, D.No. 24-102, Flat No. 301, SS Nilayam, Pedagantyada, Gajuwaka, Visakhapatnam District, Andhra Pradesh-530044.
Also at: Mr. Vemuri Aravind S/o. Vemuri Mallikarjuna Rao, D.No. 23-103, Sivalayam
Street, Mandapam Centre, Yanamalakuduru,Vijayawada, Krishna District, Andhra Pradesh-520007.
D.4. Mr. Eragam Reddy Siva Reddy S/o. Eragam Reddy Veera Reddy, P.No. 243, Sy.No. 38, 3, Panha Sarathi Nagar, Shamirpal Mandal,Thumakunta, K.V. Ranga Reddy District, Telangana-500078.
WHEREAS the Applicant Bank has instituted an application U/S 19 of the Recovery of Debts Due to Banks and Financial Institutions Act 1993 against you for the recovery of sum mentioned therein together with current and future interest and other reliefs. You are hereby summoned to appear and file written statement before this Tribunal **at 10.30** or at such time immediately thereafter according to the convenience of Tribunal **on 07/01/2026**. you are directed to collect the copy of the application and annexure on your appearance before the Tribunal.
2. If you intend to file any documents, you may file the same with a list along with the written statement.
3. You should file your registered address and a memo of appearance when you enter appearance before the Tribunal either in person or by a Pleader /Advocate duly instructed.
4. Take notice that, in default of your appearance on the day mentioned herein before, the proceeding will be heard and determined in your absence.
Given under my hand and the seal of this Tribunal **on this the 1st Day of Dec, 2025**

Sd/- Signatu re of the Officer
Authorised to issue summons

రాయితీలు ఒకరికి.. భూములు మరొకరికి

- రైడెన్ పేరున 480 ఎకరాలు కేటాయింపు
- అందులో భాగస్వాములు అదాని సంస్థలే

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

విశాఖలో భారీగా ఐటి పరిశ్రమలను ప్రోత్సహిస్తామని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం అందుకు కావాల్సిన భూములను మాత్రం వేరే సంస్థలకు ఇవ్వడం ఆశ్చర్యం కలిగిస్తోంది. డేటా సెంటర్ అభివృద్ధి కోసం ఒక సంస్థకు రాయితీలు ప్రకటించిన ప్రభుత్వం.. భూములను మాత్రం అదాని సంస్థలకు కేటాయించడం గమనార్హం. ఇది అదాని సంస్థపై దశాబ్దాలుగా చూపిస్తున్న అవ్యాజమైన ప్రేమకు కొనసాగింపుగా కనిపిస్తోంది.

విశాఖలో ఏఐ డేటా సెంటర్‌ను భారీ పెట్టుబడితో ఏర్పాటుచేసేందుకు నిర్ణయించారు. ఈ ప్రాజెక్టును రైడెన్ ఇన్ఫోటెక్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్‌కు ఖరారు చేశారు. 15 బిలియన్ డాలర్ల వ్యయంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు రైడెన్ నిర్ణయించింది. అయితే ఈ సంస్థకు భూమి కేటాయించాల్సిన నేపథ్యంలో ఇచ్చిన ఉత్తర్వులు మాత్రం అదానికి ఇచ్చినట్లుగా ఉండడం, అదానికి చెందిన మూడు సంస్థలు రైడెన్‌లో భాగస్వాములుగా ఉన్నట్లు చూపించారు. ఈ సంస్థలకే ఎకరాల విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో 480 ఎకరాలను కేటాయించారు. విశాఖ జిల్లాలోని అడవివరంలో 120 ఎకరాలు, అదే జిల్లాలోని ఆనందపురం మండలంలోని తర్లువాడలో 200 ఎకరాలు, అనకాపల్లి జిల్లాలోని రాంబిల్లిలో 160 ఎకరాలను రైడెన్ సంస్థకు కేటాయించారు. అయితే రైడెన్ పేరున ఉన్న సంస్థలో ఆరు ఇతర సంస్థలు భాగస్వాములుగా ఉన్నట్లు చూపించారు. అందులో మూడు సంస్థలు అదానికి చెందినవే. అదాని ఇన్‌ఫ్రా ప్రైవేటు లిమిటెడ్, అదాని కానెక్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్, అదాని పవర్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ సంస్థలు కీలక భాగస్వాములుగా ఉన్నట్లు చూపించారు. భారతీ ఎయిర్‌టెల్, భారతీకి అనుబంధ సంస్థగా ఉన్న ఎన్‌క్స్ట్రా డేటా లిమిటెడ్, ఎన్‌క్స్ట్రా వైజాగ్ లిమిటెడ్‌లు ఇతర భాగస్వామ్య సంస్థలుగా ఉన్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వీటిల్లో ప్రధాన భాగస్వామిగా చెబుతున్న అదాని కనెక్స్‌కే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నట్లు స్పష్టమవుతోంది. రాంబిల్లిలో భూమిని ఎన్‌క్స్ట్రా సంస్థకు కేటాయించగా, దానిని రైడెన్ కోసం డేటా సెంటర్ ఏర్పాటు చేయనున్నారు. అలాగే తర్లువాడ, అడవివరంలో భూములను అదాని కానెక్స్ లేదా దానికి అనుబంధ సంస్థలకు ఇచ్చేలా నిర్ణయించడం గమనార్హం.

రైడెన్‌తో గూగుల్ డేటా

రూ.లక్ష కోట్లు పెట్టుబడిగా చెబుతున్న గూగుల్ డేటా సెంటర్‌ను రైడెన్ సంస్థే నిర్మించనుందన్నట్లు కనిపిస్తోంది. రైడెన్, దాని అనుబంధ సంస్థలే గూగుల్, గూగుల్ క్లౌడ్ నిర్మాణం చేస్తారని ఐటి శాఖ జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. అయితే ప్రధానంగా రైడెన్‌తో ఒప్పందం చేసుకున్న ప్రభుత్వం భూములను మాత్రం అదానికి చెందిన సంస్థలకు ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. అదానితో ప్రభుత్వానికి అంతర్గతంగా అనుబంధం ఉండటం, అందులో రాష్ట్రంలో ఉన్న విద్యుదుత్పత్తి సంస్థల్లో అదానికి ఎక్కువ వాటా ఉండడం తెలిసిందే. ఇప్పుడు డేటా సెంటర్లలోనూ అదాని సంస్థ ప్రాధాన్యత ఇవ్వడం గమనిస్తే.. ప్రభుత్వ పెద్దల సహకారం వల్లనే ఇది సాధ్యమవుతోందన్న విమర్శలు కూడా ఉన్నాయి.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎవి నాగేశ్వరరావు, నాయకులు

7న పునర్జీవన సైకిల్ యాత్రను జయప్రదం చేయాలి

- ఇ(మీ) సేవ ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి
- పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎవి నాగేశ్వరరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైసిపి ప్రభుత్వ హయాంలో తొలగించిన ఇ(మీ) సేవ ఉద్యోగులను తాము అధికారంలోకి రాగానే విధుల్లోకి తీసుకుంటామని యువగళం పాదయాత్రలో ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని ఎపి ఇ(మీ) సేవ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. విజయవాడ బాలోత్సవ భవన్‌లో బుధవారం అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యాన సైకిల్ యాత్ర, దీక్షల పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సిహెచ్ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఈ నెల 7న తిరుపతి నుంచి అమరావతి వరకు చేపట్టనున్న పునర్జీవన సైకిల్ యాత్ర, 16, 17, 18, 19 తేదీల్లో విజయవాడలో చేపట్టనున్న నిరాహార దీక్షలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. 2003 నుంచి 18 ఏళ్లుగా 170 ప్రభుత్వ అర్బన్ ఇ(మీ) సేవ కేంద్రాల్లో విధులు నిర్వహించిన 605 మంది ఉద్యోగులు వైసిపి పాలనలో ఉద్యోగాలు కోల్పోయారన్నారు. ప్రతిరోజూ దాదాపు 467 సర్వీసులు అందించడంతోపాటు ప్రభుత్వ శాఖలకు ఏడాదికి రూ.4 వేలకోట్లు ఆదాయాన్ని, యూజర్ ఛార్జీస్ రూపంలో మరో రూ.30 కోట్లు ఆదాయాన్ని సమకూర్చారన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఎం బాబూరావు, రాష్ట్ర, జిల్లా నాయకులు పి గౌరీశ్వరరావు, ఎం రమేష్, ఎం రాజ్‌కుమార్, ఎం పవన్‌కుమార్ పాల్గొన్నారు.

మోహిత్ శర్మ గుడ్‌బై

- అన్ని ఫార్మాట్‌ల క్రికెట్ నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటన

ఛండీగఢ్: టీమిండియా పేసర్ మోహిత్ శర్మ క్రికెట్ అన్ని ఫార్మాట్‌ల నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించాడు. '14ఏళ్ల సుదీర్ఘ క్రికెట్ ప్రయాణం ఇక ముగిసింది' హర్యానా తరఫున ప్రాతినిధ్యం వహించినందుకు గర్వపడుతున్నా.. నేను భారత జెర్సీని ధరించడం, ఐపిఎల్‌లో ఆడడం కెరీర్‌లో మరచిపోలేనివి' అంటూ బుధవారం ఇన్‌స్టాగ్రామ్‌లో వెల్లడించాడు. తనకు వెన్నెముకగా నిలిచిన హర్యానా క్రికెట్ అసోసియేషన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపాడు. అలాగే అనిరుద్ సార్ మార్గదర్శకత్వంతో, అతనికి నాపై నమ్మకం నిరంతరం మరచిపోలేను. తనకు మద్దతుగా నిలిచిన కోచ్‌లు, ఐపిఎల్ ఫ్రాంచైజీలు, సహాయ సిబ్బంది, స్నేహితులు అందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు' అని పేర్కొన్నాడు.

2013లో అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన మోహిత్ శర్మ.. టీమిండియా తరఫున 14 వన్డేలు, 8టి20లు ఆడాడు. ఈ రెండు ఫార్మాట్‌లలో కలిపి మొత్తం 37వికెట్లు పడగొట్టాడు. 2015 ఐసిసి వన్డే ప్రపంచకప్‌లో భారత జట్టు సెమీస్‌కు చేరడంలో మోహిత్ శర్మ కీలకపాత్ర పోషించాడు.

టి20 ప్రపంచకప్

- టీమిండియా జెర్సీ ఆవిష్కరణ

3.	అజనాద్రి ఇంపెక్స్ పాట్నర్స్ టాటా సిరీషా ద్వారా ప్రాతినిధ్యం, టాటా మల్లేశరి డోర్.నం 27/61, 1 వ అంతస్తు, షాప్ నం.5, నాగార్జున కాంప్లెక్స్, పల్నాడు రోడ్డు హైదరాబార్-500074/ 024305012192	ఆస్తి 1 ఫ్లాట్ నం.102 1వ అంతస్తు ప్లింత్ ఏరియా 981 చ.అ.లు కలిగి కామన్ ఏరియాతో సహా మరియు సెల్లార్/స్టిల్ట్‌లో ఒక కార్ పార్కింగ్ మైదమ్స్ బ్లాక్, 'టిఎన్ఆర్'ఎస్ శకుంతల" అనబడే కాంప్లెక్స్‌తో సహా, 3-1-30 (పాత నం. 1-4) నంబర్ ఉన్న ప్రాంగణంలోని 13132 చతురస్రాల్లో 42 చతురస్రాల విస్తీర్ణంలో విభజించబడని భూమి వాటాతో తెలంగాణ రాష్ట్రంలోని రంగారెడ్డి జిల్లా, జిహెచ్ఎంసిఎల్‌బి నగర్ సర్కిల్ పరిధిలోని సరుమాగర్ మండలం, బహదూర్‌గూడ గ్రామంలో ఉన్న సై నెం. 34/2 మరియు 35 లో ఈ క్రింది విధంగా సరిహద్దులు ఉన్నాయి: భూమి సరిహద్దులు ఉత్తరం : ఎల్బీ నగర్ నుండి సరుమాగర్ రోడ్డు వరకు దక్షిణం: పొరుగువారి ఆస్తి తూర్పు : ఆస్తి విజయ లక్ష్మికి చెందినది. పడమర: కాంపౌండ్ వాల్ మరియు పొరుగువారి ఆస్తి మరియు నా గుప్తా మూడవ పక్షాలకు అమ్మిన ప్లాట్లు. ఫ్లాట్ సరిహద్దులు ఉత్తరం: ఓపెన్ టు స్కై దక్షిణం: ఓపెన్ టు స్కై మరియు లిఫ్ట్, తూర్పు: ఓపెన్ టు స్కై పడమర: కారిడార్లు. ఆస్తి 2 : 375 చతురస్రాలలోని ప్లాట్ నెం 98 సర్వే నంలు: 559, 563, 564, 565 & 566 తెలంగాణ రాష్ట్రంలోని రంగారెడ్డి జిల్లా ఘట్కేసర్ గ్రామం మరియు మండలం ఈ క్రింది విధంగా సరిహద్దులుగా ఉన్నాయి: ఉత్తరం: 40-0" వెడల్పు రోడ్డు దక్షిణం: ప్లాట్ నెం 99 తూర్పు ప్లాట్ నెం 104 పడమర: ప్లాట్ నెం 92 ఆస్తి 3 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు జిల్లా సత్తెనపల్లెలో 63.17 చదరపు అడుగుల ఉమ్మడి మార్గం, అచ్చంపేట రోడ్‌లోని వార్డ్ 3, డోర్ నం.2-2-38, డి నెం. 119-బి, 168 చదరపు అడుగుల విస్తీర్ణంలో 1.38 గిగాహెట్లతో కూడిన షాప్ నం 3 మరియు 4 యొక్క కొలతలు 512 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న అన్ని దుకాణాలు. భూమి యొక్క సరిహద్దులు: ఉత్తరం: హైవే రోడ్ లంక ఐటెమ్ నంబర్ 2 దక్షిణం: షేక్ అబ్దుల్ మజీద్ రైస్ మిల్లు తూర్పు: పోతుగంటి సాంబ శివరావు కాంపౌండ్ వాల్ పడమర: దేవరశెట్టి వెంకట సుబ్బారావు ఉమ్మడి గోడ మరియు ఈ వస్తువు మార్గం యొక్క సరిహద్దులు ఉత్తరం: దేవరశెట్టి వెంకట సుబ్బారావు మరియు ఇతరుల ఆస్తి దక్షిణం: దేవరశెట్టి వెంకట సుబ్బారావు మరియు ఇతరుల ఐటెమ్ నంబర్ 1 లోని ఆస్తి తూర్పు: కాంపౌండ్ వాల్ మరియు సర్కార్ పోరంబోక్ భూమి పడమర: హైవే రోడ్ లంక. ఆస్తి 4 మొదటి అంతస్తులోని ఆ ఫ్లాట్ నెం 202 అంతా 910 చదరపు అడుగుల ప్లింత్ ఏరియాను కలిగి ఉంది, ఇందులో కామన్ ఏరియా మరియు స్టిల్ట్ ఫ్లోర్‌లో ఒక కార్ పార్కింగ్ మినహాయించి, "వైష్ణవి టవర్స్"లో 1456 చదరపు అడుగుల విస్తీర్ణంలో 29.02 చదరపు అడుగుల విస్తీర్ణంలో విభజించబడని భూమి వాటా ఉంది. ఎకరాలు 2.16 సెంట్లు డోర్ నం 516/సి మరియు 518/సి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు జిల్లా, నర్సరావుపేట, రావిపాడు రోడ్డు కింద సరిహద్దులుగా ఉంది. భూమి సరిహద్దులు ఉత్తరం: పలనాడు రోడ్డు దక్షిణం: బాలయ్యనగర్‌లోని ప్లాట్లు తూర్పు: గంగూరి భిక్షమయ్య భూమి పడమర: గాదె సుధారామిరెడ్డి భూమి ఫ్లాట్ సరిహద్దులు ఉత్తరం: ఫ్లాట్ నంబర్ 202 మరియు 203 మరియు సాధారణ మెట్ల మధ్య ఖాళీ స్థలం దక్షిణం: ఫ్లాట్ నం 202 మరియు 203 మరియు లిఫ్ట్ మధ్య ఖాళీ స్థలం తూర్పు : ఫ్లాట్ నెం 207 మరియు 202 మధ్య కామన్ కారిడార్ పడమర: వైష్ణవి టవర్స్ యొక్క బహిరంగ సరిహద్దు	October 16, 2025 Rs. 3,63,56,556.05/-	03/08/ 2025
4.	శ్రీ సాయిబాబా డిస్ట్రిబ్యూటర్స్, పాట్నర్లు సలీమ్ షేక్, ఇమామ్‌బీ షేక్ ద్వారా ప్రాతినిధ్యం, వడ్డేపల్లి వెంకటేశ్వర్లు, డో.నం.11-71, మెయిన్ రోడ్డు, పెదకురపాడు మంగళగిరి గుంటూరు- 522503/ 362605000550.	గుంటూరు జిల్లా, మంగళగిరి ఉపజిల్లా, ప్రస్తుతం మండలం ఉపజిల్లా, సైట్ పరిధి పరిధి 56.6 చ.గ.లు. మరియు ఆర్‌సిసి డాబా ఇంటి బేరింగ్ డో.నం.4-87. అంశం నం.1 మరియు ఇంకొక సైట్ 2 చ.గ.లు. అంశం నం.2 సైట్ మొత్తం పరిధి 58.6 చ.గ.లు. మందాదం (గ్రా) మరియు (పి) యొక్క డో.నం.344/3 లో ఉన్న హద్దులు : అంశం నం.1 (సైట్ 56.6 చ.గ.లు. మరియు అందులో ఆర్‌సిసి డాబా ఇల్లు) తూర్పు : ఉమ్మడి మార్గం 39 లిం.లు., దక్షిణం: బి షెడ్యూల్ ఆస్తి మరియు జి.మధుసూధనరావు సైట్ 39 లిం.లు., పడమర : అల్లూరి వెంకయ్య సైట్ 30 లిం.లు., ఉత్తరం: డి-షెడ్యూల్ ఆస్తి 39 లిం.లు. ఈ సరిహద్దుల సైట్ పరిధి 56.6 చ.గ.లు. మరియు ఆర్‌సిసి డాబా ఇంటితో అన్నీ ఉపకరణాలు. అంశం నం.2 (సైట్ 2 చ.గ.లు.) తూర్పు : సి-షెడ్యూల్ ఆస్తి 4 1/2 లిం.లు., దక్షిణం : ఆర్ అండ్ బి రోడ్డు 6 1/2 లిం.లు., పడమర : బి-షెడ్యూల్ ఆస్తి అంశం నం.2 6 1/2 లిం.లు., ఉత్తరం : ఎ-షెడ్యూల్ ఆస్తి అంశం నం.1 6 1/2 లిం.లు. ఈ సరిహద్దుల సైట్ పరిధి 2 చ.గ.లు.	October 30, 2025 Rs. 15,08,818.75/-	31/08/ 2025
5.	శ్రీ వీర రాఘవ సుప్రీమ్ ఇండస్ట్రీస్, ప్రొప్రైటర్. యాట వీరప్రసాద్ ద్వారా ప్రాతినిధ్యం, నం.15/17/18 షెడ్ నం.9 ఫేజ్-3, ఆటోనగర్ గుంటూరు-522001/ 664905601476.	ఎ-షెడ్యూల్ : ప్రకాశం జిల్లా, కనిగిరి ఉపజిల్లా, పామగ్రు మండలం, పామగ్రు పంచాయతీ ఏరియా, పామగ్రు గ్రామం, ఎస్.నం.373/2 కవర్ చేయబడిన పరిధి ఎ.లు. 7.16 సెంట్లు. మరియు కవర్ చేయబడిన పరిధి ఎ.లు. 2.66 సెంట్లు. మరియు దీని బయట కవర్ చేయబడిన పరిధి ఎ.లు. 0.65 సెంట్లు., పశ్చిమం నుండి అంకాళమ్మ వీధి, డో.నం.2/138-బి వద్ద, డి.వి.మనోహర్ టౌన్ షిప్ ప్రకారం ప్లాట్ నం.17 కవర్ చేయబడిన సైట్ మొత్తం పరిధి 144.44 చ.గ.లు. తో పాటు గ్రౌండ్, ఒకటవ మరియు రెండవ అంతస్తుల రెసిడెన్షియల్ భవనం ఉన్న హద్దులు : తూర్పు : 20.00 అ.లు. రోడ్డు, దక్షిణం: 28.00 అ.లు. రోడ్డు, పడమర : సబ్జెక్టట సర్వే నంబరులో పెసల మధుసూధనరావుకు చెందిన స్థలం, ఉత్తరం: ప్లాట్ నం.18. ఈ సరిహద్దుల సైట్ పరిధి 144.44 చ.గ.లు. లేదా 120.79 ఈ షెడ్యూల్-బి అంశం-1 లో అవిభక్త మరియు పేర్కొనబడని వాటా కొలత 29.976 చ.గ.లు. లేదా 25.06 చ.మీ.లు. పై ఎ షెడ్యూల్ ఆస్తి యొక్క బయట మొత్తం పరిధి తో పాటు ఎ షెడ్యూల్ ఆస్తిలో సైట్ పై వాటా కొరకు నిర్మించబడిన "మనోహర్ కన్‌స్ట్రక్షన్స్" యొక్క రెండవ అంతస్తులో ఉన్న రెసిడెన్షియల్ ఫ్లాట్ బేరింగ్ నం.301 ఉన్న హద్దులు : తూర్పు : సబ్జెక్ట్ ఫ్లాట్ మరియు ఓగూరు వరలక్ష్మికి చెందిన రెండవ అంతస్తులోని ఫ్లాట్ నం.302 మధ్య ఉమ్మడి గోడ, దక్షిణం : ఓపెన్ టుస్కై, పడమర : సబ్జెక్ట్ ఫ్లాట్ మరియు దాటా మెట్ల మధ్య ఉమ్మడి గోడ, ఉత్తరం: ఓపెన్ టు స్కై. ఈ సరిహద్దుల సదరు "మనోహర్ కన్‌స్ట్రక్షన్స్" గ్రౌండ్ మరియు ఒకటవ అంతస్తులు అనగా.. రెండవ అంతస్తులో ఉన్న ఒక ఫ్లాట్ బేరింగ్ నం.301 తో ప్లింత్ ఏరియా 506.25 చ.అ.లు. మరియు అన్నీ సౌకర్యాలు మరియు వాటితో పాటు సాధారణ మరియు ఉమ్మడి హకులతో సౌలభ్య హక్కులు మరియు ఉపకరణాలు మొదలైనవి. అంశం-2 : రెండవ అంతస్తు పై టెర్రస్ హక్కులలో అవిభక్త మరియు పేర్కొనబడని వాటా అనగా... 1/4 వాటా	October 16, 2025 Rs. 9,06,364.05/-	14/08/ 2025

నోటీసు యొక్క ప్రత్యామ్నాయ సేవ కోసం చర్యలు తీసుకోబడుతున్నాయి. పై రుణగ్రహీతలు/మరియు/లేదా వారి హామీదారులు (వర్తించే విధంగా) ఈ నోటీసును ప్రచురించిన తేదీ నుండి 60 రోజుల వ్యవధిలోపు బకాయి ఉన్న చెల్లించాలని సూచించారు. లేకపోతే సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్-2002 నిబంధన ప్రకారం తదుపరి చర్యలు తీసుకోబడతాయి.

తేది : 04 డిసెంబరు, 2025 **అధీకృత అధికారి**
ప్రదేశం : విజయవాడ **ఐసిఐసిఐ బ్యాంకు లిమిటెడ్ తరుపున.**

మణిపూర్‌లో ఎన్నికలు నిర్వహించాల్సిందే

- లోక్‌సభలో పొగాకుపై ఎక్సైజ్ సుంకం పెంపు బిల్లు ఆమోదం
- రాజ్ భవన్‌ల పేరు లోక్ భవన్‌లుగా మార్చడంపై రాజ్యసభలో ఆందోళన

ఢిల్లీలో వాయు కాలుష్యంపై గ్యాస్ మాస్కులతో పార్లమెంటుకు హాజరైన ఎంపిలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాజ్యసభలో మణిపూర్‌లో నీటి (కాలుష్య నివారణ, నియంత్రణ) సవరణ చట్టం-2024 చట్టబద్ధమైన తీర్మానాన్ని ఆమోదించింది. ఈ సందర్భంగా మణిపూర్‌లో ఎన్నికలు నిర్వహించాల్సిందేనని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. నీటి (కాలుష్య నివారణ, నియంత్రణ) సవరణ చట్టాన్ని రాష్ట్రానికి విస్తరించాలని తీర్మానం చేసింది. ఈ తీర్మానాన్ని ప్రవేశపెడుతూ కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన ఉన్నందున కేంద్ర చట్టంపై ఉభయ సభలు తీర్మానాన్ని ఆమోదించాల్సిన అవసరం ఉందని అన్నారు. తీర్మానంపై చర్చలో పాల్గొన్న సిపిఎం ఎంపి వి. శివదాసన్, టిఎంసి ఎంపి సుష్మితా దేవ్, మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన కొనసాగింపుపై కేంద్రాన్ని తీవ్రంగా విమర్శించారు. "మణిపూర్‌కు సహాయం చేయాలనుకుంటే, వెంటనే ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించాలి. ఇది సహకార సమాఖ్యవాదాన్ని హత్య చేయడమే" అని అన్నారు. డిఎంకె ఎంపి పి. విల్సన్ మాట్లాడుతూ "రాష్ట్ర అసెంబ్లీ ఎంతకాలం సస్పెండ్‌లో ఉంటుంది. పార్లమెంట్ ఈ తీర్మానాన్ని ఆమోదించడంతో సహా రాష్ట్ర అసెంబ్లీ పాత్రను ఆక్రమించుకుంటుంది?" అని విమర్శించారు.

లోక్‌సభలో పొగాకుపై ఎక్సైజ్ సుంకం రేటు పెంపు బిల్లు ఆమోదం పొందింది. బుధవారం పార్లమెంట్ ఉభయ సభలు సజావుగా సాగాయి. లోక్‌సభలో పొగాకుపై పన్ను విధించే కేంద్ర ఎక్సైజ్ (సవరణ) బిల్లును కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టారు. చర్చ అనంతరం బిల్లును మూజువాణి ఓటుతో ఆమోదించారు. ఈ బిల్లు ఒకసారి అమలులోకి వస్తే, ప్రస్తుతం అన్ని పొగాకు ఉత్పత్తులపై విధిస్తున్న జిఎస్‌టి పరిహార సెస్ తరువాత పొగాకు, సంబంధిత ఉత్పత్తులపై కేంద్ర ఎక్సైజ్ సుంకం రేటును పెంచడానికి ప్రభుత్వానికి అవకాశం లభిస్తుంది. ఈ బిల్లు చట్టంగా మారిన తర్వాత, సిగరెట్లు, నమిలే పొగాకు, సిగార్లు, హుక్కా, జర్దా, సెంటెడ్ పొగాకు వంటి అన్ని పొగాకు ఉత్పత్తులపై జిఎస్‌టి పరిహార సెస్ నిలిచిపోయిన వెంటనే కేంద్ర ప్రభుత్వం సెంట్రల్ ఎక్సైజ్ పన్నులు పెంచడానికి అవకాశం లభిస్తుంది. ప్రస్తుతం పొగాకు, సంబంధిత ఉత్పత్తులపై 28 శాతం జిఎస్‌టి, వివిధ రేట్లలో సెస్సు విధించబడుతోంది. ఉత్పత్తి చేయని (అన్ మాన్యుఫ్యాక్చర్డ్) పొగాకుపై 60 నుండి 70శాతం వరకు ఎక్సైజ్ సుంకం విధించాలని బిల్లు ప్రతిపాదిస్తోంది. సిగార్లు, చెరూట్లు (రెండువైపులా ఓపెన్‌గా వుండే సిగార్లు)పై ఎక్సైజ్ సుంకాన్ని 25శాతం లేదా ప్రతి వెయ్యింటికి రూ.5వేలు చొప్పున పన్ను విధించాలని, వీటిల్లో ఏది ఎక్కువగా వుంటే దాన్ని అమలు చేయాలని ప్రతిపాదించింది.

సిగరెట్ల పొడవు, ఫిల్టర్‌ను బట్టి వాటిపై ప్రతి వెయ్యింటికి రూ.2,700 నుండి రూ.11 వేల వరకు పన్ను విధించాలని ప్రతిపాదించారు. అదే సమయంలో నమిలే పొగాకుపై కిలోకు రూ.వంద పన్ను విధించాలని పేర్కొన్నారు. 2017 జులై 1న జిఎస్‌టి ప్రవేశపెట్టినప్పుడు పొగాకు, సంబంధిత ఉత్పత్తులపై సెంట్రల్ ఎక్సైజ్ పన్నులను గణనీయంగా తగ్గించారు.

ఢిల్లీలో తీవ్ర వాయు కాలుష్యంపై ఎంపిల నిరసన

దేశ రాజధాని ఢిల్లీ కాలుష్య కోరల్లో చిక్కుకుంది. వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయిలో కొనసాగుతోంది. ఢిల్లీ-ఎన్‌సిఆర్ ప్రాంతంలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 400గా నమోదవుతోంది. ఈ నేపథ్యంలో ఢిల్లీలో వాయు కాలుష్యానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తూ ప్రతిపక్ష ఎంపిలు గ్యాస్ మాస్కులు ధరించి పార్లమెంట్ శీతాకాల సమావేశాలకు హాజరయ్యారు. పశ్చిమ బెంగాల్‌కు రావాల్సిన ఉపాధి, కేంద్ర నిధుల పెండింగ్‌పై టిఎంసి ఎంపిలు కేంద్రానికి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు.

రాజ్ భవన్‌ల పేరును లోక్ భవన్‌లుగా మార్చడంపై రాజ్యసభలో రగడ

రాజ్ భవన్‌ల పేరు మార్చడం, వ్యాఖ్యల తొలగింపుపై రాజ్యసభలో మాటల యుద్ధం జరిగింది. దేశంలోని అన్ని రాజ్ భవన్‌ల పేరును లోక్ భవన్‌లుగా మార్చాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఆదేశాల అంశాన్ని బుధవారం రాజ్యసభలో టిఎంసి ఎంపి డోలా సేన్ జీరో అవర్‌లో లేవనెత్తారు. సభలో అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. "పార్లమెంట్, అసెంబ్లీ లేదా క్యాబినెట్‌కు దీని గురించి తెలియదని చెప్పాలనుకుంటున్నాం. వారు మీతో (ఛైర్మన్) కూడా దీని గురించి చర్చించడం లేదు సార్" అని సేన్ అన్నారు. ఉపాధి హామీ నిధులతో సహా ఇతర అంశాలను ఆమె లేవనెత్తారు. కేంద్ర మంత్రి జెపి నడ్డా మాట్లాడుతూ ఛైర్మన్ నుంచి అనుమతి తీసుకున్న లోక్‌భవన్ అంశంపై కాకుండా ఉపాధి హామీ, ఇతర సమస్యల గురించి సేన్ మాట్లాడినందున రికార్డుల నుంచి తొలగించాలని కోరారు. ఛైర్మన్ సిపి రాధాకృష్ణన్ ఏకీభవిస్తూ ఇతర అంశాలను రికార్డులో నుంచి తొలగిస్తున్నామని ప్రకటించారు. ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ "ఆమె ఏ విధమైన అసభ్యకరమైన పదాన్ని మాట్లాడలేదు. ప్రతిదీ ఆ విషయంతో ముడిపడి ఉంది. ఆ విషయం మీ కార్యాలయంలో పరిశీలించారు. ఆ తరువాత ఆమె మాట్లాడారు" అని పేర్కొన్నారు. ప్రభుత్వం చర్చను అడ్డుకుంటోందని అన్నారు. "సభ నాయకుడు జోక్యం చేసుకోకూడదు. చెప్పినది పార్లమెంటరీ కాదని చెప్పకూడదు. దానిని తొలగించకూడదు. సభా నాయకుడు (సభ) బుల్డోజ్ చేస్తున్నారు. మీరు పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ప్రకారం నడుచుకోవాలనుకోవడం లేదు" అని విమర్శించారు. రాజ్యసభ ఛైర్మన్ మాట్లాడుతూ జీరో అవర్ సమయంలో జాబితా చేయబడిన అంశాలకు కట్టుబడి ఉండాలని సభ్యులను కోరారు.

సంచార్ సాథీపై వెనక్కితగ్గిన కేంద్రం

న్యూఢిల్లీ : ప్రతిపక్షాల ఆందోళనలతో 'సంచార్ సాథీ' యాప్‌పై కేంద్రం వెనక్కి తగ్గింది. అన్ని స్మార్ట్ ఫోన్లలో సంచార్ సాథీ యాప్‌ను ముందస్తుగా ఇన్‌స్టాల్ చేయాలనే నిర్ణయాన్ని వెనక్కు తీసుకుంటున్నట్లు కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖ బుధవారం ప్రకటించింది. టెలికాం భద్రతకు ముప్పు కలిగించే నకిలీ లేదా తప్పుడు ఐఎంఇఐ నెంబర్లతో కూడిన హ్యాండ్‌సెట్‌ల గురించి వెల్లడిస్తూ.. 2026 మార్చి నుండి ఫోన్ తయారీదారులు అన్ని పరికరాల్లో సైబర్ సెక్యూరిటీ యాప్‌ను ముందస్తుగా ఇన్‌స్టాల్ చేయాలని టెలికమ్యూనికేషన్ల శాఖ (డిఒటి) సోమవారం ఆదేశాలను జారీ చేసిన సంగతి తెలిసిందే. వ్యక్తుల గోప్యత, నిఘా సమస్యలపై ప్రతిపక్షాల నుండి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడంతో కేంద్రప్రభుత్వం, ప్రి ఇన్‌స్టలేషన్ ఇక తప్పనిసరిగా అమలు చేయబోమని ప్రకటించింది. మొబైల్ తయారీదారులకు ప్రి-ఇన్‌స్టలేషన్‌ను తప్పనిసరి చేయకూడదని ప్రభుత్వం నిర్ణయించిందని ఆ ప్రకటనలో పేర్కొంది. ఈ నెల 1వ తేదీన ప్రకటన వెలువడిన వెంటనే సంచార్ సాథీ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవడంలో పెరుగుదల కనిపించిందని అధికారులు తెలిపారు. ఒక్క రోజులోనే దాదాపు ఆరు లక్షల మంది కొత్తగా రిజిస్టర్ అయ్యారని అంటే దాదాపు పదింతలు పెరిగారని తెలిపారు. అనుమానాస్పద కాల్స్‌ను, సైబర్ అవినీతి గురించి తెలియజేసేందుకు 2023లో ఈ యాప్‌ను పౌరులకు ఒక పోర్టల్‌గా తీసుకువచ్చారు. ప్రస్తుతం కోటీ 40లక్షల మంది యూజర్లు దీన్ని వాడుతున్నారు. రోజుకు దాదాపుగా రెండు వేల వరకు అవినీతి, మోసాల సంఘటనలు రిపోర్ట్ చేస్తూ వుంటారు. యూజర్ల రక్షణ కోసమే దీన్ని తీసుకొచ్చామని, కావాలనుకుంటే ఏ సమయంలోనైనా ఈ యాప్‌ను తొలగించవచ్చని అధికారులు చెప్పారు.

రద్దు చేయాల్సిందే

(మొదటిపేజి తరువాయి)

సంక్షేమాన్ని కాలరాస్తున్నాయని విమర్శించారు.

కార్మికుల హక్కులపై కేంద్రం దాడి : జాన్ బ్రిట్టాస్

కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులపై కేంద్రప్రభుత్వం దాడి చేస్తుందని సిపిఎం రాజ్యసభ పక్షనేత జాన్ బ్రిట్టాస్ విమర్శించారు. కార్మిక పోరాటాల చరిత్ర తెలుసుకోకుండా, కార్మిక సంఘాల సమ్మతి తీసుకోకుండా లేబర్ కోడ్లను ఏకపక్షంగా మోడీ సర్కారు తీసుకొచ్చిందన్నారు. దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న, ఉత్పత్తి సృష్టికర్తలైన కార్మిక వర్గంపై కేంద్రప్రభుత్వం దాడి చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల సంక్షేమం, సామాజిక భద్రత కోసమే లేబర్ కోడ్లను తీసుకొచ్చామని చెబుతున్న ప్రభుత్వం, కార్మికుల గొంతు ఎందుకు వినడం లేదని ప్రశ్నించారు. లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా కార్మికులు చేస్తున్న పోరాటాల పట్ల మొద్దునిద్రతో కేంద్రప్రభుత్వం వ్యవహరిస్తోందని అన్నారు. కార్మిక సంఘాలు లేవనెత్తుతున్న అంశాలకు సమాధానం చెప్పలేక చర్చకు మొఖం చాటేస్తోందని అన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో కార్మికులకు వ్యతిరేకంగా నాలుగు లేబర్ కోడ్లను తీసుకొచ్చిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా మాట్లాడుతూ.. లేబర్ కోడ్‌ల పేరుతో కార్మికుల చేతుల్లో ఉన్న అన్ని హక్కులనూ కేంద్రప్రభుత్వం లాక్కుందని విమర్శించారు. 'గతంలో కార్మికులకు ఇచ్చిన రక్షణ తీసేశారు. వారిని దోపిడీ చేసేందుకు పరిశ్రమ యజమానులకు కొత్త మార్గాలు తెరిచారు. ఈ చట్టాలతో నరేంద్ర మోడీ పెట్టుబడిదారీ అనుకూల, కార్మిక వ్యతిరేక మనస్తత్వం మరోసారి స్పష్టమైంది. దేశం ఈ చట్టాలను అంగీకరించదు' అని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ, లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ, సిపిఎం ఎంపిలు కె రాధాకృష్ణన్, వి శివదాసన్, రహీమ్, ఎస్ వెంకటేశన్, డిఎంకె ఎంపిలు కనిమొళి, ఎ రాజా, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ ఎంపి సుదామ ప్రసాద్, టిఎంసి ఎంపి డోలాసేన్ తదితరులు పాల్గొన్నారు. లేబర్ కోడ్లపై చర్చ చేపట్టాలని కోరుతూ కాంగ్రెస్ నేత మాణిక్యం ఠాకూర్ లోక్‌సభలో వాయిదా తీర్మానం ఇచ్చారు.

పుతిన్ భారత్ పర్యటనలో భారీ మిలటరీ ఒప్పందం!

- డ్యూమా ఆమోద ముద్ర

మాస్కో : రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఈ నెల 4, 5 తేదీల్లో భారత్‌లో పర్యటించనున్న నేపథ్యంలో భారత్‌తో కుదుర్చుకునే కీలకమైన మిలటరీ ఒప్పందానికి రష్యా పార్లమెంట్ ఆమోద ముద్ర వేసింది. ఇరు దేశాల ప్రభుత్వాల మధ్య రెసిప్రోకల్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ లాజిస్టిక్ సపోర్ట్ (ఆర్ఇఎల్ఓఎస్) ఒప్పందంపై ఈ ఏడాది ఫిబ్రవరి 18న సంతకాలు జరిగాయి. ప్రధాని మిఖాయిల్ మిషుస్తిన్ ఆమోదముద్ర కోసం దీన్ని గత వారం డ్యూమా (పార్లమెంట్ దిగువ సభ)కు పంపారు. "భారత్‌తో మన సంబంధాలు చాలా వ్యూహాత్మకం గా, సమగ్రంగా వుంటాయి. వాటికి మనం విలువ ఇస్తాం. ప్రస్తుత ఒప్పందాన్ని ధ్రువీకరించడం మన సంబంధాల అభివృద్ధిలో మరొక మైలురాయి." అని డ్యూమా స్పీకర్ వ్యశ్చెవ్ వొలొదిన్ ప్లీనరీ సమావేశంలో వ్యాఖ్యానించారు.

వినతులతో సరి!

(మొదటిపేజి తరువాయి)

క్షీణించాయి. ఖరీఫ్ పంట మార్కెట్‌కొస్తోంది. తమ వద్ద ఉత్పత్తి జరిగిన పంటలో పాతిక శాతం కొనాలని కేంద్రాన్ని రాష్ట్ర మంత్రులు మంగళవారం అడిగారు. అక్కడి నుంచి ఎటువంటి హామీ లభించలేదు. కందుల ధరా దిగజారింది. దీనిపై ఇంకా ప్రభుత్వం కేంద్రానికి విజ్ఞాపన సైతం ఇవ్వలేదు. నిరుడు మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసిన శనగ పంట నిల్వలు ఇంకా గోదాముల్లో ఉన్నాయి.

మిర్చికి రూపాయి ఇవ్వలేదు

నిరుడు మిర్చి ధరలు ఘోరంగా పతనమై రైతులు ఎన్నడూలేని విధంగా నష్టాలు చవి చూశారు. ఆదుకోవాలని ప్రభుత్వం కేంద్రాన్ని కోరగా ఒక్క రూపాయి కూడా సాయం చేయలేదు. పొగాకు సైతం అంతే. అసలు నల్లబర్లీ రకాన్ని సాగు చేయనే వద్దని కేంద్రం మన వినతిని నిర్ద్వంద్వంగా తోసిపారేసింది.

కిసాన్ రైలు ఎక్కడ?

మొన్నటి వరకు ఉల్లి, టమాటా, మామిడి, నేడు అరటి పంటలకు ధరలు పడిపోయాయి. ఉల్లి, టమాటా కిలో రూపాయికి కూడా కొనే నాథుడు లేక రోడ్ల పాలయ్యాయి. చిత్తూరులో మామిడి ధర కిలోకు 4 రూపాయలకు తక్కువే పలికింది. ఇప్పుడు మళ్లీ అదే స్థితికి వచ్చింది. కొబ్బరి ధరలూ క్షీణించాయి. కడపలో కిలో అరటికి రూపాయి కూడా పడట్లేదు. పండ్లు, కూరగాయల వంటి రైతుల ఉత్పత్తులకు మార్కెట్ సౌకర్యం కల్పించేందుకు 2020 సెప్టెంబర్‌లో కేంద్రం కిసాన్ రైలు పథకం ప్రవేశపెట్టడంతోపాటు దేశంలోనే రెండవ రైలును అనంతపురం నుంచి ఢిల్లీకి నడిపింది. ధరలు పతనమైన వేళ ఆ పథకంపై టిడిపి కేంద్రాన్ని అడగట్లేదు. కేంద్రం సైతం స్పందించట్లేదు.

చేయాల్సిన కసరత్తు చాలా వుంది

- ఉక్రెయిన్ శాంతి ప్రణాళికపై క్రెమ్లిన్
- కొన్ని ప్రతిపాదనలు ఆమోదయోగ్యంగా లేవని వ్యాఖ్య

ఉక్రెయిన్ శాంతి ప్రణాళికపై అమెరికా ప్రతినిధులతో చర్చిస్తున్న రష్యా అధ్యక్షుడు పుతిన్

మాస్కో : ఉక్రెయిన్‌లో యుద్ధానికి స్వస్తి పలికేందుకు ఉద్దేశించిన శాంతి ఒప్పందంపై రష్యా, అమెరికాలు ఎలాంటి అంగీకారానికి రాలేదని క్రెమ్లిన్ బుధవారం తెలియజేసింది. అమెరికా శాంతి ప్రణాళికను రష్యా తిరస్కరించలేదని, కానీ అంగీకారానికి వచ్చే దిశగా జరగాల్సింది ఇంకా చాలా వుందని పేర్కొంది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దూతల మధ్య ఐదు గంటల పాటు చర్చలు జరిగిన అనంతరం క్రెమ్లిన్ ఈ ప్రకటన చేసింది. మాస్కోలో పుతిన్‌తో ట్రంప్ ప్రత్యేక దూత స్టీవ్ విట్కాఫ్, అల్లుడు జేర్డ్ కుష్నర్‌లు మంగళవారం జరిపిన చర్చలు అర్ధరాత్రి దాటేవరకు కొనసాగాయి. పుతిన్ విదేశాంగ విధాన సహాయకుడు యూరి యుష్‌కోవ్, క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ కూడా చర్చల్లో పాల్గొన్నారు.

చర్చల అనంతరం యుష్‌కోవ్ మాట్లాడుతూ, ఇప్పటివరకు ఎలాంటి అంగీకారం, రాజీ కుదరలేదని చెప్పారు. ఇంకా జరగాల్సింది, చేయాల్సిన కసరత్తు చాలా వుందని ఆయన విలేకర్లతో వ్యాఖ్యానించారు. అమెరికా చేసిన కొన్ని ప్రతిపాదనలపై పుతిన్ ప్రతికూలంగా స్పందించారని యుష్‌కోవ్ తెలిపారు. ఈ సమావేశంలో పుతిన్ చాలా కీలకమైన సంకేతాలు పంపారని చెప్పారు. చర్చల వివరాలను మీడియాకు వెల్లడించరాదని నిర్ణయించినట్లు తెలిపారు. డాన్‌బాస్ ప్రాంతంపై ఇరు దేశాల మధ్య వివాదం గురించి వివరంగా మాట్లాడకుండా 'భూభాగ సమస్య'పై వారు చర్చించారని క్లుప్తంగా చెప్పారు. అమెరికా చేసిన కొన్ని ప్రతిపాదనలు ఆమోదయోగ్యంగా లేవని, వాటిపై ఇంకా సవివరంగా చర్చలు జరపాల్సిన అవసరముందని చెప్పారు. "వారు ప్రతిపాదించిన కొన్ని సమీకరణాలు మాకు అస్సలు సరిగా లేవు, వాటిపై ఇంకా కసరత్తు కొనసాగాల్సిన అవసరముంది." అని ఆయన పేర్కొన్నారు. మరోవైపు క్రెమ్లిన్ ప్రతినిధి కూడా విలేకర్లతో మాట్లాడారు.

అమెరికా ప్రతిపాదనలను పుతిన్ తిరస్కరించారనడం పొరపాటని వ్యాఖ్యానించారు. శాంతి ప్రణాళికపై తొలిసారిగా జరిగిన పరస్పర అభిప్రాయాల మార్పిడే ఈ సమావేశమని ఆయన పేర్కొన్నారు. సాధారణ చర్చల ప్రక్రియ సాగిందని చెప్పారు. రాజీ కోసం అన్వేషణ సాగిందన్నారు. క్రెమ్లిన్ నుండి సరాసరి మాస్కోలోని అమెరికా ఎంబసీకి వెళ్లిన విట్కాఫ్ చర్చల వివరాలను వైట్‌హౌస్‌కు తెలియజేశారని యుష్‌కోవ్ చెప్పారు. ప్రస్తుతం ఇరు దేశాల అధ్యక్షుల మధ్య సమావేశమేదీ జరపాలనుకోలేదన్నారు. ప్రస్తుత చర్చలు నిర్మాణాత్మకంగా సాగాయని, ఇరు దేశాల మధ్య ఆర్థిక సహకారానికి అపార అవకాశాలు వున్నాయని చెప్పారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత యూరప్‌లో అత్యంత భయంకరమైనదిగా పరిగణిస్తున్న ఉక్రెయిన్ యుద్ధానికి స్వస్తి పలకడం తమ విదేశాంగ విధాన లక్ష్యమని ట్రంప్ పదేపదే చెబుతూ వస్తున్నారు. ఇదేమీ అంత సులభమైనది కాదని మంగళవారం ట్రంప్ వ్యాఖ్యానించారు.

చర్చలపైనే ప్రతీదీ ఆధారపడి వుంది : జెలెన్ స్కీ

డబ్లిన్‌లో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ మాట్లాడుతూ, మాస్కోలో చర్చలపైనే ప్రతీదీ ఆధారపడి వుందని అన్నారు. క్రెమ్లిన్‌తో సమావేశానికి ముందుగా పుతిన్ మాట్లాడుతూ, యూరప్‌తో యుద్ధం జరపాలని రష్యా కోరుకోవడం లేదన్నారు.

వెనిజులా చమురు సంస్థ 'సిట్గో' బలవంతపు అమ్మకం

- అమెరికా కోర్టు ఆదేశం
- ఖండించిన వెనిజులా

కారకాస్ : ప్రముఖ చమురు కంపెనీ సిట్గోను అమ్మేయాలని అమెరికా ఫెడరల్ కోర్టు ఆదేశించింది. వెనిజులా ప్రభుత్వ చమురు కంపెనీ అయిన 'సిట్గో' అమెరికాలో వ్యాపారం చేస్తుంది. ఈ కంపెనీకి బిలియన్ డాలర్ల అప్పులున్నాయి. ఈ బకాయిలను చెల్లించేందుకు సిట్గోను బలవంతంగా విక్రయించేందుకు అమెరికా కోర్టు తీర్పునిచ్చింది. దీన్ని వెనిజులా ఉపాధ్యక్షుడు, పెట్రోలియం మంత్రి డెల్సీ రోడ్రిగ్జ్ తీవ్రంగా ఖండించారు. చమురు కంపెనీ పిడివిఎస్ఎ (పెట్రోలియోస్ డి వెనిజులా, ఎస్ఎ)కి చెందిన అనుబంధ సంస్థ సిట్గో రుణదాతలకు 20 బిలియన్ డాలర్లు బాకీ ఉంది. గతంలో లాభదాయకంగా ఉన్న ఈ సంస్థ అమెరికా ఆంక్షల కారణంగా ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటోంది. ఈ కంపెనీ రుణదాతల్లో కెనడియన్ సంస్థ క్రిస్టలెక్స్ కూడా ఉంది. 2008లో వెనిజులాలోని లా క్రిస్టినాస్ గనిని స్వాధీనం చేసుకుని జాతీయం చేయడంతో.. ఆ ప్రభుత్వం క్రిస్టలెక్స్‌కు 1.2 బిలియన్ డాలర్ల బాకీ ఉందని మరో యుఎస్ కోర్టు పేర్కొంది.

అయితే వెనిజులా చమురు నిల్వలపై కన్నేసిన అమెరికా కరేబియన్ సముద్రంలో సైనిక స్థావరాన్ని ఏర్పాటుచేసి ఉద్రిక్తతలను పెంచింది. వెనిజులా అధ్యక్షులు నికోలస్ మదురో ప్రభుత్వాన్ని కూలదోయడానికి సిఐఎకు అనుమతించిన అమెరికా.. తాజాగా సిట్గో విక్రయం ద్వారా ఒత్తిడి పెంచేందుకు ప్రయత్నిస్తుందని పలువురు భావిస్తున్నారు.

మరో రెండేళ్లలో రష్యా నుండి గ్యాస్ దిగుమతుల నిలిపివేత : ఇయు

బ్రస్సెల్ : రష్యా నుండి గ్యాస్ దిగుమతులను 2027 ఏడాది చివరి నాటికి దశలవారీగా నిలిపివేయడంపై యూరోపియన్ పార్లమెంట్‌తో ఒక ఒప్పందానికి వచ్చినట్లు యూరోపియన్ కౌన్సిల్ బుధవారం తెలిపింది. ఈ ఒప్పందం ప్రకారం..

రష్యా నుండి గ్యాస్ (ఎల్ఎన్‌జి), పైప్‌లైన్ గ్యాస్ దిగుమతులపై చట్టబద్ధంగా, దశలవారీగా నిషేధం ఉంటుంది. వచ్చే ఏడాది చివరి నుండి 2027 డిసెంబర్ నాటికి ఈ నిషేధం పూర్తిగా అమలు కానుంది. అక్టోబర్ నాటికి రష్యా నుండి ఇయు 12శాతం మేర గ్యాస్ దిగుమతి చేసుకుంటోంది. 2022లో ఉక్రెయిన్ యుద్ధానికి ముందు ఈ దిగుమతులు 45శాతం వరకు వుండేవి. హంగేరీ, ఫ్రాన్స్, బెల్జియం దేశాలు ఇప్పటికీ రష్యా నుండి గ్యాస్‌ను దిగుమతి చేసుకుంటున్నాయి.

విజయవాడలో బుల్డోజ్‌రాజ్

(మొదటిపేజి తరువాయి)

చేసి అందులో నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. ఇంటిపన్ను, నీటి పన్ను, కరెంట్ బిల్లులు సైతం చెల్లిస్తూ వచ్చారు. మరికొందరు ఆ స్థలం ద్వారా బ్యాంకులో రుణాన్ని సైతం పొందారు. 2017లో శ్రీ లక్ష్మీ రామ కో - ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ పేరిట 42 ఇళ్ల యజమానులకు విజయవాడ కోర్టు నుంచి నోటీసులు అందాయి. స్థలం ఖాళీ చేయాలని నోటీసులో పేర్కొనడంతో బాధితులందరూ కోర్టును ఆశ్రయించారు. వాదనల అనంతరం శ్రీ లక్ష్మీ రామ కో-ఆపరేటివ్ బిల్డింగ్స్ సొసైటీకి అనుకూలంగా తీర్పు వచ్చింది. దీంతో బాధితులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. బుధవారం ఉదయం సుప్రీంకోర్టు స్టే విధించినా బలవంతంగా ఇళ్లను కూల్చివేశారు. దీంతో బాధితులకు పోలీసులకు మధ్య తోపులాట, ఘర్షణలు చోటు చేసుకున్నాయి. ఒక్కసారిగా ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ భవానీపురం బైపాస్‌రోడ్డుపై బాధితులు ఆందోళనకు దిగారు. రోడ్డుపై బైఠాయించిన బాధితులను పోలీసులు చెదరగొట్టారు. దీంతో బాధితులందరూ కలిసి సిఎం చంద్రబాబు ఇంటి వద్దకు చేరుకున్నారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ ఫ్లకార్డులు చేతపట్టుకుని నిరసన తెలిపారు. బాధితులను పరామర్శించిన సిపిఎం నాయకులు సత్తిబాబు మాట్లాడుతూ.. టిడిపి కూటమి ప్రభుత్వం భూ కబ్జాలు ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. బాధితుల పక్షాన న్యాయపోరాటం చేస్తామని తెలిపారు.

లాభసాటిగా వ్యవసాయం

(మొదటిపేజి తరువాయి)

ఇక్కడి మన పంటలపై ప్రభావం చూపుతోందన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు కోపం వస్తే మన రొయ్య ఎగిరిపోయే పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల నుంచి బయట పడాలంటే అంతర పంటలను పండించాలన్నారు. ఒక పంట వరి వేస్తే, మరో పంటగా ఉద్యాన పంటలను వేస్తే ఆదాయం పెరుగుతుందని సూచించారు. ప్రతి నియోజకవర్గంలోనూ ఒక ఎంఎస్ఎంఇ పార్కు పెడుతున్నామని, రైతులు పండించిన పంటను నేరుగా వినియోగదారునికి విక్రయించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తయారు చేస్తున్నామన్నారు. ఎడారిలో పండే ఖర్జూరం నేడు రాయలసీమలో పండుతోందని తెలిపారు. చేపలు, రొయ్యల సాగుతో ఎకరాలకు రూ.1.45 లక్షల ఆదాయం వస్తుంటే, వ్యవసాయంలో అది రూ.50 వేల మాత్రమేనని వివరించారు.

గత పాలకులు ఖజానా ఖాళీ చేశారు

గడిచిన ఐదేళ్లలో వైసిపి పాలకులు రాష్ట్ర ఖజానాను ఖాళీ చేశారని చంద్రబాబు విమర్శించారు. అన్ని వ్యవస్థలనూ జగన్ సర్వనాశనం చేశారని దుయ్యబట్టారు. కనీసం అప్పు కూడా దొరకని పరిస్థితి వచ్చిందన్నారు. కూటమిపై నమ్మకంతో అద్భుత విజయం అందించారని, వ్యవస్థలను సరిచేసుకుంటూ వస్తున్నామని, సూపర్ సిక్స్‌తో ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకున్నామని పేర్కొన్నారు. కరెంటు ఛార్జీలు పెంచబోమనే మాటకు కట్టుబడి ఉన్నామన్నారు. వచ్చే సంక్రాంతిలోగా గుంతల రోడ్లకు మరమ్మతులు చేస్తామని పునరుద్ఘాటించారు. పాలనలో సంస్కరణలు తీసుకొస్తున్న క్రమంలో అడ్డంకులు సహజమేనన్నారు. సంక్షేమానికి, అభివృద్ధికి సమ ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. 2047 నాటికి స్వర్ణాంధ్ర కల సాకారమవుతుందని అన్నారు.

ఉత్పత్తికి లింకు పెడుతూ జీతాల్లో భారీ కోత

(మొదటిపేజి తరువాయి)

రూ.60 కోట్లే చెల్లింపులు చేసినట్టు తెలుస్తోంది.

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం కేంద్రంలోని మోడీ సర్కారు మార్గదర్శకంలో నడుస్తూ కార్మికుల పొట్టగొట్టే చర్యలను ముమ్మరం చేసింది. ఉత్పత్తిని బట్టి జీతాలు ఇస్తామంటూ నవంబర్ 15న చట్ట విరుద్ధ సర్క్యులర్‌ను జారీ చేసిన ప్లాంట్ యాజమాన్యం అన్నంతపనీ చేసింది. ప్లాంట్‌లోని విభాగాలను నిర్వీర్యం చేసి, కార్మికులను ఇష్టానుసారం తొలగించి, సరిగా రా మెటీరియల్‌ను అందించకుండా ఉత్పత్తి లక్ష్యాలను చేరలేదనే పేరిట కార్మికులపై ఆర్థిక దాడికి దిగింది. నవంబర్ నెల జీతంలో భారీగా కోత పెట్టి డిసెంబర్ రెండు నుంచి జీతాలు ఇస్తుండడంపై కార్మికవర్గం భగ్గుమంటోంది. దేశంలోని ఏ ప్రభుత్వ రంగ సంస్థలోనూ ఉత్పత్తితో జీతాలకు ముడిపెట్టే విధానం ఇంతవరకూ లేదు. కానీ, కేంద్ర ప్రభుత్వం డైరక్షన్ మేరకు వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో యాజమాన్యం అమలు చేయడంపై కార్మికవర్గం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. ఈ క్రమంలోనే బుధవారం ఉక్కు ప్రధాన పరిపాలన కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు.

20 శాతం జీతం కోల్పోయాం

విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో అనిశ్చితి వాతావరణం నెలకొంది. దేశంలో ఎక్కడా లేనివిధంగా కొత్త కొత్త నిబంధనలు తీసుకొస్తున్నారు. ఉద్యోగుల జీతాల్లో కోతలు విధిస్తున్నారు. ఉత్పత్తితో లింకు పెట్టి జీతం చెల్లించడంతో సుమారు 20 శాతం జీతం తగ్గింది. యువ ఉద్యోగుల అందరిదీ ఇదే పరిస్థితి. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షిస్తామని కూటమి నేతలు చెప్పినందునే ఎన్నికల్లో గెలిచారు. అధికారం చేపట్టాక కార్మికులను నిలువునా మోసగించారు. ప్లాంట్‌ను ప్రైవేటీకరణ వైపు తీసుకు వెళ్తున్నారు.

-వురిటి మరిడయ్య, స్టీల్ ఎస్ఎంఎస్ - 2

ఆర్థిక ఇబ్బందుల్లోకి నెడుతున్నారు

ఎంతోమంది ఉద్యోగులు, కార్మికులు పిల్లల చదువులు, ఇతర అవసరాల కోసం రుణాలు తీసుకున్నారు. ప్రతి నెలా ఇఎంఐలు కడుతున్నారు. ఇప్పుడు ఉన్నట్టుండి వేతనాలు తగ్గిస్తే వారందరి పరిస్థితి ఏంటి?. ప్రతి నెలా వేతనంలో 20 శాతం మేర కోత విధిస్తే ఎలా బతకాలి. కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే ఉక్కు కార్మికులను ఆర్థిక ఇబ్బందుల్లోకి నెడుతున్నారు. ప్రభుత్వాల తీరు మారాలి.

- సిహెచ్.అబ్బాయి, స్టీల్ బ్లాస్ట్ ఫర్నేస్ 3

గంజాయిపై ప్రభుత్వ స్పందన బాగోలేదు

(మొదటిపేజి తరువాయి)

హత్య జరిగితే సిఎం నేరుగా వెళ్లి భారీ ఎత్తున పరిహారం ఇచ్చారని, అలాంటిది ప్రజల కోసం చనిపోయిన వారికి సాయం చేయలేరా? అని ప్రశ్నించారు. దీనిపై ముఖ్యమంత్రిని కలవడానికి అపాయింట్‌మెంట్ కూడా కోరామని, జిల్లా కలెక్టర్‌ను కూడా కలుస్తామని, స్పందించకపోతే రాష్ట్ర వ్యాప్త ఆందోళన చేపడతామని అన్నారు. రాష్ట్రంలో గంజాయి బాగా పెరిగిపోయిందని, పిల్లలు కూడా బలైపోతున్నారని అన్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు దీనిపై నోరెత్తకపోవడం అన్యాయమన్నారు. గంజాయి మాఫియాలు ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలో ఉంటున్నారని, నెల్లూరులో కామాక్షి కూడా రెండు పార్టీలనూ వాడుకుందని అన్నారు. టిడిపి, వైసిపి దీనిపై స్పందించి వారి పార్టీలో ఉన్న గంజాయి వ్యాపారులు, సరఫరాదారులు, పంపిణీదారులను బహిష్కరించాలని డిమాండ్ చేశారు. మరోవైపు పోలీసులకు ఫిర్యాదు చేస్తుంటే వారితో మీకెందుకని పోలీసులే భయపెట్టే పరిస్థితి ఏర్పడిందని, ఇలాగే కొనసాగితే రాష్ట్రంలో గంజాయికి ఎంతోమంది పెంచలయ్యలు బలయ్యే ప్రమాదం ఉందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గంజాయి నిర్మూలనకు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రభుత్వం చేతిలో బోర్డు.. పెత్తనం ప్రైవేటుదా?

ప్రభుత్వం చేతిలో 10 మెడికల్ కళాశాలల టైటిల్ బోర్డు మాత్రమే ఉంటుందని పెత్తనం ప్రైవేటు కంపెనీల చేతుల్లో ఉంటుందని తాజా మార్గదర్శకాలు వెల్లడిస్తున్నాయని శ్రీనివాసరావు విమర్శించారు. ఇప్పటికే మెడికల్ కళాశాలల్లో కన్వీనర్ కోటా సీట్లను సగానికి తగ్గించారని, గత ప్రభుత్వ విధానాన్నే వీరు అనుసరిస్తున్నారని, అనేక రాష్ట్రాల్లో పి3 కింద మెరిట్ సీటు వచ్చినా కనీసం రూ.8 లక్షల నుండి రూ.12 లక్షల వరకూ వసూలు చేస్తున్నారని అన్నారు.

రాష్ట్రంలో కొన్ని మెడికల్ కళాశాలలు నాణ్యతతో ఉన్నా కొన్నిటిల్లో ఫేక్ వైద్యులు, ఫేక్ రోగులు ఉన్నారని ఇటీవల ఇడి తనిఖీల్లో తేలిందన్నారు. విశాఖలోని గాయత్రి మెడికల్ కళాశాలను ఆయన ఉదహరించారు. ఇలా ప్రైవేటు చేతుల్లోకి వెళితే వాటిల్లో పేదలకు వైద్యం అందడం కష్టంగా మారుతుందని విమర్శించారు. ఇప్పటికే పేదలకు బెడ్లు ఉండటం లేదని, భవిష్యత్‌లో అవి కూడా లేకుండా పోతాయని అన్నారు. సమర్థ పాలకులం అని చెప్పుకుంటున్న నేతలు 10 మెడికల్ కళాశాలలను నిర్వహించలేరా? అని ప్రశ్నించారు. అలా నిర్వహించలేనప్పుడు సమర్థ పాలన ఎలా అవుతుందని ప్రశ్నించారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా పెద్దయెత్తున వ్యతిరేకత వస్తోందని, ఇది ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తుందని అన్నారు. ఇప్పటికైనా జిఓ 847, 107, 108ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో పేరెంట్ టీచర్స్ సమావేశాలను రాజకీయ వేదికలుగా మార్చొద్దని, గతంలో రాజకీయాలకు, విద్యార్థి సంఘాలకు అవకాశం లేదని జిఓ ఇచ్చి ఇప్పుడు తెలుగుదేశం కార్యకర్తలు పిటిఎంలకు వెళ్లాలని చెప్పడం విద్యా వ్యవస్థను చెడగొట్టడమేనన్నారు. మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు శ్రీనివాసరావు స్పందించారు. పిటిఎంలు నిర్వహించడం మంచిదని, అది విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలతో నిర్వహించాలని, అప్పుడే సరైన పద్ధతిలో విద్యా వ్యవస్థ ముందుకు వెళుతుందని పేర్కొన్నారు. అలా కాకుండా రాజకీయ నాయకులు వెళితే అక్కడ రాజకీయ ఘర్షణలు జరుగుతాయని, దీనివల్ల విద్యా వ్యవస్థ పాడవుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులను మంచి పౌరులుగా, నాయకులుగా తీర్చిదిద్దాలంటే మాక్ అసెంబ్లీ జరిపితే సరిపోదని, విద్యార్థి సంఘాలకు ఎన్నికలు జరపాలని, తద్వారా సమాజానికి రాజకీయ నాయకత్వం వస్తుందని అన్నారు. సిఎం చంద్రబాబు కూడా అలా వచ్చినవారేనని తెలిపారు.

ప్రభుత్వ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకునే విధంగా పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలు ఉన్నాయని శ్రీనివాసరావు అన్నారు. వాటికి వీడియో ఆధారాలు కూడా ఉన్నాయని, అయినా వక్రీకరించొద్దని బుకాయించడం ఏమిటని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వ పాలనలో కొబ్బరి, పొగాకు, పత్తితోపాటు అన్ని పంటలకూ ధరలు తగ్గాయని, రైతులను కాపాడే పనిచేయకుండా ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టే ప్రకటనలు చేయడం సరికాదని అన్నారు. పైగా దిష్టి తగిలితే పంటలు ఎండిపోతాయని అనడమేనా ఆయనకు తెలిసిన సనాతన ధర్మం అని ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలను బాధ్యత కలిగిన ఉప ముఖ్యమంత్రి ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

జీవన సౌరభం

గెలవాలనే స్ఫూర్తితో పోరాడితే ఓడినా తట్టుకోగలరు.

మీకోసం

వెల్లుల్లిని కాగితపు సంచిలో వేసి ఉంచితే అవి చెడిపోకుండా ఎక్కువ కాలం నిల్వ ఉంటాయి.

చిట్టి చీమ చిన్న దోమ



చిట్టి చీమ గట్టు మీద
చుట్టు చుట్టు తిరుగుతోంది
ఆహారం దొరక లేదు
ఆవురావురంటోంది.

ఒక్క పలుకు పంచదార
రేణువైన చిక్కలేదు
పండుముక్క, కాయముక్క
ఏది కూడ దక్కలేదు

చీమనేమో పలకరించే
అటుగా వచ్చిన దోమ
మాకు చూడు ఆహారం
ఎక్కడైనా దొరుకుతుంది

మురికిగుంట, పెద్ద కొట్టు
అమ్మగారి వంట ఇల్లు
ఎక్కడైనా ఎగురుతాం
దేనినైన తాకుతాము

మేముతిన్న దేనినైన
తిన్నవాడికే రోగం
భయపడుతూ అంతమాకు
చేస్తారులే సలాము

జీతంలో సగం డబ్బు
మమ్ము చంపెటందుకే
దోమంటే ప్రపంచంలో
ఎవ్వరికైనా భయమే!

తన గొప్పలు చెప్పకుంటూ
జివ్వు మని గోల చేస్తూ
అక్కడున్న మనిషిమీద
వాలిందా చిన్న దోమ

రోదన విన్న వెంటనే
లేచింది అతని చేయి
టప్పమని కొట్టింది
చిన్న దోమ చచ్చింది

చేతి నున్న మిఠాయి
ఎగిరి కింద పడింది
మిఠాయిలో పలుకుపట్టి
చిన్న చీమ నడిచింది

చేయబోకు ఎప్పుడు
ఎవరికీ అపకారం
చెప్పకోకు గొప్పలు
అదే తెచ్చు పతనం!

\- కూచిమంచి నాగేంద్ర
91821 27880.



లెక్కచేయండి

పిల్లలూ, ఇక్కడ కొన్ని పండ్ల బొమ్మలను అంకెలుగా గణించి సమాధానాలు ఇచ్చాం. చివరి వరుస సమాధానాన్ని బట్టి అరటిపండు అంకెను మీరు కనిపెట్టండి చూద్దాం.

నేను గీసిన బొమ్మ

పి.ప్రసన్న
5 వ తరగతి
ఎం.పి.యు.పి.స్కూలు
పి.నైనవరం
విజయవాడ రూరల్ మండలం
ఎన్టీఆర్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఇంద్రజాలంతో వైజ్ఞానిక ప్రచారం

ఉంగరాన్ని ఉన్నట్టుండి మాయం చేయడం.. మళ్లీ ప్రత్యక్షం చేయడం. కళ్లకు గంతలు కట్టుకుని బైకు నడపడం. తాళం వేసిన పెట్టెలో నుండి బయటకు రావడం.. ఖాళీ డబ్బాల్లో నుంచి అమ్మాయిలను ప్రత్యక్షం చేయడం.. మనుషులను గాలిలో తేలియాడజేయడం... శూన్యంలో నుంచి మెజీషియన్ ప్రత్యక్షం కావటం. చేతులు కాళ్ళు తాడుతో కట్టించుకొని క్షణాల్లో విప్పుకోవడం... పావురాలు మాయం చేయడం.. ఒకే రంగు గుడ్డ నుండి రకరకాల రంగుల గుడ్డలు తీయడం. మాయం చేసిన నాణేలను ప్రేక్షకుల జేబుల నుండి తీయడం... ఇలా అనేక రకాల ఇంద్రజాల విద్యను ప్రదర్శిస్తూ ఔరా అనిపించుకుంటున్నారు దరియా సుజన్‌కుమార్.

కడప జిల్లా యర్రగుంట్లకు చెందిన దరియా సుబ్బారాయుడు, సుజానమ్మ దంపతుల కుమారుడు సుజన్ కుమార్. మెజీషియన్, యాంకర్, విద్యావేత్త, ఈవెంట్ ఆర్గనైజర్‌గా తన సృజనాత్మక ఇంద్రజాల ప్రదర్శనలు ఇస్తూ బహుముఖ ప్రజ్ఞాశాలిగా పేరు పొందారు. రాష్ట్ర విద్యా పరిశోధనా, శిక్షణా కేంద్రం (ఎస్‌సిఈఆర్‌టి)లో అసెస్మెంట్ ఎక్స్‌పర్ట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. మెజీషియన్, ఇల్యూషనిస్టుగా ప్రదర్శనలు చేస్తూ పలు కార్యక్రమాలకు వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల పెండ్లిమర్రిలో సిఎం చంద్రబాబు సమక్షంలో నిర్వహించిన అన్నదాత సుఖీభవ-పిఎం కిసాన్ కార్యక్రమంలో వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

2002లో డిఎస్‌సి ద్వారా అదే జిల్లాలోని విఎన్ పల్లె వెల్దుర్తిలో లాంగ్వేజ్ పండిట్ (హిందీ) ఉపాధ్యాయుడిగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. అనంతరం నందలూరులోని పొత్తపి, సింహాద్రిపురంలోని గురజాల, కమలాపురంలోని సి.రాజుపాలెం, ఎర్రగుంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విధులు నిర్వర్తించారు. 2019లో స్కూల్ అసిస్టెంట్ హిందీగా ఉద్యోగోన్నతి పొంది విఎన్‌పల్లెలోని మెయిళ్ళచెరువు, పాయసంపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేసి మంచి ఉత్తీర్ణతా ఫలితాలు వచ్చేలా కృషిచేశారు. అనంతరం ఎస్‌సిఈఆర్‌టి నిర్వహించిన పరీక్షలో సత్తాచాటి ఈ ఏడాది మార్చి నుంచి ఎస్‌సిఈఆర్‌టిలో హిందీ అసెస్మెంట్ ఎక్స్‌పర్ట్‌గా చేరారు. రాష్ట్రప్రభుత్వం నిర్వహించే కార్యక్రమాలు, ముఖ్య మంత్రులు, మంత్రుల సభలు, సమావేశాలకు చాలా ఏళ్లుగా వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నారు స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాల్లో చేపట్టే ఎట్‌హోం వంటి కార్యక్రమాలతోపాటుగా గండికోట, సిద్ధవటం కోట ఉత్సవాలు, పర్యాటక దినోత్సవాల సందర్భంగా మ్యాజిక్ ప్రదర్శనలు ఇస్తూ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. కేంద్రమంత్రుల రాష్ట్ర పర్యటనల్లో హిందీ, ఆంగ్ల భాషలకు తెలుగు లైవ్ ట్రాన్సలేటర్‌గా సైతం వ్యవహరిస్తున్నారు. 2005 నుంచి రాక్ ఈవెంట్స్ ద్వారా అనేక కార్యక్రమాలను నిర్వహిస్తూ అనేకమంది కళాకారులకు అవకాశాలను కల్పిస్తున్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి

1998 నుంచి మెజీషియన్‌గా రాణిస్తూ ఇప్పటివరకూ 2000 లకుపైగా ఇంద్రజాల ప్రదర్శనలు ఇచ్చారు. ప్రజల్లో మూఢ నమ్మకాలను పారదోలుతూ దేశవ్యాప్తంగా హిందీ, ఇంగ్లీషు, తెలుగు భాషల్లో 17 రాష్ట్రాల్లో అనేక ప్రదర్శనలు ఇచ్చారు. ఈ ఏడాది నవంబర్ 9న ఏపి మ్యాజిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాజంపేటలో నిర్వహించిన 41వ ఇంద్రజాల మహోత్సవంలో ప్రతిష్టాత్మకమైన 'జాదు రత్న' పురస్కారాన్ని పొందారు. ఇప్పటివరకూ రాష్ట్ర, జాతీయస్థాయి సంస్థల ద్వారా వందకుపైగా అవార్డులను అందుకున్నారు. 2014లో రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన యువజనోత్సవంలో రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతి పొందారు. భారత ప్రభుత్వం, సాంస్కృతిక శాఖ, సెంటర్ ఫర్ కల్చరల్ రిసోర్సెస్ అండ్ ట్రైనింగ్ (సిసిఆర్‌టి) ద్వారా న్యూఢిల్లీ, గౌహతి, ఉదయపూర్‌లో వివిధ కళల్లో శిక్షణ, ప్రదర్శనలు సైతం ఇచ్చారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ సంస్థలో ఏర్పాటుచేసిన జాతీయస్థాయి వర్కుషాపులో ఇంద్రజాల ప్రదర్శన ఇవ్వటంతోపాటుగా కొంతమందికి శిక్షణను సైతం ఇచ్చారు. 2008లో రాష్ట్రప్రభుత్వం నిర్వహించిన విజ్ఞాన మేళాలో భాగంగా ఆయన రచించిన మ్యాజిక్ మ్యాజిక్ పుస్తకం విశేషంగా గుర్తింపు పొందింది. ఆ తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో వీటిని పంపిణీ చేశారు. 2024లో ఆసియా దేశాల్లోని ఈవెంట్ నిర్వాహకులంతా పాల్గొన్న ప్రత్యేక కార్యక్రమంలో అప్పటి తెలంగాణ రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చేతుల మీదుగా 'ఎక్సలెన్స్ ఇన్ ఈవెంట్ మేనేజ్‌మెంట్' అవార్డును అందుకున్నారు.

మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా...

'గాజు పెంకులపై నడుస్తాం. మేకులపై నిల్చుంటాం. అయినా మా శరీరానికి ఏం కాదు"..

ఇలాంటివి చేస్తూ మంత్ర శక్తులున్నాయంటూ కొందరు ప్రజల్ని బురిడీ కొట్టిస్తారు. ఇదంతా తంత్రం కాదు.. సైన్స్ అని ప్రయోగాత్మకంగా నిరూపించే జనవిజ్ఞాన వేదికలో ఆయన పాలుపంచుకుంటున్నారు. 2004 నుంచి ఆయన జెవివి కార్యక్రమాల్లో పాల్గొంటూ పలు ప్రదర్శనలు ఇస్తూ విద్యార్థులకు సైన్స్ అద్భుతాలను వివరిస్తున్నారు. ఇంట్లోని వస్తువులతో సైన్స్ ప్రయోగాల్లో ప్రోత్సహిస్తున్నారు. పాఠంలో క్లిష్టమైన అంశాలను మ్యాజిక్ జోడించి జాయ్‌ఫుల్ లెర్నింగ్‌ను ప్రోత్సహిస్తున్నారు. మ్యాజిక్‌లోని లాజిక్, సైన్స్ బిహైండ్ సీక్రెట్స్ లాంటి అంశాలపై వర్కుషాపులను సైతం నిర్వహిస్తున్నారు. విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వాన్ని, శాస్త్రీయ ఆలోచనలు కలుగజేసేలా అనేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

\- యడవల్లి శ్రీనివాసరావు

'మ్యాజిక్‌తో మోటివేషన్' లక్ష్యంగా...

విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేలా వినూత్న బోధనా పద్ధతులను రూపొందిస్తున్నా. యువతకు 'మ్యాజిక్ ద్వారా మోటివేషన్' పేరుతో భారతీయ మ్యాజిక్ వారసత్వాన్ని పరిచయం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నా. లైఫ్, కమ్యూనికేషన్ వర్కుషాపులు నిర్వహిస్తా. బహుముఖంగా మరింత ప్రభావవంతమైన పాత్ర పోషించాలనేదే లక్ష్యం.

\- దరియా సుజన్‌కుమార్

ఫిబ్రవరి 14న అఖిల్ 'లెనిన్'!

అక్కినేని అఖిల్ హీరోగా రాబోతున్న 'లెనిన్' చిత్రం విడుదల తేదీని తాజాగా చిత్రబృందం ప్రకటించింది. మురళీకృష్ణ అబ్బూరు దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. తాజా సమాచారం ప్రకారం 2026 ఫిబ్రవరి 14న ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేలా చిత్రబృందం ప్లాన్ చేస్తున్నారు. త్వరలోనే భాగ్యశ్రీ బోర్సే షూట్‌లో పాల్గొనబోతున్నారు. డిసెంబర్ చివరి వరకు షూట్ పూర్తి చేసి జనవరిలో పోస్ట్ ప్రొడక్షన్ పనులు చేయబోతున్నారని తెలుస్తోంది. అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌లో ఈ చిత్రం రూపొందుతోంది.

రైటర్స్ అసోసియేషన్ ఆఫ్ తెలుగు టెలివిజన్ కార్యవర్గం

హైదరాబాద్‌లోని ఫిలిం చాంబర్‌లో జరిగిన రైటర్స్ అసోసియేషన్ ఆఫ్ తెలుగు టెలివిజన్ సర్వసభ్య సమావేశం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంది. డాక్టర్ ఎం.వినోద్ బాల ప్రధాన ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. నూతన కమిటీ బుర్రా సాయి మాధవ్, అంజన్ మేగోటి సమక్షంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ప్రమాణస్వీకారం చేసింది. ప్రధాన కార్యదర్శి జి.శ్రీ శశాంక నివేదికను ప్రవేశపెట్టారు. అతిథులు శివ నాగేశ్వరరావు, కాదంబరి కిరణ్‌కుమార్ అభినందనలు తెలిపారు. కొమ్మనాపల్లి గణపతిరావు (అధ్యక్షులు), జి.శ్రీ శశాంక (ప్రధాన కార్యదర్శి), వై నరేంద్ర కుమార్ (కోశాధికారి), గోవర్ధన్ రెడ్డి (ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్)' బి.వి.రామారావు-(వైస్ ప్రెసిడెంట్), ఎం.ఫణి కుమార్- (జాయింట్ సెక్రెటరీ)లతోపాటుగా మరికొంతమంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. తొలుత ఇటీవల కీర్తిశేషులైన ప్రముఖ కవి, రచయిత అందెశ్రీకి సమావేశం రెండు నిముషాలపాటు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించింది.

'సైక్ సిద్ధార్థ' అలరిస్తుంది : శ్రీనందు

'నేను ఇండస్ట్రీకి వచ్చి పద్దెనిమిదేళ్లు అయ్యింది. నా నటన గురించి ఇప్పటివరకు నెగెటివ్ కామెంట్స్ రాలేదు. 'సైక్ సిద్ధార్థ' సినిమా నచ్చకపోతే ప్రెస్‌మీట్ పెట్టి ప్రేక్షకులకు క్షమాపణలు చెబుతా. ఒకవేళ ఫెయిలైనా ఇక్కడే ఉండి సినిమాలు చేస్తా. గెలిచేవరకు ప్రయత్నిస్తూనే ఉంటా. సైక్ సిద్ధార్థ చిత్రకథ ఇప్పుడున్న సొసైటీకి రిలేట్ అయ్యేలా, యూత్‌కి కనెక్ట్ అయ్యేలా ఉంటుంది. దర్శకులు రాఘవేంద్రరావు, సాయిరాజేష్, అనుదీప్ గార్లు మా సినిమా చూసి అభినందించారు. ఈ చిత్రం కోసం నేను పద్దెనిమిది కిలోలు తగ్గా. మా సినిమా అందర్నీ ఎంటర్‌టైన్ చేస్తుంది' అని కథానాయకుడు నందు అన్నారు. వరుణ్‌రెడ్డి దర్శకత్వంలో శ్రీ నందు, యామినీ భాస్కర్ జోడీగా నటించిన చిత్రం 'సైక్ సిద్ధార్థ'. రానా స్పిరిట్ మీడియా, నందునెస్ కీప్ రోలింగ్ పిక్చర్స్‌పై శ్రీ నందు, శ్యామ్‌సుందర్‌రెడ్డి తుడి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 12న విడుదల కానుంది. ట్రైలర్ విడుదల సందర్భంగా శ్రీనందు పై విధంగా మాట్లాడారు.

ఐశ్వర్య రాజేష్ 'ఓ సుకుమారి'

తిరువీర్ కీలకపాత్ర పోషిస్తున్న కొత్త సినిమా 'ఓ సుకుమారి'. ఈ చిత్రంలో ఐశ్వర్య రాజేష్ కీలకపాత్ర పోషించనున్నారు. తెలుగుతో పాటు తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో ఏకకాలంలో ఈ సినిమా విడుదల కాబోతుంది. గ్రామీణ నేపథ్యంలో రాబోతున్న ఈ సినిమాను గంగ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై మహేశ్వర రెడ్డి మూలి నిర్మిస్తుండగా భరత్ దర్శన్ దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి టైటిల్ పోస్టర్‌ను విడుదల చేశారు.

రెండో వన్డేలో టీమిండియాకు నిరాశ

- మార్‌క్రమ్ శతకం
- బ్రెవీస్, బ్రీజ్కే మెరుపులు
- భారీ లక్ష్యాన్ని ఛేదించిన దక్షిణాఫ్రికా
- కోహ్లి, గైక్వాడ్ సెంచరీలు వృథా

రాయ్‌పూర్: రెండో వన్డేలో టీమిండియా నిర్దేశించిన 359పరుగుల భారీ లక్ష్యాన్ని దక్షిణాఫ్రికా జట్టు సునాయాసంగా ఛేధించింది. 49.2 ఓవర్లలో కేవలం 6వికెట్లు కోల్పోయి 359పరుగులు చేసి దక్షిణాఫ్రికా జట్టు ఘన విజయం సాధించింది. మార్‌క్రమ్ శతకానికి తోడు బ్రెవీస్, బ్రీజ్కే అర్ధ సెంచరీలతో రాణించి దక్షిణాఫ్రికా గెలుపులో కీలకపాత్ర పోషించారు. తొలుత క్వింటన్ డికాక్(8) నిరాశపరిచినా.. కెప్టెన్ బవుమా(46)తో కలిసి మార్‌క్రమ్(110) సెంచరీ భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. ఆ తర్వాత బ్రెవీస్(54), బ్రీజ్కే(68) క్రీజ్‌లో నిలిచి సఫారీ జట్టును విజయ తీరాలకు చేర్చారు. చివర్లో బెచ్(26నాటౌట్; 15బంతుల్లో 3ఫోర్లు) మహరాజ్(10నాటౌట్) దక్షిణాఫ్రికాను మరో వికెట్ పడకుండా మ్యాచ్‌ను ముగించారు. భారత బౌలర్లు అర్ష్‌దీప్, ప్రసిధ్ కృష్ణకు రెండేసి, హర్షిత్, కుల్దీప్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారతజట్టు నిర్ణీత 50 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 358పరుగుల భారీస్కోర్‌ను నమోదు చేసింది. రోహిత్ శర్మ(14), జైస్వాల్ కలిసి తొలి వికెట్‌కు 40 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ఆ తర్వాత రోహిత్ ఔటైనా.. మరో ఓపెనర్ జైస్వాల్(22) ధనాధన్ ఇన్నింగ్స్‌తో మెరిసాడు. వీరిద్దరి తర్వాత తొలి వన్డే హీరో విరాట్ కోహ్లి(102)కి తోడు రుతురాజ్ గైక్వాడ్(105) జోడీ స్కోర్‌ను పరుగులెత్తించారు. రుతురాజ్ గైక్వాడ్ అద్భుతంగా బ్యాటింగ్ చేశాడు. మరో వికెట్ పడగకుండా జాగ్రత్త పడుతూ పరుగుల వరద పారించారు. ఈ క్రమంలోనే రుతురాజ్ కేవలం 77 బంతుల్లోనే కెరీర్‌లో రెండో సెంచరీని నమోదు చేశాడు. 82 బంతుల్లో 12 ఫోర్లు, రెండు సిక్సర్ల సహాయంతో 105 పరుగులు చేశాడు. మరో ఎండ్‌లో విరాట్ సైతం అద్భుత ఫామ్‌ను కొనసాగించాడు. రాంచీ వన్డేలో సెంచరీతో కదం తొక్కిన విరాట్.. అదే ఫామ్‌తో రాయ్‌పూర్ వన్డేలో చెలరేగాడు. ఈ క్రమంలో వన్డేలో కింగ్ కోహ్లి 93 బంతుల్లో ఏడు ఫోర్లు, రెండు సిక్సర్ల సహాయంతో 102 పరుగులు చేశాడు. ఈ వన్డేలోనూ సెంచరీ చేసి వన్డేల్లో తన సెంచరీల సంఖ్యను 53కు పెంచుకున్నాడు. రుతురాజ్-విరాట్ జోడీ మూడో వికెట్‌కు అజేయంగా 156 బంతుల్లో 195 పరుగులు చేశారు. చివర్లో కెప్టెన్ కేఎల్ రాహుల్ సైతం ధాటిగా బ్యాటింగ్ చేశాడు. 43 బంతుల్లో ఆరు ఫోర్లు, రెండు సిక్సర్ల సాయంతో 66 పరుగులతో అజేయంగా నిలిచాడు. ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా(24) సహకారం అందించాడు. దాంతో టీమిండియా నిర్ణీత 50 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 358 పరుగుల భారీ స్కోర్ చేయగలిగింది. దక్షిణాఫ్రికా బౌలర్లలో యాన్సెన్‌కు రెండు, బర్గర్, ఎన్గిడికి చెరో వికెట్ దక్కాయి. దీంతో మూడు వన్డేల సిరీస్‌లో ఇరుజట్లు 1-1తో సమంగా నిలువగా.. మూడో, చివరి వన్డే విశాఖపట్నం వేదికగా శనివారం జరగనుంది.

స్కోర్‌బోర్డు..

ఇండియా ఇన్నింగ్స్: జైస్వాల్ (సి)బోచ్ (బి)యాన్సెన్ 22, రోహిత్ (సి)డికాక్ (బి)బర్గర్ 14, కోహ్లి (సి)మార్‌క్రమ్ (బి)ఎన్గిడి 102, గైక్వాడ్ (సి)జోర్జి (బి)యాన్సెన్ 105, కెఎల్ రాహుల్ (నాటౌట్) 66, సుందర్ (రనౌట్)బోచ్/డికాక్ 1, జడేజా (నాటౌట్) 24, అదనం 24. (50 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి) 358పరుగులు. **వికెట్ల పతనం:** 1/40, 2/62, 3/257, 4/284, 5/289 **బౌలింగ్:** జైస్వాల్ 6.1-0-43-1, ఎన్గిడి 10-1-51-1, యాన్సెన్ 10-0-63-2, మహరాజ్ 10-0-70-0, బోచ్ 8-0-79-0, మార్‌క్రమ్ 5.5-0-48-0

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: మార్‌క్రమ్ (సి)గైక్వాడ్ (బి)హర్షిత్ రాణా 110, డికాక్ (సి)సుందర్ (బి)ఆర్ష్‌దీప్ 8, బవుమా (సి)హర్షిత్ రాణా (బి)ప్రసిద్ కృష్ణ 46, బ్రిజ్కే (ఎల్‌బి)ప్రసిధ్ 68, బ్రెవీస్ (సి)జైస్వాల్ (బి)కుల్దీప్ 54, జోర్జి (రిటైర్డ్ హర్ట్) 17, యాన్సెన్ (సి)గైక్వాడ్ (బి)ఆర్ష్‌దీప్ 2, బోచ్ (నాటౌట్) 26, కేశవ్ మహరాజ్ (నాటౌట్) 10, అదనం 18. (49.2ఓవర్లలో 6వికెట్ల నష్టానికి) 359పరుగులు. **వికెట్ల పతనం:** 1/26, 2/127, 3/197, 4/289, 5/317, 6/322 **బౌలింగ్:** ఆర్ష్‌దీప్ 10-0-54-2, హర్షిత్ రాణా 10-0-70-1, ప్రసిధ్ కృష్ణ 8.2-0-82-2, సుందర్ 4-0-28-0, జడేజా 7-10-41-0, కుల్దీప్ 10-0-78-1.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం-ప్రజల పక్షం

దినపత్రికలో ఉద్యోగ అవకాశాలు
జర్నలిజం కాలేజీలో శిక్షణ

- సబ్ ఎడిటర్లు
- రిపోర్టర్లు
- వెబ్ జర్నలిస్టులు

తెలుగులో వ్రాయగలిగి ఉండాలి
వర్తమాన, సామాజిక, ఆర్థిక రాజకీయాలపై అవగాహన
జర్నలిజంపై ఆసక్తి కలిగి ఉంటే..
బయోడేటాను మెయిల్ చేయగలరు

కనీస విద్యార్హత : డిగ్రీ చదివినవారు

సంప్రదించాల్సిన అడ్రస్: ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, తాడేపల్లి, గుంటూరు జిల్లా
prajasakti.hr@gmail.com
ఫోన్: 94940 98968, www.prajasakti.com

చివరి తేదీ 2025 డిసెంబర్ 10

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68